www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
పేజీలు: 14
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 168
సోమవారం | 15-9-2025
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: నవమి రా.1.32 తదుపరి దశమి; నక్షత్రం: మృగశిర ఉ.7.32 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: మ.3.39-5.12; దుర్ముహూర్తం: మ.12.34-1.22, మ.2.59-3.48; అమృతఘడియలు: రా.09.05-రా.10.38; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.06; సూర్యాస్తమయం: సా.6.13
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



వార్.. వన్ సైడే

ఆసియా కప్ గ్రూప్ మ్యాచ్‌లో భారత్ చేతిలో పాకిస్థాన్ చిత్తు

- ఏడు వికెట్ల తేడాతో టీమిండియా ఘన విజయం
- బౌలింగ్‌లో అదరగొట్టిన కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, బుమ్రా
- బ్యాటింగ్‌లో సూర్యకుమార్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ మెరుపులు 11
- పాక్ క్రికెటర్లకు కరచాలనం ఇవ్వకుండా మైదానాన్ని వీడిన భారత ఆటగాళ్లు



పహల్గాం ఉగ్రదాడి మృతుల కుటుంబసభ్యులకు మేం అండగా ఉంటాం. వారికి మా సంఘీభావాన్ని తెలియజేస్తున్నాం. ఈ విజయాన్ని భారత సైన్యానికి అంకితం ఇస్తున్నాం.

- సూర్యకుమార్ యాదవ్, ఇండియా కెప్టెన్

పహల్గాంలో జరిగిన ఘోరాన్ని మరిచారా? ఆపరేషన్ సిందూర్‌కు అర్థం లేకుండా చేస్తారా? ఉగ్రదాడి నెత్తురు తడి ఆరకముందే శత్రు దేశంతో ఆటలా? పాకిస్థాన్‌తో మ్యాచ్‌ను బహిష్కరించాల్సిందే..!! అంటూ దేశంలోని వివిధ వర్గాలు.. ముఖ్యంగా పహల్గాం ఉగ్రదాడి బాధిత కుటుంబాల నుంచి ఎదురైన విమర్శలు, ఒత్తిడుల మధ్య ఆసియా కప్ గ్రూప్-ఏ మ్యాచ్‌లో పాక్‌తో తలపడిన భారత క్రికెట్ జట్టు సత్తా చాటింది. బౌలింగ్, బ్యాటింగ్‌లో సమష్టిగా రాణించి పాక్‌ను చిత్తు చేసింది. యుద్ధ రంగంలోనే కాక క్రికెట్ మైదానంలోనూ పాక్‌పై భారత్‌దే పైచేయి అని నిరూపించింది. దుబాయ్ వేదికగా ఆదివారం జరిగిన పోరులో పాక్ నిర్దేశించిన 128 పరుగుల లక్ష్యాన్ని 15.5 ఓవర్లలోనే ఛేదించింది. 131 పరుగులు చేసి ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బ్యాటింగ్‌లో అభిషేక్ శర్మ(13 బంతుల్లో 31) మెరుపు ఆరంభం ఇవ్వగా.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (37 బంతుల్లో 47 నాటౌట్) ఓ భారీ సిక్స్‌తో మ్యాచ్‌ను ముగించాడు. అయూబ్(3/35) మినహా పాక్ బౌలర్లంతా టీమిండియా బ్యాటర్ల ముందు తేలిపోయారు. భారత స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్ (3/18), అక్షర్(2/18)కి తోడు స్టార్ పేసర్ బుమ్రా(2/28) దెబ్బకు నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 127 పరుగులు మాత్రమే చేయగలిగింది. మ్యాచ్ అనంతరం ప్రత్యర్థి ఆటగాళ్లకు కరచాలనం ఇవ్వకుండానే భారత ఆటగాళ్లు మైదానాన్ని వీడారు.

వెయ్యికి పైగా కాలేజీలు బంద్

నేటి నుంచి రాష్ట్రంలో ఉన్నత విద్యాసంస్థల నిరవధిక మూసివేత



బంద్ గురించి ప్రకటిస్తున్న తెలంగాణ ఉన్నత విద్యాసంస్థల సంఘాల సమాఖ్య ప్రతినిధులు

- ఫార్మసీ, బీఈడీ, ఇంజనీరింగ్ పరీక్షలు వాయిదా
- దసరాలోపు బకాయిలు 1200 కోట్లు ఇస్తేనే విరమణ
- 21, 22న 10 లక్షల విద్యార్థులతో హైదరాబాద్‌లో ధర్నా
- ఉన్నత విద్యాసంస్థల సంఘాల సమాఖ్య భేటీలో నిర్ణయం
- రాష్ట్రవ్యాప్తంగా 14 లక్షల మంది విద్యార్థులపై ప్రభావం
- గత సర్కారు పాపాన్ని.. ప్రస్తుత ప్రభుత్వం మోస్తోంది
- ఆ సానుభూతి ఉన్నందునే 20 నెలలు ఓపిక పట్టాం
- ఐఏఎస్‌లు ఒక్క నెల జీతం త్యాగానికి సిద్ధపడతారా?
- ఉన్నత విద్యా సంస్థల సంఘాల సమాఖ్య చైర్మన్ రమేశ్
- కళాశాలల యాజమాన్యాలతో ముగిసిన చర్చలు
- నేడు నిర్ణయం తీసుకుంటాం: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఉన్నత విద్యాసంస్థలూ సోమవారం నుంచి నిరవధిక బంద్ పాటించనున్నాయి. పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, నర్సింగ్, లా, మేనేజ్మెంట్, బీఈడీ ప్రైవేటు కాలేజీలన్నీ బంద్ అవుతాయని తెలంగాణ ఉన్నత విద్యా సంస్థల సంఘాల సమాఖ్య (ఫాతీ) ప్రకటించింది. బంద్ గురించి ఫాతీ ఈ నెల 12న ప్రభుత్వానికి నోటీసులు అందించిన సంగతి తెలిసిందే. దీనిపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి శనివారం సమాఖ్య ప్రతినిధులతో వేర్వేరుగా సమావేశమై బంద్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. దీనికి వారు.. ఇప్పటివరకూ ఉన్న మొత్తం బకాయిలు రూ.8 వేల కోట్లలో.. ఈ విద్యాసంవత్సరంలో

మిగతా 14వ పేజీలో...



పాక్ ఉగ్రవాదులకు కాంగ్రెస్ దన్ను!

- భారత సైన్యానికి మాత్రం మద్దతివ్వలేదు
- జాతి వ్యతిరేకులు, చొరబాటుదార్లకు అండ
- ఓటుబ్యాంకు రాజకీయాలే ఆ పార్టీకి ముఖ్యం
- చొరబాట్లతో సరిహద్దు రాష్ట్రాల జనాభా కూర్పు మార్చేందుకు కాంగ్రెస్ కుట్రలు
- జాతీయ భద్రతకు ఇది ముప్పు
- అసోం పర్యటనలో ప్రధాని మోదీ ఆగ్రహం
- శివభక్తుడిని.. హాలాహలం మింగగలను
- ప్రజలే నా యజమానులు.. దేవుళ్లు: మోదీ

మంగల్‌దోయీ, సెప్టెంబరు 14: కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకు రాజకీయాలే ప్రధానమని.. జాతి ప్రయోజనాలు దానికి పట్టవని ప్రధాని మోదీ విమర్శించారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో.. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీరు (పీవోకే)ల్లోని ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేసిన భారత సైన్యానికి ఆ పార్టీ మద్దతివ్వలేదని.. పైగా పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులకు అండగా నిలిచిందని ఆరోపించారు. ఇవాళ చొరబాటుదారులకు, జాతి వ్యతిరేక శక్తులకు ఆ పార్టీ అతిపెద్ద సంరక్షకురాలిగా మారిందని.. వారు దేశంలో శాశ్వతంగా ఉండిపోవాలని భావిస్తోందన్నారు. ఈశాన్య భారత పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన అసోంలోని దరంగ్ జిల్లా మంగల్‌దోయీలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. చొరబాట్ల ద్వారా సరిహద్దు ప్రాంతాల్లో

మిగతా 2వ పేజీలో...

జూబ్లీహిల్స్.. మనదే!

కాంగ్రెస్‌కే అనుకూలమని సర్వేలన్నీ చెబుతున్నాయ్

- అయినా ఉప ఎన్నికను తేలిగ్గా తీసుకోవద్దు.. ఇక్కడ గెలుపుతో గ్రేటర్‌లోనూ బలపడతాం
- భవిష్యత్తుకూ ప్రోత్సాహకంగా ఉంటుంది.. సానుభూతినే నమ్ముకున్న బీఆర్ఎస్
- నగర అభివృద్ధికి ఆ పార్టీ చేసిందేమీ లేదు.. హైదరాబాద్ అభివృద్ధిలో బీజేపీ పాత్రే లేదు
- పార్టీ కేంద్రీకృతంగా ప్రచారం చేయండి.. సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై డివిజన్ ఇన్‌చార్జుల సమావేశంలో సీఎం రేవంత్ దిశానిర్దేశం



జూబ్లీహిల్స్ నియోజకవర్గ డివిజన్ ఇన్‌చార్జిలతో సమావేశమైన సీఎం రేవంత్, చిత్రంలో పీసీసీ చీఫ్, మంత్రులు

హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి తాజా సర్వేలన్నీ కాంగ్రెస్ పార్టీకే అనుకూలంగా ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అయినా ఆషామాషీగా తీసుకోవద్దని, గెలుపే లక్ష్యంగా అందరూ సమన్వయంతో పని చేయాలని ఆ నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జులకు సూచించారు. జూబ్లీహిల్స్‌లో గెలుపుతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ కాంగ్రెస్ పార్టీ బలపడుతుందన్నారు. భవిష్యత్తు పాలనకు ఇది ప్రోత్సాహకంగా ఉంటుందని, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పార్టీకి మరింత ఉత్సాహాన్నిస్తుందని అన్నారు. హైదరాబాద్ శివారు జిల్లాలపైనా ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ఆ నియోజకవర్గ పరిధిలోని డివిజన్లకు వివిధ కార్పొరేషన్ చైర్మన్లను ఇన్‌చార్జులుగా కాంగ్రెస్ నియమించిన సంగతి తెలిసిందే. ఆదివారం వారితో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సమావేశమయ్యారు. తొలుత డివిజన్ ఇన్‌చార్జుల నుంచి ముఖ్యమంత్రి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. ఉప ఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రణాళికలను ప్రాథమ్యాల వారీగా వివరించారు. సానుకూల దృక్పథంతో ముందుకెళ్లాలని, పోలింగ్ బూత్‌ల వారీగా ప్రచార ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. నియోజకవర్గ సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న భరోసా, కాంగ్రెస్ పార్టీతోనే నియోజకవర్గ

మిగతా 13వ పేజీలో...

స్టార్టప్‌లకు సర్కారు బూస్టప్!

- ఏడాదికి 200 పైగా అంకుర సంస్థలకు వివిధ రంగాల్లో శిక్షణ, సలహాలు 13
- ఆర్థిక సాయం కోసం రూ.50 కోట్ల నిధి
- టీహబ్‌లో గూగుల్‌కు 2 అంతస్తుల్లో ఆఫీస్
- డిసెంబరు 9న ప్రారంభించనున్న సీఎం

దుకాణాల్లో జీఎస్టీ తగ్గింపు బోర్డులు తప్పనిసరి

- 350కి పైగా వస్తువుల ధరలు తగ్గుతాయి
- రాష్ట్రాలు పూర్తి స్థాయిలో అమలు చేయాలి
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల స్పష్టీకరణ 2

నేనేం తప్పు చేశా నాన్నా?

- వైద్యం చేయించలేక మూడేళ్ల కొడుకును చంపి, మూసీలో పారేసిన తండ్రి 3
- ఆపై, కొడుకు కనిపించడం లేదని ఫిర్యాదు
- విచారణలో బయటపడిన అసలు ఘోరం
- హైదరాబాద్‌లోని బండ్లగూడలో ఘటన

కంటి సంరక్షణకు 'హెల్ప్'లైన్ 2

99906 66872కు కాల్ చేస్తే దేశవ్యాప్తంగా ఉచిత సలహాలు, సూచనలు

హైదరాబాద్‌లో కుండపోత



- నాలాలు పొంగి ముగ్గురి గల్లంతు
- పలు ప్రాంతాలు అతలాకుతలం
- కొట్టుకుపోయిన వాహనాలు
- ముషీరాబాద్ బౌద్ధనగర్‌లో గంటన్నరలోనే 12 సెం.మీ. వర్షం 3
- రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు
- సిద్దిపేట జిల్లాలో అత్యధికంగా 24.3 సెం.మీ. వర్షపాతం

హైదరాబాద్‌లోని కృష్ణానగర్‌లో వరదలో కొట్టుకుపోతున్న బైక్



జలమయమైన బండ్లగూడ రోడ్డు



ఎన్టీఆర్ జిల్లాలోని కొండపల్లి కోట

కొండపల్లి సీమలో కాకతీయం

- ఆ వంశ ఆద్యుడు గుండన జన్మస్థలం ఏపీలోని 'కాకర్తి'
- నేలకొండపల్లిలో దొరికిన రాగి శాసనాల్లో ఆధారాలు
- నాడు ఇక్కడ సామంతులుగా 'కాకతీయ గుండన'
- ఆపై ప్రబల శక్తిగా మారిన కాకతీయ వంశీయులు
- 'కాకర్తి'ని గుర్తించే దిశగా చరిత్రకారుల అడుగులు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

కాకతీయుల మూలం ఎక్కడుంది? ఓరుగల్లు కేంద్రంగా తిరుగులేని పాలన సాగించిన రుద్రదేవుడు, గణపతి దేవుడు, రుద్రమదేవి, ప్రతాపరుద్ర వంటి పరాక్రముల పూర్వీకుల అడుగు జాడలు ఎక్కడ మొదలయ్యాయి? కాకతీయులకు ఆదిగా నిర్ధారించిన 'కాకతీయ గుండన' ఎక్కడివాడు? ఈ ప్రశ్నలు ఎప్పటి నుంచో వినిపిస్తున్నాయి. ఇటీవల లభించిన రాగి ఫలకాలపై లిఖించిన శాసనాలు, వాటిని పరిశోధించిన చరిత్రకారులు.. దీనికి సమాధానం

మిగతా 12వ పేజీలో...

యోగా గురువుపై వలపు వల

- అనారోగ్యం అంటూ వచ్చి ఆశ్రమంలో చేరి, గురువుకు దగ్గరై..
- ఫొటోలు, వీడియోలు తీసిన ఇద్దరు మహిళలు
- 2 కోట్లు ఇవ్వాలని, లేకుంటే అవి బయటపెడతామని బెదిరింపులు
- పోలీసులను ఆశ్రయించిన గురువు
- డబ్బులిస్తామని పిలిపించి ముఠాను పట్టుకున్న పోలీసులు



పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు

చేవెళ్ల/హైదరాబాద్ సిటీ/కార్వాన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆయనో యోగా గురువు.. హైదరాబాద్ శివార్లలో ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారు.. ఆరోగ్యం బాగోలేదంటూ ఆశ్రమానికి వచ్చిన ఇద్దరు మహిళలు ఆయనకు వలపు వల విసిరారు.. సన్నిహితంగా ఉన్నట్టు నటించి ఫొటోలు, వీడియోలు తీశారు.. వాటిని తమ ముఠా సభ్యులకు పంపి యోగా గురువును బ్లాక్‌మెయిల్ చేశారు. చివరికి పోలీసులకు పట్టుబడ్డారు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి

మిగతా 12వ పేజీలో...

అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో.. జనరిక్ మెడికల్ షాపులు

- ప్రస్తుతం 203 ఆస్పత్రుల్లో కేవలం 40 హాస్పిటళ్లలోనే జనరిక్ దుకాణాలు 13
- మిగతా ఆస్పత్రుల్లో నవంబరుకల్లా ఏర్పాటు
- ఎన్జీవోలు, జిల్లా సమాఖ్యలకు అవకాశం



నా మేధస్సు విలువ నెలకు 200 కోట్లు! 2

- నిజాయితీగా ఆర్జిస్తున్నా: గడ్కరీ
- 'ఈ-20 పెట్రోల్'లో ముడుపులపై కేంద్ర మంత్రి పరోక్ష స్పందన

'వలస' రాజ్యంలో కలకలం!

- ఇంగ్లండ్‌కు చట్టబద్ధంగా వచ్చినోళ్లు కొందరైతే శరణార్థులుగా వస్తున్న వలసదార్లు లక్షల్లో..
- ఆఫ్రికా, ముస్లిం దేశాల నుంచి రాక 2
- బ్రిటిషర్ల ఆందోళన.. 'మా దేశాన్ని మాకు ఇచ్చేయండి' అంటూ లండన్‌లో లక్ష మందికిపైగా ప్రదర్శన

మత్తుమందు తయారు చేసిన మేధ హైస్కూల్ సీజ్

- పాఠశాల అనుమతుల రద్దుకు రంగం సిద్ధం
- విద్యార్థులను వేరే బడుల్లో చేర్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్న అధికారులు 3
- రూ.1.09 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం
- 15 రోజుల్లో 12 మంది అరెస్టు: ఈగల్

పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడడమంటే..
ఆపరేషన్ సిందూర్ వృథా అయినట్టే

» పహల్గాం ఉగ్రదాడికి బలైనవారి కుటుంబసభ్యుల ఆగ్రహం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14: ఆసియా కప్-2025లో పాకిస్థాన్‌తో భారత్ క్రికెట్ మ్యాచ్ ఆడడంపై.. పహల్గాం ఉగ్రదాడిలో మరణించినవారి కుటుంబాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఉగ్రవాదానికి ఊత మిచ్చే దాయాది దేశంతో క్రికెట్ ఆడడమంటే.. పహల్గాం దాడికి ప్రతీకారంగా ఇండియా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' వృథా అయినట్టేనని పేర్కొంటున్నాయి. "ఇండియా-పాకిస్థాన్ మ్యాచ్ జరుగుతోందని తెలిసినప్పుడు మేం తీవ్రంగా కలత చెందాం. పాకిస్థాన్‌తో మనకు అసలు ఎలాంటి సంబంధాలూ ఉండకూడదు. మీరు మ్యాచ్ ఆడాలనుకుంటే.. ఉగ్రవాదుల బుల్లెట్లకు బలైన నా పదహారేళ్ల తమ్ముణ్ని నాకు తెచ్చివ్వండి" అని పహల్గాం ఉగ్రదాడిలో తన తండ్రిని, సోదరుణ్ని కోల్పోయిన సావన్ పర్మార్ డిమాండ్ చేశారు. ఆయన తల్లి కిరణ్ యతీశ్ పర్మార్ కూడా.. "ప్రధాని మోదీని నేను ఒక మాట అడగాలనుకుంటున్నా. అదేంటంటే.. 'ఆపరేషన్ సిందూర్' ఇంకా పూర్తికాకుంటే ఇప్పుడీ మ్యాచ్ ఎందుకు జరుగుతోంది? పహల్గాం ఉగ్రదాడి గాయాలు ఇంకా పచ్చిగానే ఉన్నాయి" అని అన్నారు.

పౌరుల ప్రాణాల కంటే డబ్బే ఎక్కువా: ఒవైసీ

హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నిత్యం దేశభక్తి ఉపన్యాసాలు చేస్తున్న పాలకులకు పౌరుల ప్రాణాల కంటే డబ్బే ఎక్కువయిందా అని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన 26 మంది పౌరుల ప్రాణాలు ఎక్కువా..? లేదా క్రికెట్ మ్యాచ్ ద్వారా వచ్చే డబ్బు ఎక్కువా..? అని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీశారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా దారుస్సలాంలోని పార్టీ ప్రధాన కార్యాలయ మైదానంలో శనివారం రాత్రి జరిగిన బహిరంగ సభలో ఒవైసీ ప్రసంగించారు. నీరు, రక్తం కలిసి ప్రవహించలేవని, ఉగ్రవాదం, చర్చలు సాధ్యం కావని ప్రధాని మోదీ మాట్లాడిన మాటలను ఉటంకిస్తూ క్రికెట్ మ్యాచ్‌తో బీసీసీఐకి సుమారు 3వేల కోట్ల వరకు ఆదాయం వస్తుండవచ్చని పేర్కొన్నారు. కాని పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన 26 మంది జీవితాలకు విలువ లేదా అని ప్రశ్నించారు. నిరంతరం దేశభక్తి జపం చేస్తున్న బీజేపీ నాయకులకు పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడే విషయంలో దేశభక్తి గుర్తుకు రావడం లేదా..? అని నిలదీశారు.

'క్రూర' మృగాలను చంపొచ్చు!

» ముసాయిదా బిల్లుకు కేరళ క్యాబినెట్ ఆమోదం

తిరువనంతపురం, సెప్టెంబరు 14: నివాస ప్రాంతంలోకి ప్రవేశించి ఒక వ్యక్తిపై దాడి చేసి గాయపరిచే ఏ క్రూర మృగాన్నైనా చంపేందుకు చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ ఆదేశించేలా అధికారం కల్పించేందుకుగాను వన్యప్రాణి సంరక్షణ చట్టం, 1972కు సవరణ చేసే ముసాయిదా బిల్లుకు కేరళ క్యాబినెట్ శనివారం ఆమోదం తెలిపింది. కేంద్ర చట్టానికి ఒక రాష్ట్ర ప్రభుత్వం సవరణ తీసుకువస్తుండటం దేశంలో ఇదే మొదటిసారి. ఈ మధ్యకాలంలో మనుషులపై జంతు దాడి ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో తాజా నిర్ణయం తీసుకున్నారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ఈ ముసాయిదాపై చర్చ జరిగే అవకాశం ఉంది.

శత్రు జలాంతర్గాముల ఉనికిని పసిగట్టే 'ఆండ్రోత్'

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14: భారత నౌకాదళంలోకి మరో స్వదేశీ యుద్ధ నౌక వచ్చి చేరింది. జలాంతర్గాముల ఉనికిని పసిగట్టే యాంటీ సబ్‌మెరైన్ వార్‌షిప్ 'ఆండ్రోత్' శనివారం భారత నావికాదళంలో అడుగుపెట్టింది. కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్, ఇంజనీర్స్ (జీఆర్ఎస్ఈ) దీన్ని స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించింది. ఈ సంస్థ నిర్మిస్తున్న 8యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్ (ఏఎస్‌డబ్ల్యూ ఎస్‌డబ్ల్యూసీఎస్) శ్రేణి నౌకల్లో ఇది రెండోది. దీనికంటే ముందు నిర్మించిన ఐఎన్ఎస్ ఆర్నాలా ఈ ఏడాది జూన్ 18న నేవీలోకి చేరింది. తాజాగా విధుల్లోకి చేరిన యుద్ధనౌకకు లక్ష దీవుల్లోని 'ఆండ్రోత్' అనే దీవి పేరు పెట్టారు. దీని పొడవు దాదాపు 77 మీటర్లు. దీనిలో అత్యాధునిక తేలికపాటి టోర్పిడోలు, జలాంతర్గామి విధ్వంసక రాకెట్లు ఉన్నాయి.

ఐరాస హక్కుల కమిటీ ఛైర్‌పర్సన్‌గా ప్రీతి సరన్



న్యూయార్క్, సెప్టెంబరు 14: ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కుల కమిటీ ఛైర్‌పర్సన్‌గా భారత్‌కు చెందిన మాజీ దౌత్యాధికారిణి ప్రీతి సరన్ నియమితులయ్యారు. జెనీవా కేంద్రంగా ఉన్న ఈ కేంద్రం ఆర్థిక, సామాజిక హక్కుల విషయమై సభ్య దేశాల మధ్య కుదిరిన అంతర్జాతీయ ఒప్పందాల అమలును పర్యవేక్షిస్తుంది. ఇది ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల వ్యాప్తికి భారత్ చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ ఉన్నత పదవి ఇచ్చినట్టు ఆ సంస్థ ప్రకటించింది.

బాస్‌ను సెలవు అడిగిన 10 నిమిషాలకే ఆగిన ఉద్యోగి గుండె

» కార్డియాక్ అరెస్టుకు గురై 40 ఏళ్ల వ్యక్తి హఠాన్మరణం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14: జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేం అనే దానికి నిదర్శనంగా నిలిచే ఘటన ఇది. "సార్.. వెన్నునొప్పి విపరీతంగా ఉంది. విధులకు హాజరు కాలేను. ఈ రోజు నాకు సెలవు ఇవ్వండి సార్".. ఉద్యోగాలు చేసుకునే వాళ్లు అనారోగ్యానికి గురైనప్పుడు ఏదో ఓ సందర్భంలో ఇలాంటి సందేశాన్ని తమ పైఅధికారికి పంపే ఉంటారు. కేవీ అయ్యర్ అనే ఓ వ్యక్తికి కూడా శంకర్(40) అనే తన సహోద్యోగి నుంచి ఈ సందేశం వచ్చింది. తన బృందంలోని వారికి సెలవులు మంజూరు చేసే అధికారం కలిగిన అయ్యర్‌కు ఇలాంటి సందేశాలు సర్వసాధారణమే అయినా... శంకర్ పంపిన మెసేజ్ మాత్రం అతనికి కలలో కూడా ఊహించని షాకిచ్చింది. ఎందుకంటే సిక్ లీవ్ కావాలని మెసేజ్ పెట్టిన 10 నిమిషాలకే శంకర్ ఈ లోకాన్ని వీడారు. తన పైఅధికారి అయ్యర్‌కు ఉదయం 8:37 గంటలకు మెసేజ్ పెట్టిన శంకర్.. సరిగ్గా పది నిమిషాల తర్వాత ఉదయం 8:47 గంటలకు కార్డియాక్ అరెస్టుకు గురై కన్నుమూశారు. శంకర్ మరణ వార్తను ఉదయం 11 గంటలప్పుడు తెలుసుకున్న అయ్యర్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ధూమపానం, మద్యపానం లాంటి అలవాట్లు లేని శంకర్ ఇలా కార్డియాక్ అరెస్టుకు గురై హఠాత్తుగా మరణించడంతో.. జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేం కదా..!! అంటూ అయ్యర్ తన ఆవేదనను ఎక్స్‌లో పంచుకున్నారు.

పాక్ ఉగ్రవాదులకు కాంగ్రెస్ దన్ను!

(మొదటి పేజీ తరువాయి)



'అసోం బయో ఇథనాల్' సంస్థ సిబ్బంది, వెదురు రైతులతో మాట్లాడుతున్న మోదీ

భూమిని ఆక్రమించుకుని జనాభా కూర్పును మార్చే కుట్రలు జరుగుతున్నాయని.. ఇది జాతీయ భద్రతకు ప్రమాదమని.. దీనిని బీజేపీ అనుమతించదని తేల్చిచెప్పారు. అసోం భూమిపుత్రుడు, ప్రసిద్ధ గాయకుడు భూపేన్ హజారికాకు కేంద్రం దేశ అత్యున్నత పౌరపురస్కారం 'భారత రత్న' ప్రకటించినప్పుడు.. బీజేపీ గాయకులకు, డాన్సర్లకు అవార్డులిస్తోందంటూ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడొకరు చేసిన వ్యాఖ్యల వీడియోను సీఎం హిమంత బిశ్వ శర్మ శనివారం రాత్రి తనకు చూపారని ప్రధాని తెలిపారు. '1962లో చైనా దురాక్రమణ సమయంలో నాటి ప్రధాని నెహ్రూ అసోం ప్రజలకు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలు మాయని మచ్చలా మిగిలాయి. ఇప్పుడు హజారికాకు భారతరత్న ఇస్తే.. కాంగ్రెస్ ఆయనకు చేసిన అవమానం పుండుపై కారం చల్లినట్లుగా ఉంది. ఇది నన్నెంతో బాధిస్తోంది. హజారికా కన్న కలలను నెరవేర్చేందుకు అసోంలోని డబుల్ ఇంజన్ ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని చెప్పారు. ఈ రాష్ట్రంలో ఉగ్రవాదం, అశాంతికి కాంగ్రెసే కారణమన్నారు. అసోం వారసత్వాన్ని, చిహ్నాలను విస్మరించిందని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం ఈ రాష్ట్రాన్ని టూరిజం, వాణిజ్య హబ్‌గా మారుస్తోందన్నారు. రాష్ట్రంలో చొరబాటుదార్లు ఆక్రమించుకున్న భూమిని విముక్తి చేసి.. స్థానిక రైతులు సాగు చేసే అవకాశం కల్పిస్తున్నారని సీఎం హిమంతను ప్రశంసించారు. చొరబాటుదార్ల భూకబ్జాలను, మహిళలు, బాలికలకు అవమానాలను సహించబోమని చెప్పారు. చొరబాటుదార్ల నుంచి అసోంను కాపాడేందుకు పోరాటం చేస్తామన్నారు. వారిని ఇక్కడి కొందరు కాపాడుతున్నారని దుయ్యబట్టారు. 21వ శతాబ్దంలో పాతికేళ్లు గడిచిపోయాయని.. తదుపరి అధ్యాయం ఈశాన్య, తూర్పు భారతాలదేనని స్పష్టంచేశారు. దేశాభివృద్ధికి, పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం స్వదేశీ ఉత్పత్తులనే కొనుగోలు చేయాలని పిలుపిచ్చారు. కాగా.. మంగల్‌దోయాలో ప్రధాని రూ.5,300 కోట్ల విలువ చేసే ఆరోగ్య, మౌలిక వసతుల ప్రాజెక్టులకు, రూ.1,200 కోట్లతో 2.9 కిలోమీటర్ల పొడవైన నరేంగి-కురువా వంతెనకు శంకుస్థాపన చేశారు. దరంగ్ వైద్య కళాశాల-ఆస్పత్రి నిర్మాణాన్ని ప్రారంభించారు. కామరూప్, దరంగ్ జిల్లాలు, మేఘాలయలోని రీభోయ్‌లను కలుపుతూ 118.5 కిలోమీటర్ల పొడవైన గౌహతి రింగ్‌రోడ్డు ప్రాజెక్టుకు కూడా శంకుస్థాపన చేశారు. దీని అంచనా వ్యయం రూ.4,530 కోట్లు.

బిహార్లో నేడు మోదీ పర్యటన

ప్రధాని మోదీ సోమవారం ఉత్తర బిహార్లోని పూర్ణియాలో పర్యటించనున్నారు. రూ.36 వేల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు. త్వరలో ఈ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. పూర్ణియాలోనే కొత్తగా అభివృద్ధిచేసిన ఎయిర్‌పోర్టు టెర్మినల్‌ను, ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన జాతీయ మఖానా (తామర విత్తనాలు) బోర్డును కూడా ప్రారంభించనున్నారు.


చమురు దిగుమతుల నియంత్రణ

భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్నా.. ముడిచమురు, గ్యాస్ కోసం విదేశాలపై ఆధారపడాల్సి వస్తోందని ప్రధాని చెప్పారు. ఈ దిగుమతులు తగ్గించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోందని నుమాలిగఢ్ ర్యాలీలో తెలిపారు. శిలాజ ఇంధనాలు, చమురు నిక్షేపాల అన్వేషణ, హరిత ఇంధన ఉత్పత్తిపై దృష్టి సారించామన్నారు. ఇథనాల్ ప్రధాన ప్రత్యామ్నాయ ఇంధన వనరు అని.. నుమాలిగఢ్‌లో తాను ప్రారంభించిన బయో ఇథనాల్ రిఫైనరీతో రైతులు, గిరిజనులకు మేలు కలుగుతుందని తెలిపారు.

శివభక్తుడిని.. హాలాహలం మింగగలను

బిహార్లో ఇటీవల కాంగ్రెస్, ఆర్జేడీలు తనను, తన తల్లిని అసభ్య పదజాలంతో దూషించడాన్ని మోదీ ప్రస్తావించారు. 'నేను శివభక్తుడిని.. దూషణల హాలాహలాన్ని మింగుతాను. నేను ప్రజల ముందు బాధపడుతుంటే.. యావత్ కాంగ్రెస్ ఎకోసిస్టమ్ నాపై దాడిచేస్తుందని తెలుసు. ప్రజలే నా యజమానులు.. దేవుళ్లు.. నా రిమోట్ కంట్రోల్. వారి ముందు గాకపోతే ఎవరి ముందు నా బాధ చెప్పుకొంటాను? నా వద్ద మరే రిమోట్ కంట్రోలూ లేదు' అని వ్యాఖ్యానించారు.

లోకం తీరు



9990666872

» కంటి సంరక్షణకు జాతీయ 'హెల్ప్'లైన్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14: సరైన సమయంలో సరైన కంటి వైద్యుడిని సంప్రదించకపోవడం వల్ల దేశంలో అనేక మంది కంటిచూపు కోల్పోతున్నారు. అయితే ఈ పరిస్థితిని అధిగమించి.. దేశ పౌరులందరికీ కంటి సంరక్షణ అందించే దిశగా కీలక ముందడుగు పడింది. కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని వైద్యులతో అనుసంధానించడానికి డిల్లీలోని ప్రముఖ నేత్ర వైద్యుల బృందం జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 9990666872ను ప్రారంభించింది. లాభాపేక్షలేని సంస్థ 'సైట్ సార్తి ఇండియా ఫౌండేషన్' ఆధ్వర్యంలో ప్రారంభించిన ఈ హెల్ప్‌లైన్ నంబర్ ద్వారా.. దేశవ్యాప్తంగా కంటి సమస్యలతో పోరాడుతున్న ఎవరికైనా టెలిఫోన్, వీడియో కాలింగ్ ద్వారా కంటి వైద్య నిపుణులు చికిత్సకు సంబంధించిన సలహాలు, సూచనలు ఉచితంగా అందిస్తారు. డిల్లీలోని ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ ఇకేడాలాల్ నేతృత్వంలో పనిచేసే ఈ హెల్ప్‌లైన్ నంబర్‌కు.. దేశంలోని అన్ని ప్రాంతాల వారు ఫోన్‌చేసి తమ సమస్యలు తెలియజేవచ్చు.

హిడ్మా ఆచూకీ తెలిసింది

» త్వరలోనే పట్టుకుంటాం: బస్తర్ ఐజీ

చర్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శి మాడ్వి హిడ్మా ఆచూకీ తెలిసిందని.. అతన్ని త్వరలోనే పట్టుకుంటామని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. హిడ్మా బలగాల రాడార్‌లోకి వచ్చాడని, అతడిని పట్టుకోవడమే ఆలస్యమన్నారు. అడవుల్లో ఉంటున్న మావోయిస్టులు కూడా లొంగిపోవాలని ఐజీ సూచించారు. కాగా, బీజాపూర్ జిల్లా చిల్లమర్క గ్రామంలో సోమవారం భద్రతా బలగాలు నూతన పోలీసు క్యాంప్‌ను ఏర్పాటు చేశాయి. చిల్లమర్క మావోయిస్టు ప్రాబల్య ప్రాంతం. ఇక్కడ గతంలో అనేక ఎన్‌కౌంటర్లు జరిగాయి.

దుకాణాల్లో జీఎస్టీ తగ్గింపు బోర్డులు తప్పనిసరి



చెన్నై, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దుకాణాల్లో జీఎస్టీ తగ్గింపు వివరాలకు సంబంధించిన బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అన్ని రాష్ట్రాలకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు దేశవ్యాప్తంగా ఈ నెల 22 నుంచి జీఎస్టీ పన్ను తగ్గింపు అమల్లోకి వస్తుందని చెప్పారు. ఆదివారం చెన్నైలో 'వికసిత్ భారత్ దిశగా పన్నుల సంస్కరణలు' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రధాని మోదీ ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ 350కి పైగా వస్తువుల ధరలు గణనీయంగా తగ్గేలా జీఎస్టీ తగ్గించారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని పూర్తిస్థాయిలో అమలయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గతంలో నాలుగు కేటగిరీలు (5, 12, 18, 28)గా విధించిన పన్నులను ప్రస్తుతం రెండు కేటగిరీలకు (5, 18 శాతం) కుదించామని చెప్పారు. దీంతో 140 కోట్లమంది ప్రజలు పన్నుభారం నుంచి ఉపశమనం పొందుతారని వివరించారు.

30-40 లక్షలకే మిగ్-21 యుద్ధ విమానాలు!

» బారులు తీరుతున్న పలు సంస్థలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14 : భారత వాయుసేన అమ్ముల పొదిలో ఇప్పటి వరకు కీలకంగా ఉన్న మిగ్-21 యుద్ధ విమానాలు 30-40 లక్షలకే అమ్మకానికి సిద్ధం కానున్నాయి. వీటిని కొనేందుకు పలు సంస్థలు బారులు తీరుతున్నాయి. ఇప్పటికే పలు ప్రభుత్వ సంస్థలు, విద్యా సంస్థలు, పబ్లిక్, ప్రైవేటు సంస్థలు వీటి కోసం దరఖాస్తు చేసుకోవడంతో చాంతాడంత జాబితా తయారైనట్లు వాయుసేన వర్గాల సమాచారం. అయితే వీటిని విక్రయించేటప్పుడు వాటిలోని ఇంజన్, ఇతర వ్యవస్థలను తొలగించి ఎయిర్‌ఫ్రేమ్‌ను మాత్రమే అప్పగిస్తారు. వాయుసేనలో 1963లో ప్రవేశపెట్టిన ఈ యుద్ధ విమానాలు పలు యుద్ధాల్లో కీలక పాత్ర వహించాయి. ఈ నెల 26న చండీగఢ్‌లో మిగ్-21ల తుది స్క్వాడ్రన్‌కు వీడ్కోలు పలకనున్నారు.

నా మేధస్సు విలువ నెలకు 200 కోట్లు!



గడ్కరీ

నాగ్‌పూర్, సెప్టెంబరు 14: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన హరిత ఇంధనం 'ఇథనాల్(ఈ)-20'లో ముడుపులు ముట్టాయని, వ్యక్తిగత లబ్ధి చేకూరిందని తనపై వస్తున్న విమర్శలకు కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పరోక్షంగా స్పందించారు. తాను దొడ్డిదారుల్లో సంపాయించాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. తన మేధస్సు విలువ నెలకు రూ.200 కోట్లని, నిజాయితీగా ఆర్జిస్తున్నానని చెప్పారు. తనకు డబ్బుకు లోటు లేదన్నారు. చవక, ప్రత్యామ్నాయ ఇంధన వనరుగా కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ కలిపిన పెట్రోల్‌ను ప్రోత్సహిస్తోంది. అయితే.. గడ్కరీ కుమారుడి నేతృత్వంలో రెండు ప్రముఖ ఇథనాల్ కంపెనీలు నడుస్తున్నాయి. దీనిని ప్రస్తావిస్తూ ఇటీవల సోషల్ మీడియాలో విమర్శలు చెలరేగాయి. తాజాగా నాగ్‌పూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన గడ్కరీ ఈ విషయాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. తన కుమారుడికి పలు సూచనలు, సలహాలు మాత్రమే ఇస్తానని, తప్పుడు పనులు చేయమని ఎప్పటికీ చెప్పనని తెలిపారు.

బిహార్‌లోని 243 సీట్లలో పోటీ చేస్తాం

ఆర్జేడీ నేత తేజస్వి సంచలన వ్యాఖ్యలు.. మహా కూటమిలో సీట్ల సర్దుబాటు రచ్చ




పట్నా/న్యూఢిల్లీ, సెప్టెంబరు 14: బిహార్‌లో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో మహాకూటమిలో సీట్ల సర్దుబాటు వ్యవహారం తీవ్ర వివాదానికి దారితీస్తోంది. ఈ నేపథ్యంలో కూటమిలోని రాష్ట్రీయ జనతా దళ్(ఆర్జేడీ) నేత తేజస్వి యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాము మొత్తం 243 స్థానాల్లోనూ పోటీ చేస్తామని చెప్పారు. ముజఫర్‌పూర్ జిల్లాలోని కంటి ప్రాంతంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "మళ్లీ మనం తిరిగి అధికారంలోకి వస్తున్నాం. మొత్తం 243 స్థానాల్లో మనమే పోటీ చేస్తున్నాం." అని ప్రకటించారు. అంతేకాదు, ముజఫర్‌పూర్ సహా పలు నియోజకవర్గాల పేర్లు చెబుతూ.. ఆయా స్థానాల్లో కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. వాస్తవానికి ముజఫర్‌పూర్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మరోవైపు, ఓటర్ అధికార్ యాత్ర విజయవంతం కావడంతో రాహుల్ గాంధీతో బిహార్‌లో మరిన్ని యాత్రలకు కాంగ్రెస్ పార్టీ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఓట్ల చోరీ, నిరుద్యోగం, వలసలు, విద్య అంశాలపై ఉద్యమాలతో ఎన్నికల ముందు పార్టీ బలం పుంజుకుంటోందని, రాహుల్‌గాంధీతో రాష్ట్రంలో మరో 9యాత్రలకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

రాహుల్ ఆరోపణలపై విచారణకు ఆదేశించాల్సింది

ప్రతిపక్ష నేతపై అభ్యంతరకర వ్యాఖ్యలు సరికాదు

» ఈసీ ఆత్మపరిశీలన చేసుకోవాలి

» మాజీ సీఈసీ ఖురేషీ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 14: 'ఓట్ల చోరీ' అంశంపై ఎన్నికల కమిషన్(ఈసీ) స్పందించిన తీరును మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్.వై. ఖురేషీ తప్పుబట్టారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసే బదులు ఆయన చేసిన ఆరోపణలపై దర్యాప్తునకు ఆదేశించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. 'హైడ్రోజన్ బాంబు' వంటి పదాలతో రాహుల్ తన రాజకీయ వాక్చాతుర్యాన్ని జోడిస్తూ ఆరోపణలు చేశారని, అయినా వాటిపై సమగ్రంగా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని ఆదివారం ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు. బిహార్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఈసీ నిర్వహించిన విధానాన్ని కూడా ఆయన విమర్శించారు. ఇది సమస్యలను ఆహ్వానించడమేనని అన్నారు. ఎన్నికల కమిషన్‌ను ఎవరైనా విమర్శిస్తే ఈసీ మాజీ కమిషనర్‌గానే కాకుండా ఒక భారత పౌరుడిగా తనకు తీవ్ర ఆవేదన కలుగుతుందని చెప్పారు. కమిషన్ పురోగతిలో తనకూ పాత్ర ఉందన్నారు. ఎన్నికల విషయంలో తమ పనితీరును ఈసీ ఆత్మపరిశీలన చేసుకోవాలని ఖురేషీ సూచించారు. తమ నిర్ణయాలను ప్రభావితం చేసే అన్ని రకాల శక్తులను, ఒత్తిళ్లను కమిషన్ అధికారులు ఎదుర్కోవాలన్నారు. వారు ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవాలని, ప్రతిపక్ష పార్టీల విశ్వాసాన్ని చూరగొనాలని సూచించారు. తాను సీఈసీగా ఉన్నప్పుడు ప్రతిపక్షాలకు ప్రాధాన్యం ఇచ్చానని గుర్తుచేసుకున్నారు. తనను కలవడానికి ప్రతిపక్ష నేతలు అపాయింట్‌మెంట్ కోరితే వెంటనే ఇచ్చేవాడినని తెలిపారు. ఇప్పుడు ప్రతిపక్షాలు తరచుగా సుప్రీంకోర్టుకు వెళ్లాల్సి వస్తోందని, తమకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని, తమ మాట వినేవారే లేరని 23 రాజకీయ పార్టీలు ఆరోపిస్తున్నాయని చెప్పారు. "వారు చెప్పేది వినండి, వారితో మాట్లాడండి, వారు ఏదైనా చిన్న సాయం కోరితే .. అది మరొకరికి నష్టం కలిగించనిది అయితే చేయండి" అని మాజీ సీఈసీ సూచించారు. లక్షలాది మందికి ప్రాతినిధ్యం వహిస్తూ, వారి అభిప్రాయాలను వినిపిస్తున్న ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై అఫిడవిట్ సమర్పించమని కోరే బదులు దర్యాప్తునకు ఈసీ ఆదేశించి ఉండాల్సిందన్నారు. "మీరు తీసుకొచ్చే కొత్త ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేవని అఫిడవిట్ ఇవ్వమని ప్రతిపక్షాలు కూడా అడిగితే ఏం చేస్తారు? ఒకవేళ అందులో ఏదైనా తప్పులు ఉంటే మీపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామంటే మీ పరిస్థితేంటి?" అని ఆయన ఈసీని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుడే కాదు ఎవరు ఫిర్యాదు చేసినా దర్యాప్తుకు ఆదేశించడమే సరైన పద్ధతి అన్నారు. కాగా, ఖురేషీ వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్ స్పందించింది. రాజకీయ పార్టీలతో తాము క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తున్నామని ఇంత నిర్మాణాత్మక రీతిలో మరెప్పుడూ జరగలేదని ఈసీ అధికారి ఒకరు పేర్కొన్నారు. ఇక నేపాల్ పరిణామాలపై ఖురేషీ మాట్లాడుతూ, అవి సజీవమైన, శక్తిమంతమైన ప్రజాస్వామ్యానికి సంకేతాలుగా అభివర్ణించారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరి జీవితంలో సోషల్ మీడియా అంతర్భాగంగా మారిన నేపథ్యంలో దాన్ని నియంత్రించే విషయంలో ప్రభుత్వాలు చాలా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు.

'వలస' రాజ్యంలో కలకలం!

ఇంగ్లండ్‌లో పెరిగిపోతున్న వలసదారులు

» 'మా దేశాన్ని మాకు ఇచ్చేయండి' అంటూ లండన్‌లో లక్ష మందికిపైగా స్థానిక బ్రిటిషర్ల ప్రదర్శన

వ్యాపారం పేరిట చిన్న చిన్న పడవలు వేసుకుని సముద్రాలు దాటి వలస వచ్చింది వారే.. స్థానికులపై దాడులకు, దోపిడీకి పాల్పడిందీ వారే.. వారి సంస్కృతిని రుద్ది, స్థానిక సంస్కృతులను నాశనం చేసిందీ వారే.. అదే బ్రిటీషర్లు ఇపుడు తమ దేశంలోకి వలసలు పెరిగిపోతున్నాయని మొత్తుకుంటున్నారు. ఒకప్పుడు తాము వలసవెళ్లి అణగదొక్కి, పాలించి, దోచుకున్న ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని దేశాల వారు ఇప్పుడు.. తమ దేశంలోకి వచ్చి చేరుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వలసదారులు తమ సంస్కృతిని నాశనం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. వారిని తిప్పిపంపేయాలంటూ నిరసనలకూ దిగుతున్నారు.

బ్రిటన్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఉన్నత చదువుల కోసం దక్షిణాసియా, ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వెళుతున్నారు. వారంతా చట్టబద్ధంగా వీసాలు తీసుకుని వస్తున్నవారు. మరోవైపు అంతర్యుద్ధాలు, కరువు బాధిత దేశాల నుంచి పెద్ద సంఖ్యలో శరణార్థులు సముద్రం మీదుగా చిన్నచిన్న బోట్లలో అక్రమంగా బ్రిటన్‌లోకి ప్రవేశిస్తున్నారు. తమకు ఆశ్రయం ఇవ్వాలంటూ అక్కడి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. బ్రిటన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఇలాంటి వారి సంఖ్య లక్షల్లోకి చేరింది. స్థానికులమైన తమ కంటే కూడా వలస వచ్చినవారే ఎక్కువైపోయారని.. తమ పన్నుల ఆదాయం వారికి ఖర్చుపెట్టడం ఏమిటంటూ బ్రిటీషర్లలో కొన్నేళ్లుగా ఆందోళన పెరిగిపోయింది. అలా శరణార్థులుగా వచ్చినవారిని స్థానిక బ్రిటీషర్లు చులకనగా చూడటం, జాత్యాహంకార వ్యాఖ్యలు చేయడం వంటివి పెరిగాయి. మరోవైపు ఆఫ్రికా, ఇస్లాం దేశాల నుంచి వచ్చిన శరణార్థుల్లో కొందరు.. దోపిడీలు చేస్తుండటం, తమకు చులకనగా చూస్తున్న బ్రిటిషర్లపై దాడులు చేయడం సమస్యగా మారింది. బ్రిటన్‌లోని తీవ్ర జాతీయవాద (ఫార్ రైట్) పార్టీలు, నేతలు.. విదేశీయుల వలసలను, శరణార్థులకు ఆశ్రయం ఇవ్వడాన్ని తప్పుపడుతూ పోరాటాలు లేవనెత్తుతున్నారు. సోషల్ మీడియాలోనూ ఇది తీవ్ర స్థాయికి చేరింది. బ్రిటన్ స్థానికుల్లో వలసలకు వ్యతిరేక భావజాలం పెరిగిపోయింది. యూకే ప్రభుత్వ గణాంకాల ప్రకారమే.. 2024 చివరి నాటికి అక్కడ 5,15,697 మంది శరణార్థులు ఉన్నారు. వలస వచ్చినవారి విజ్ఞప్తులను పరిశీలించి ప్రభుత్వం అధికారికంగా ఆశ్రయం ఇచ్చినవారి సంఖ్య ఇది. అదే సమయంలో అక్రమంగా వచ్చిన మరో 1,24,841 మంది శరణార్థిగా ఆశ్రయం కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఉన్నారు. ఈ ఏడాది తొలి ఎనిమిది నెలల్లో మరో లక్ష మందికిపైగా అక్రమంగా యూకేలోకి వచ్చి ఆశ్రయం కోసం దరఖాస్తు చేసుకున్నట్టు అంచనా. ఎలాంటి గుర్తింపు పొందకుండా, దరఖాస్తు చేసుకోకుండా ఉంటున్నవారు కూడా లక్షల్లో ఉంటారు. వీరిలో చాలా మంది ఆఫ్రికా, మధ్యప్రాచ్య ముస్లిం దేశాల నుంచి వచ్చినవారే. మరోవైపు పర్యాటక, విద్యార్థి వీసాలపై వచ్చి.. గడువు ముగిసినా బ్రిటన్‌లోనే ఉండిపోయిన వారి సంఖ్య కూడా లక్షల్లో ఉంటుంది. మొత్తంగా శరణార్థులు, అక్రమంగా ఉంటున్నవారు కలిపి 10-15 లక్షల మంది వరకు ఉంటుందని అంచనా. (సెంట్రల్ డెస్క్)



'మా దేశాన్ని మాకు ఇవ్వండి'..

ఇంగ్లండ్‌లో విదేశీయుల సంఖ్య పెరిగిపోతోందని, ముఖ్యంగా ఇస్లామిక్ దేశాల నుంచి వస్తున్న శరణార్థులతో సమస్యలు వస్తున్నాయని పేర్కొంటూ లండన్‌లో శనివారం సాయంత్రం భారీ నిరసన ప్రదర్శన జరిగింది. జాతీయవాద నేత టామీ రాబిన్సన్ ఆధ్వర్యంలో.. యూకే జాతీయ జెండాలను చేతబూని, 'దేశాన్ని ఏకం చేయండి (యునైట్ ద కింగ్‌డమ్)', 'మా దేశాన్ని మాకు ఇవ్వండి' అంటూ ఆందోళన చేశారు. పాలస్తీనా, ఇస్లామిక్ స్టేట్ జెండాలను చింపేశారు. ఈ ఆందోళనలో లక్ష మందికి పైగా పాల్గొన్నారు. నిరసనకారులు బ్రిటన్ ప్రధానితోపాటు పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఉండే వైట్‌హాల్ ప్రాంతం దాటి చొచ్చుకుపోయేందుకు ఆందోళనకారులు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో 26 మంది పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఆందోళనలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వర్చువల్‌గా ప్రసంగించారు. "ఏ మాత్రం నియంత్రణ లేని వలసలతో బ్రిటన్ వేగంగా క్షీణించిపోతోంది. మీరు హింసకు పాల్పడకున్నా.. హింసే మీ వైపు వస్తోంది. దాన్ని ఎదుర్కోవాలి, లేదా ప్రాణాలు వదిలేయాలి. ఇదే నిజం" అని వ్యాఖ్యానించారు. మరోవైపు, రాబిన్సన్ నేతృత్వంలోని ఆందోళనకు ప్రతిగా పలువురు బ్రిటన్ ఎంపీలు, వామపక్ష నేతలు, ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు 5 వేల మందితో ర్యాలీ నిర్వహించారు. రాబిన్సన్ అనుచరులు, మద్దతుదారులంతా జాత్యాహంకారులని, మహిళా వ్యతిరేకులని ఆరోపించారు.

యాదగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ

- దర్శనానికి మూడు గంటల సమయం
- కెనడాలో లక్ష్మీనరసింహుల కల్యాణం


కెనడాలో లక్ష్మీనరసింహుల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకుడు నల్లందీగల్ లక్ష్మీనరసింహాచార్యులు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో కొండపై రద్దీ ఏర్పడింది. సుమారు 30వేల మంది భక్తులు 3గంటల పాటు ఉభయ క్యూలైన్లల్లో వేచి ఉన్నారు. ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల వద్ద కూడా రద్దీ కనిపించింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.35,40,126 ఆదాయం సమకూరింది. కాగా, కెనడాలో తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. వాంకోవర్ నగరంలో ఆలయ ఏఈవో గజ్వేల్లి రఘు, విశ్రాంత ప్రధానార్చకుడు నల్లందీగల్ లక్ష్మీనరసింహాచార్యులు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. తెలంగాణ ఎన్‌ఆర్‌ఐలతో పాటు ఇతర రాష్ట్రాల భారతీయులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

బీసీ బిల్లు సాధన కోసం 'బీసీ బతుకమ్మ'

24న ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహణ: జాజుల శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్/కవాడిగూడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని, మహిళా రిజర్వేషన్ల బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలనే డిమాండ్లతో ఈనెల 24న ట్యాంక్ బండ్ వద్ద 'బీసీ బతకమ్మ' నిర్వహించనున్నట్లు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బీసీ భవన్‌లో జరిగిన బీసీ మహిళా సంఘం విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ వేడుకలను ఈ సంవత్సరం బీసీ బతుకమ్మగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించాలని, ప్రధాని మోదీ మనసు కరిగి తమ ఆకాంక్షలు నెరవేర్చాలని బీసీ బతుకమ్మను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా జరిగే ఈ కార్యక్రమంలో వేలాది మంది మహిళలు పాల్గొనాలని కోరారు. కాగా, అధికార సాధన కోసం బీసీలలో రాజకీయ చైతన్యాన్ని పెంచడానికి పాటనే ఆయుధంగా చేసుకోవాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. బీసీ కవులు, కళాకారులు, రచయితలు బీసీ భావజాల ఉద్యమాన్ని పల్లె పల్లెకు విస్తరించాలని కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన బీసీ కల్చరల్ ఫోరం రాష్ట్ర కమిటీ సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. బీసీ సాంస్కృతిక ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి, దసరా తర్వాత 33 జిల్లాల్లో సభలు, సమావేశాలు నిర్వహిస్తామని బీసీ కల్చరల్ ఫోరం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వరంగల్ శ్రీనివాస్, దరువు అంజన్న తెలిపారు.

కన్నతల్లిపై అత్యాచారయత్నం

- కొడుకును కొట్టి చంపిన తండ్రి
- మహబూబ్‌నగర్ జిల్లాలో ఘటన

జడ్చర్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో మృగంలా మారి కన్నతల్లిపైనే లైంగిక దాడికి యత్నించిన ఓ యువకుడిని అతని తండ్రే కొట్టి చంపేశాడు. తాగిన మైకంలో రాక్షసుడిగా మారిన కొడుకుని అడ్డుకునే క్రమంలో ఆ తండ్రి హంతకుడు అయ్యాడు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగిన ఘటనకు సంబంధించి జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జడ్చర్ల మండలం పోలేపల్లికి చెందిన దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. వీరిలో ముగ్గురికి వివాహాలు అవ్వగా చిన్నకుమారుడు(28) అవివాహితుడు. ఆ దంపతులు తమ చిన్న కొడుకుతో కలిసి ఒకే ఇంట్లో నివసిస్తున్నారు. మద్యానికి బానిసైన చిన్న కొడుకు కొన్నాళ్లుగా జులాయిగా తిరుగుతూ జల్సాలకు అలవాటుపడ్డాడు. అయితే, మద్యం మత్తులో ఉండగా ఆ యువకుడు తన కన్నతల్లిపై ఇప్పటికే పలుమార్లు లైంగిక దాడికి యత్నించాడు. ఈ విషయం తెలిసి కొడుకు తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన తండ్రి.. ప్రవర్తన మార్చుకోవాలని కొడుకుని పలుమార్లు హెచ్చరించాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం నుంచి మద్యం సేవిస్తూ ఉన్న ఆ యువకుడు అర్ధరాత్రి తర్వాత తల్లిపై లైంగిక దాడికి యత్నించాడు. కొడుకు తీరుతో హడలిపోయిన తల్లి గట్టిగా కేకలు వేయగా.. పక్క గదిలో నిద్రిస్తున్న ఆమె భర్త మేల్కొని కొడుకును అడ్డుకునేందుకు యత్నించాడు. కానీ, ఆ యువకుడు తండ్రిని కూడా నెట్టేశాడు. ఈ క్రమంలో చేతికి దొరికిన కర్రతో ఆ తండ్రి తన కొడుకు తల వెనుక, ముఖంపై బలంగా కొట్టాడు. దీంతో ఆ యువకుడు అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలిసి ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేనేం తప్పు చేశా నాన్నా?

వైద్యం చేయించలేక మూడేళ్ల కొడుకును చంపేసిన తండ్రి

- మృతదేహాన్ని మూసీలో పారేసిన వైనం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పేదరికం, హృద్రోగంతో పుట్టిన కన్నకొడుకుకి వైద్యం చేయించలేని నిస్సహాయత.. అంతకుమించి 'వైద్యం చేయించడం చేతకాని వాడివి ఎందుకు కన్నావు?' అంటూ భార్య సూటిపోటి మాటలు.. ఈ పరిస్థితుల్లో ఓ తండ్రి కన్న ప్రేమను మరిచాడు. ఏ పాపమూ ఎరుగని తన మూడేళ్ల కుమారుడిని బలి తీసుకున్నాడు. ఈ దారుణ ఘటన హైదరాబాద్‌లోని బండ్లగూడ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బండ్లగూడ నూరీనగర్‌కు చెందిన మహ్మద్ అక్బర్, సనా బేగం దంపతులకు ఇద్దరు కుమారులు. అక్బర్ కూరగాయల వ్యాపారి కాగా సనా నీలోఫర్ ఆస్పత్రిలో కేర్‌టేకర్‌గా పని చేస్తుంది. ఈ దంపతుల చిన్న కుమారుడు మహ్మద్ అనస్(3)కు పుట్టుకతోనే గుండెలో రంధ్రం ఉంది. పేదరికం వల్ల తల్లిదండ్రులు ఆ పసివాడికి సరైన వైద్యం చేయించలేకపోతున్నారు. ఈ విషయంలో దంపతుల మధ్య నిత్యం గొడవలు జరిగేవి. వైద్యం చేయించలేని వాడివి ఎందుకు కన్నావు.. అంటూ అక్బర్‌ను భార్య సనా దూషించేది. ఈ క్రమంలో రోజురోజుకి ఇబ్బందులు పెరిగిపోతుండడంతో అసహనానికి గురైన శనివారం తెల్లవారుజామున అనస్ ముఖంపై దిండు పెట్టి ఊపిరాడకుండా చేసి ప్రాణం తీశాడు. అనంతరం అనస్ మృతదేహాన్ని ఓ సంచిలో కుక్కి ఆ మూటను ద్విచక్రవాహనంపై తీసుకెళ్లి అఫ్జల్‌గంజ్ సమీపంలోని మూసీ నదిలో విసిరేశాడు. ఆ తర్వాత తనకేమీ తెలియదన్నట్లుగా బండ్లగూడ పోలీసుస్టేషన్‌కు వచ్చి కొడుకు కనిపించడం లేదంటూ ఫిర్యాదుచేశాడు. ఘటనా స్థలిలోని సీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు..అక్బర్ ఓ మూటతో బైక్ పైవెళుతుండడాన్ని గుర్తించారు. దీంతో అక్బర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నిజం బయటపెట్టాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. బాలుడి మృతదేహం కోసం డీఆర్‌ఎఫ్ మూసీలో గాలింపు చేపట్టారు.

పాత పెన్షన్ అమలు చేసే పార్టీలకే ఓటు

- పట్నా పెన్షన్ సంఘర్ష్ సభలో.. ఎన్‌ఎంవోపీఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ

హైదరాబాద్/పట్నా, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పాత పెన్షన్(ఓపీఎస్) విధానం అమలు చేసే పార్టీలకే తమ ఓటు వేస్తామని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం(ఎన్‌ఎంవోపీఎస్) సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ ప్రకటించారు. నవంబరులో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఆ రాష్ట్ర రాజధాని పట్నాలో ఆయన ఆధ్వర్యంలో 'పెన్షన్ సంఘర్ష్' పేరిట భారీ బహిరంగ సభ జరిగింది. ఈమేరకు ఆ సంస్థ ప్రతినిధులు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి పెన్షన్ అంశం రాష్ట్రం పరిధిలోనిదన్నారు. ఇటీవల దేశంలోని కొన్ని పార్టీలు తమ మ్యానిఫెస్టోలో సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ అమలు చేస్తామని తెలంగాణ, కర్ణాటకల్లో సీపీఎస్ ఉద్యోగుల మద్దతుతో అధికారంలోకి వచ్చాయన్నారు. అందువల్ల ఆయా రాష్ట్రాల్లో పాత పెన్షన్‌ను పునరుద్ధరించిన తర్వాతే బిహార్‌లో తమ సీపీఎస్ ఉద్యోగులు ఆయా పార్టీలకు మద్దతు ఇస్తారన్నారు. ఈ సభకు ఎన్‌ఎంవోపీఎస్ ప్రతినిధులు విజయ్ బంధు, ఝార్ఖండ్ అధ్యక్షులు విక్రాంత్, తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కారకట్ నియోజకవర్గ సీపీఐ ఎంపీ రాజా రాంసింగ్, హిమాచల్‌ప్రదేశ్ నుంచి ప్రదీప్ ఠాగూర్, భరత్ శర్మ, బిహార్ అధ్యక్షులు వరుణ్ పాండే, శశిభూషణ్, సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు హాజరయ్యారు.

మత్తుమందు తయారు చేసిన.. మేధ హైస్కూల్ సీజ్

బోయినపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అల్ప్రాజోలం మత్తుమందు తయారీకి కేంద్రంగా మారిన ఓల్డ్ బోయినపల్లి మేధ హైస్కూల్‌ను విద్యా శాఖ అధికారులు ఆదివారం సీజ్ చేశారు. పాఠశాలకు అన్ని అనుమతులు రద్దు చేసి, మూసివేయనున్నామని.. ఇందులోని విద్యార్థులను ఇతర పాఠశాలల్లో చేర్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మేధ హైస్కూల్ నిర్వాహకుడు జయప్రకాశ్‌గౌడ్, మరికొందరు కలిసి అల్ప్రాజోలం తయారు చేసి, కల్లు కాంపౌండ్లకు విక్రయిస్తున్నట్టుగా గుర్తించిన ఈగల్(నార్కోటిక్స్) బృందం.. శనివారం దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్కూల్‌ను అధికారులు సీజ్ చేశారు. సోమవారం పోలీసు, విద్యాశాఖల ఉన్నతాధికారులు ఈ పాఠశాలను, అల్ప్రాజోలం తయారు చేస్తున్న గదులను పరిశీలించనున్నారు. అనుమతులు, సరైన పత్రాలు లేకుండా మేధ పాఠశాలకు భవనాన్ని అద్దెకు ఇచ్చిన యజమానిపైనా కేసు నమోదు చేయాలని అధికారులు భావిస్తున్నట్టు తెలిసింది. మరోవైపు మేధ స్కూల్ యాజమాన్యం తమకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని పాఠశాల సిబ్బంది చెబుతున్నారు.

కోటి విలువైన మత్తు మందులు సీజ్

హైదరాబాద్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మత్తు మందు రవాణా, అమ్మకాలపై ఉక్కుపాదం మోపినట్లు ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 రోజులుగా జరిపిన దాడుల్లో 12 మందిని అరెస్టు చేయగా, రూ.1.09 కోట్ల విలువైన మత్తు మందు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భువనేశ్వర్-పుణె ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి రవాణా చేస్తున్న వారిని అరెస్టు చేసిన ఈగల్ రైల్వే టీం రూ.22.75 లక్షల విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. వరంగల్‌లో 32 కిలోల గంజాయి జప్తు చేసి ముగ్గురు, ములుగు జిల్లా వాజేడులో 30 కిలోల గంజాయి స్వాధీనంతో ఇద్దరు, వరంగల్ జిల్లా ఐనవోలులో 214 కిలోల గంజాయి జప్తు చేసి ఒకరిని అరెస్టు చేసినట్లు సందీప్ శాండిల్య తెలిపారు. ఆల్ప్రాజోలం తయారీ యూనిట్‌పై దాడి చేసిన సంగారెడ్డి బృందం.. ఇద్దరు నిందితులను అరెస్టు చేసిందన్నారు.

హైదరాబాద్‌లో కుండపోత

నాలాలు ఉప్పొంగి ముగ్గురు గల్లంతు.. పలు ప్రాంతాలు అతలాకుతలం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

కుమరం భీం జిల్లా సిర్పూర్(టి) వద్ద ఉప్పొంగి ప్రవహిస్తున్న పెన్‌గంగ


రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి కుండపోత వాన కురిసింది. రాత్రి 7.30 నుంచి 9 గంటల వరకు కురిసిన భారీ వర్షంతో పలు ప్రాంతాలను వరద ముంచెత్తింది. లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపించాయి. ముషీరాబాద్ బౌద్ధనగర్‌లో గంటన్నర సమయంలోనే రికార్డు స్థాయిలో 12 సెంటీమీటర్ల వాన పడింది. జవహర్‌నగర్, మారేడ్‌పల్లి, షేక్‌పేట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, యూసుఫ్‌గూడ, కృష్ణానగర్ ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై నడుము లోతు వరద ప్రవహించింది. వాహనదారులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. కృష్ణానగర్ లో వరద ఉధృతికి పలు వాహనాలు కొట్టుకుపోయాయి. చాలా ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. కాగా, వరద నీటి ఉధృతి హైదరాబాద్‌లో నలుగురు గల్లంతయ్యారు. ఆసిఫ్‌నగర్ మంగార్ బస్తీలో నాలా ఉప్పొంగడంతో రాము, అర్జున్ అనే ఇద్దరు మామాఅల్లుళ్ల నీటిలో కొట్టుకుపోయారు. డీఆర్‌ఎఫ్ బృందాలు మూడు గంటల పాటు ప్రయత్నించినా ఆచూకీ దొరకలేదు. ముషీరాబాద్ వినోబానగర్‌లో వరదలో దినేశ్ సన్నీ (24) అనే యువకుడు గల్లంతయ్యారు. హైడ్రా, డీఆర్‌ఎఫ్ సిబ్బంది గాలింపు చేపట్టారు.

నిండుగా ప్రాజెక్టులు

మెదక్, సిద్దిపేట జిల్లాల్లో ఆదివారం భారీ వర్షాలు కురిశాయి. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేటలో ఏకంగా 24.3 సెంటీమీటర్ల అతిభారీ వర్షం కురిసింది. తూప్రాన్ పట్టణంలో వరదతో కేశవనగర్, సమీప ప్రాంతాలు నీట మునిగాయి. హల్దీ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లాలోనూ గట్టి వాన కురిసింది. ములుగు జిల్లాలో శని, ఆదివారాలు విస్తారంగా వర్షాలు పడ్డాయి. జిల్లాలోని వెంకటాపురం మండలంలో అత్యధికంగా 13.02 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా సగటున 4.68 సెం.మీ వాన కురవడం గమనార్హం. మరోవైపు ఆసిఫాబాద్ జిల్లాలోనూ విస్తారంగా వానలు కురిశాయి. పెన్‌గంగ ప్రమాద స్థాయిలో ప్రవహిస్తుండటంవంతెనపై రాకపోకలు నిలిపివేశారు. బెజ్జూరు మండలంలో పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఈ జిల్లావ్యాప్తంగా సగటున 3.24 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.భారీ వర్షాలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం కావడిగుండ్ల వాగులో ఏపీలోని పూచికపాడుకు చెందిన చెల్లమ్మ, వరలక్ష్మి గల్లంతైన విషయం తెలిసిందే. అధికారులు డ్రోన్లతో గాలింపు చేపట్టగా తెలంగాణలోని అనంతారం వాగువద్ద చెల్లమ్మ మృతదేహం లభ్యమైంది. వరలక్ష్మి మృతదేహం కోసం గాలిస్తున్నారు. మరోవైపు కృష్ణా నదిలో వరద ప్రవాహం పెరగడంతో జూరాలలో ఆరు గేట్లు, శ్రీశైలం ప్రాజెక్టులో ఏడు గేట్లు, నాగార్జున సాగర్‌లో 26 గేట్లు ఎత్తారు. కృష్ణాతోపాటు తుంగభద్రపై ఉన్న దాదాపు అన్ని ప్రాజెక్టులు నిండుగా ఉన్నాయి. ఎగువ నుంచి వరద వస్తుండటంతో సింగూర్ గేట్లు తెరిచి నీటిని వదులుతున్నారు.


హైదరాబాద్‌లో నాలాలు ఉప్పొంగి గల్లంతైన దినేశ్, అర్జున్, రాము

యూరియా క్యూలైన్‌లో మాజీ మంత్రి సత్యవతి

- కూపన్ ఇచ్చినా ఒక్క బస్తా దొరకలేదన్న బీఆర్‌ఎస్ నేత..
- యూరియా కోసం వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


యూరియా కోసం లైన్‌లో ఉన్న సత్యవతి రాథోడ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రైతులకు యూరియా కష్టాలు కొనసాగుతున్నాయి. తెల్లారితే చాలు.. ఎరువుల కోసం సహకార సంఘాల గోదాములు, ఎరువుల దుకాణాల వద్ద అన్నదాతలు బారులు తీరుతున్నారు. అయినా సరిపడా యూరియా బస్తాలు దొరక్కపోతుండటంతో నిరసనలకు దిగుతున్నారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా కురవి మండలం గుండ్రాతిమడుగు పెద్దతండా రైతువేదిక వద్ద యూరియా బస్తాల కోసం మహిళలతో కలిసి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ కూడా క్యూలైన్‌లో నిలబడ్డారు. దాదాపు గంటన్నర సేపు క్యూలో నిల్చున్నప్పటికీ కూపన్ ఇచ్చారే తప్ప.. యూరియా బస్తాలు ఇవ్వలేదని ఆమె వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు యూరియా కొరతే నిదర్శనమని విమర్శించారు. యూరియా కూపన్ల కోసం వెళ్తున్న ఇద్దరు రైతులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడిన ఘటన గూడూరు మండలం జగన్నాయకులగూడెంలో చోటుచేసుకుంది. దుబ్బగూడెంకు చెందిన బానోత్ లాల్య (77), జోషి తండాకు చెందిన దరావత్ వీరన్న (46) యూరియా కోసం కూపన్‌లను తీసుకునేందుకు ఒకే బైక్‌పై బొద్దుగొండ రైతువేదిక వద్దకు బయలుదేరారు. ఈ క్రమంలో జగన్నాయకులగూడెం క్రాస్ రోడ్డు వద్దకు రాగానే వారి బైక్‌ను బొలెరో వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలతో లాల్య అక్కడికక్కడే మరణించగా.. వీరన్నను వైద్యం కోసం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. గూడూరు మండలం కోబల్‌తండాకు చెందిన రైతులు నర్సంపేట-మహబూబాబాద్ జాతీయ రహదారిపై అరగంట పాటు రాస్తారోకో నిర్వహించారు. యూరియా సరిపడా ఇవ్వడం లేదని హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని ప్రగతిసింగారంలో వసంతాపూర్ రైతులు ఆందోళనకు దిగారు.

లారీ యూరియా పక్కదారి అని ప్రచారం

లారీ యూరియా లోడ్ పక్కదారి పట్టిందనే సమాచారం నల్లగొండ జిల్లాలో సంచలనం సృష్టించింది. ఓ ఎమ్మెల్యే గన్‌మెన్ 20 టన్నుల యూరియా తీసుకెళ్లారని సోషల్ మీడియా, న్యూస్ చానెళ్లలో ప్రచారం జరిగింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి' ఆరా తీయగా అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. 10 రోజుల క్రితం కుక్కడం సహకార సంఘం సొసైటీకి మార్క్‌ఫెడ్ ద్వారా 20 టన్నుల యూరియాను కేటాయించారు. అదే సమయంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గన్‌మెన్ నాగునాయక్ మార్క్‌ఫెడ్ అధికారికి ఫోన్ చేసి యూరియా కావాలని అడగ్గా.. కుక్కడం సొసైటీకి కేటాయించిన యూరియాలో 10 బస్తాలు అతనికిచ్చారు. విషయం తెలిసి సదరు గన్‌మెన్‌ను ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. కాగా, సొసైటీకి కేటాయించిన 20 టన్నుల యూరియా ఏఈవో సమక్షంలో రైతులకే పంపిణీ చేశామని, దుర్వినియోగం కాలేదని జిల్లా వ్యవసాయాధికారి పేర్కొన్నారు. యూరియా విషయంలో సోషల్ మీడియాలో జరుగుతున్నది తప్పుడు ప్రచారమని, తన సిబ్బంది ఎవరూ యూరియాను పక్కదారి పట్టించలేదని ఎమ్మెల్యే తెలిపారు.

పేరు విదేశీ కొలువు.. బలవంతపు సైబర్ నేరాలు

ప్రధాన సూత్రధారిపై పీడీయాక్టు.. అరెస్టు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని నిరుద్యోగ యువతకు గాలం వేసి.. లావోస్, థాయిలాండ్ వంటి దేశాలకు తీసుకెళ్లి అక్కడ బలవంతంగా సైబర్ నేరాలు చేయిస్తున్న కేసులో ప్రధాన సూత్రధారి కోలనాటి నాగశివపై పీడీ యాక్టు కింద నిజామాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. సైబర్ నేరాలపై పీడీ యాక్టు కింద కేసు నమోదు చేయడం రాష్ట్రంలో ఇదే తొలిసారని నిజామాబాద్ నగర పోలీసు కమిషనర్ సాయి చైతన్య ఆదివారం తెలిపారు. పలువురు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడంతోపాటు నాగశివను అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించామన్నారు. నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని కొంత మంది నిరుద్యోగులను విదేశాల్లో అధిక వేతనాలకు కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలిప్పిస్తామని నమ్మించి లావోస్, థాయిలాండ్ వంటి దేశాలకు పంపి.. అక్కడికెళ్లాక పాస్‌పోర్టు స్వాధీనం చేసుకునే వాడని సాయి చైతన్య చెప్పారు. అక్కడ బలవంతంగా సైబర్ మోసాలు చేయించేవాడన్నారు.

లోక్ అదాలత్‌లో సైబర్ క్రైం బాధితులకు రూ.40.8 కోట్లు రీఫండ్

హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) మూడో జాతీయ మెగా లోక్ అదాలత్‌లో రాష్ట్రంలోని 7,040 మంది సైబర్ క్రైం బాధితులకు రూ.40.8 కోట్లు రీఫండ్ చేశామని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికా గోయల్ తెలిపారు. శనివారం రూ.12.95 కోట్లు, ఈ నెల రెండో తేదీ నుంచి రూ.27.91 కోట్లు రీఫండ్ చేశామని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ జరిగిన 3 లోక్ అదాలత్‌లలో 18,872 మంది బాధితులకు రూ.138.04 కోట్లు రీఫండ్ చేశామన్నారు. గతేడాది మార్చి నుంచి ఇప్పటి వరకు సైబర్ క్రైం బాధితులకు రూ.321 కోట్లు రీఫండ్ జరిగిందని ఆమె వివరించారు. సైబర్ మోసం జరిగితే వెంటనే 1930కి ఫిర్యాదు చేస్తే, అంతే త్వరగా పోయిన డబ్బును రాబట్టే అవకాశం ఉంటుందని వెల్లడించారు. కాగా, ఈ లోక్ అదాలత్‌తో 1,65,522 కేసులు పరిష్కరించామని సీఐడీ అదనపు డీజీ చారుసిన్హా తెలిపారు. ఈ నెల రెండో తేదీ నుంచి 13 వరకూ జరిగిన కేసుల పరిష్కారంలో అత్యధికంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 29,023, రాచకొండ కమిషనరేట్‌లో 22,278, నల్లగొండలో 14,002 కేసులు పరిష్కరించినట్లు చెప్పారు. వాటిలో 20,964 ఎఫ్‌ఐఆర్ కేసులు, 883 డిజాస్టర్ మేనెజ్‌మెంట్, 75,430 ఈ పెట్టి, 61,205 ఎంవీ యాక్ట్, 7,040 సైబర్ క్రైమ్ కేసులు పరిష్కరించామన్నారు.

టెట్ నుంచి టీచర్లకు కేంద్రం రక్షణ కల్పించాలి

- ఎస్టీఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పైబడి సర్వీసున్న ఇన్‌సర్వీస్ టీచర్లందరూ రెండేళ్లలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఉత్తీర్ణులు కావాలని, లేదంటే ఉద్యోగాన్ని వదులుకోవాలని ఇటీవలే సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో దీని నుంచి సీనియర్ టీచర్లకు రక్షణ కల్పించాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్టీఎఫ్ఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీని కోసం విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 23ను సవరించాలని, అదేవిధంగా టెట్ సిలబస్, అర్హత ప్రమాణాలను శాస్త్రీయంగా సవరించాలని ఎన్‌సీటీఈని డిమాండ్ చేశారు. దోమలగూడలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో చావ రవి మాట్లాడారు. 23.08.2010కి ముందు నియామకమైన టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. 15 ఏళ్ల తర్వాత హఠాత్తుగా రెండేళ్లలో టెట్ పాస్ కావాలంటే సీనియర్ టీచర్లు ఆందోళన చెందుతున్నారన్నారు. దీన్ని నివారించడానికి తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేయాలని కోరారు.

నిరాలలో ఇంటిపైకి ఎక్కిన ఎద్దు



జైనథ్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఓ ఎద్దును కుక్కలు తరమడంతో ఆ ఎద్దు ఏకంగా ఓ ఇంటి పైకి ఎక్కింది. ఈ సంఘటన ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని నిరాల గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన షేక్‌గఫూర్ అనే రైతు తన ఎద్దును ఇంటి ఆరు బయట కట్టేసి ఉంచగా ఆదివారం ఉదయం ఓ కుక్కల గుంపు ఆ ఎద్దును తరమడంతో అది పరుగెత్తి పక్కనున్న రాళ్లకట్టపై నుంచి ఏకంగా ఓ ఇంటి పైకి ఎక్కింది. దీంతో గ్రామానికి చెందిన విఠల్ మాస్టర్ పెంకుటిల్లు పైభాగం కొంత ధ్వంసమయింది. అది గమనించిన ఆయన చివరకు రైతుల సాయంతో ఎద్దును కిందకి దించారు.

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్



అబ్రకదబ్ర అంటే అక్షరం పుట్టదు!

మనిషి భావోద్వేగాల పుట్ట. ఏ రచనకైనా భావోద్వేగం ఊపిరి. అంతమాత్రాన భావోద్వేగానికి గురైన ప్రతి మనిషీ రచన చేయలేడు. భావోద్వేగం సృజనగా రూపుదాల్చే పరిణామం వెనుక తర్జనభర్జన పడే రసచర్య మరీ మరీ కీలకం. ఏమిటా రసచర్య, దాని నేపథ్యం ఏమిటి.

కవితలోనో కథలోనో గొప్ప భావోద్వేగం పలికింది అని చదువరి అనుభూతించిన ప్రతి సందర్భంలోనూ ఆ భావోద్వేగం నిజమేనా. ఆ రసచర్యలో కొంత కవి మాంత్రిక చర్య కూడా ఉంటుందా. ఎప్పుడైనా ఎక్కడైనా భావోద్వేగం నిజమా. లేక సృజన కేవలం సామర్థ్యమా. కవితను నేను రాయలేదు, కవితే నాతో రాయించుకుంది; పాత్రలను నేను నడపలేదు, పాత్రలే నన్ను నడిపించాయి- అని సృజనకారులు చేసే నేరాంగీకారాలు నిజమేనా, కల్పితమా. ఆ రాయించుకోవడం వెనుకా, ఆ నడవడం వెనుకా సృజనకారుడి పాత్ర ఏమిటి, ఎంత. అసలేం లేనే లేదా.

ఏ రచనైనా అదాటున గాల్లోనుంచి ఊడిపడుతుందనీ, ఏదో ఒక మాయ వచ్చి చెవుల్లో గుసగుసలాడి వెళ్లిపోతుందనీ అనుకుంటే అది భ్రమే. నిజమైన క్రిమి కీటకాలతో సహా ఊహాత్మక పూదోటను సృష్టించడమే రచన అన్నాడు మూర్.

సృజనకారుడు వెలిబుచ్చే భావోద్వేగాలు నిజాలు కానక్కరలేదు. నిజమని చదువరికి అనిపించాలి, అంతే. అదే సృజనకారుడి కళాలాఘవం. భావోద్వేగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయడానికి కవి జర్నలిస్టు కాదు. సృజన అంటే అక్షరాలను భావోద్వేగంగా మార్చడం, కలలను నిజాలుగా మార్చడం, కళను మానవీయ అనుభవంగా మార్చడం. అందుకే కావచ్చు కళారూపంలోని వేదన నిజమేనని పాఠకుడికి భ్రాంతి కల్పించాలి అన్నాడు వేగుంట మోహన ప్రసాద్. భ్రమ కల్పించడం మోసం కదా అని ఎవరైనా వాదించొచ్చు. కానీ కళారూపంలో భ్రమ సృష్టి మోసం కాదు. భావోద్వేగ వాస్తవాన్ని చేరడానికి లేదా పాఠకుడిని చేర్చడానికి అదొక మాధ్యమం.

రచన మాయాజాలం కాదు. కవిత్వమైనా కథైనా నవలైనా ఏ సాహిత్య ప్రక్రియైనా అదొక కూర్పు, నిర్మాణం, నైపుణ్యం. భాషతో భావాన్ని కలిపి కచ్చితంగా ఎక్కడ కూచోబెట్టాలో అక్కడ కూచోబెట్టే కళ. భావోద్వేగం అనే భావన కేవలం ముడిసరుకు మాత్రమే. నిజమైన సృజన ఆ సృజనకారుడు ఒక శిల్పిలాగా బండరాయిని తన సామర్థ్యంతో శిల్పంగా చెక్కినపుడు మాత్రమే ఆకారం దాలుస్తుంది. సృజన ఒక ఉద్దేశ్యపూర్వక ప్రక్రియ. భావోద్వేగం ఒక ఆరంభపు మెరుపులాగా మొదలుపెట్టించవచ్చుగాక. కానీ ఆ మెరుపు వెలుగుల రూపాన్ని నిర్ణయించదు. సృజనలోతు భావోద్వేగంలో ఉండదు. లోచూపులో ఉంటుంది. దాని శిల్పచాతుర్యంలో ఉంటుంది.

గాయపడ్డ వ్యక్తి కొన్ని పదాలను కుప్పపోస్తే అది నాటకీయత అవుతుందే తప్ప సృజన కాదు. సమర్థుడైన సృజనకారుడు కల్పిత దుఃఖాన్ని రచిస్తూ కూడా గుండెలు పిండే రూపంగా దాన్ని ఆవిష్కరించగలడు. ఇది హాంఫట్మని జరిగే అబ్రకదబ్ర కాదు. అంగీకరించినా అంగీకరించకపోయినా కళా ప్రక్రియ అంతిమఫల ఔన్నత్యానికి రూపమిచ్చేది సృజనకారుడి ప్రతిభే తప్ప ఇంకేదో కాదు. గుండె పగిలిన కవిత్వం కేవలం కన్నీటి చుక్క వల్ల రాదు. అధ్యయనంలోని స్పష్టత, రూపం కోసం పడే తపన వల్ల మాత్రమే సాధ్యం.

గొప్ప గొప్ప సృజనకారులు డాంటే, షేక్‌స్పియర్, మీరాబాయి, గాలిబ్, ఠాగూర్, గుల్జార్, చలం, కొ.కు., పతంజలి, త్రిపుర, చండీదాస్, మో అందరూ నిర్మాణ కౌశలులే. అనేకానేక సార్లు తమ సృజనను మార్చిమార్చి తిరగ రాయడంలో చేయితిరిగినవారే. సృజన నియమాలను గౌరవిస్తూనే ఉల్లంఘించినవారే. సృజనకారుడనేవాడు భాషా భావ ప్రపంచాల శిల్పి. ఆ శిల్పం వెనుక కేవలం భావోద్వేగం ఉండదు. కాపీ బుక్ క్రమశిక్షణ ఉంటుంది. అలసట ఎరుగని సృజనకారుడి చెయ్యి ఉంటుంది. ఆ చేయికి తెలిసిన పట్టువిడుపులుంటాయి. ప్రతి కవితనూ ప్రతి రచననూ భావోద్వేగమే అల్లేట్టయితే ప్రతి విషాద రచయితా షేక్‌స్పియర్ కావాలి కదా. ఒక వాస్తవాన్ని వాస్తవంగా వెల్లడించినంత మాత్రాన అది సృజన అవదు. దానికి కవితాత్మకతను అద్దాలి. దానిలో నిశ్శబ్దాన్ని కూర్చాలి. శబ్దాన్ని అమర్చాలి. అలా కాని నాడు డైరీ రాతకీ పద్యానికీ తేడా ఉండదు. డైరీలో నిజాలుంటాయేమో కానీ కవిత్వం ఉండదు.

రాసే ప్రతివాడి బాధా ప్రపంచం బాధ కాగలిగితే కుప్పలు తెప్పలు కృష్ణశాస్త్రులుండేవారు. ప్రపంచం బాధను ప్రతి రాసేవాడూ తన బాధగానే స్వీకరించి ఉంటే పుట్లకొద్దీ శ్రీశ్రీలుండేవారు. ఆ మిగతావారికీ శ్రీశ్రీ-కృష్ణశాస్త్రులకీ మధ్య ఉన్న తేడా కేవలం నైపుణ్యం, సామర్థ్యం మాత్రమే.

సారమే రూపాన్ని ఎంచుకుంటుంది అనే మరి కొందరి వాదన కూడా ఈ చర్చ పరిధిలోదే. అది పూర్తిగా భ్రమ. సారాన్నీ రూపాన్నీ రెంటినీ సృజనకారుడే ఎంచుకుంటాడు. రూపం కేవలం సారం వల్ల ఏర్పడే నిష్క్రియాత్మక అంశం కాదు.

> **రచన మాయాజాలం కాదు. కవిత్వమైనా కథైనా నవలైనా ఏ సాహిత్య ప్రక్రియైనా అదొక కూర్పు, నిర్మాణం, నైపుణ్యం. సృజనకారులుగా ఎవరూ పుట్టరు. పిచ్చిపట్టినట్టు చదవడం వల్ల, ఒళ్లు మరచి శ్రద్ధగా వినడం వల్ల, తరచూ విఫలం కావడం వల్ల మాత్రమే సృజనకారులు తయారవుతారు.**

రూపానికీ స్వతంత్రంగా సాహిత్యాన్ని ప్రభావితం చేసే శక్తి ఉంటుంది. రూపం సారాన్ని పునర్నిర్మిస్తుంది. సారానికి బలాన్నిస్తుంది. తెలుగులో ప్రస్తుతం వస్తున్న కథల విషయంలోనూ ఇది నిజం. చాలామంది ఈ తరం కథకులు వాస్తవిక ప్రపంచాన్ని ఆవిష్కరించేందుకు కూడా రూపకాత్మక నిర్మాణాన్నే ఎంచుకుంటున్నారు. సారాన్ని ఆకాశమంత విస్తృతం చేసే వైశాల్యం రూపం. అదొక సౌందర్యాత్మక తీవ్రత. ఎత్తుగడల గాఢత.

సృజనకారుడు కొన్ని కొన్ని ప్రకటనల ద్వారా తనను తాను హెచ్చించుకునేందుకు తగ్గించుకున్నట్టుగా నటిస్తాడు. నిర్మిత భావోద్వేగాన్ని అనుభవిక భావోద్వేగంగా ఏమార్చడమే సృజనకారుడు చేస్తోంది. ఏ సృజనా అద్భుతం కాదు. ప్రతి సృజన సౌధం వెనుకా కేవలం భావోద్వేగం ఉండదు. వ్యక్తిగత ఉద్వేగాన్ని సృజనకారుడు విశ్వ మానవీయ భావాత్మక ఉద్వేగంగా చెక్కాలి, నిర్మించాలి, కూర్చాలి, అమర్చాలి.

ప్రతి రచన వెనుకా అనేకానేక డిస్‌క్లయిమర్లు ఉంటాయి. అందుకే పాఠకుడు సృజనను అనుభవిస్తూనే సృజనకారుడిని డీమిస్టిఫై చేసుకోవాలి. వాస్తవ భావోద్వేగ మూలాల ఎరుక కన్నా అవాస్తవ భావోద్వేగ భ్రమలే సృజనలో ముఖ్యం.

అది కేవలం సామర్థ్యం. కేవలం కౌశలం. సృజనకారులుగా ఎవరూ పుట్టరు. పిచ్చిపట్టినట్టు చదవడం వల్ల, ఒళ్లు మరచి శ్రద్ధగా వినడం వల్ల, తరచూ విఫలం కావడం వల్ల మాత్రమే సృజనకారులు తయారవుతారు. పద ప్రయోగంలో యాదృచ్ఛికత వీలుకాదు.

పదాలను అప్రమత్తంగా ఎలా అమర్చాలి, ఎక్కడ వాక్యం తెగాలి, ఎక్కడ రూపకం పడాలి, ఎక్కడ ఏ అర్థం వ్యాపించాలి అనేది సృజనకారుడి నేర్పు. ఒక వేళ అలా అన్నీ అదాటున వచ్చి పడ్డట్టు అనిపించినా అది గత పఠనానుభవం, జీర్ణించుకున్న సాహితీ అనుభూతుల మేళవింపు, అంతే. అమ్మ మరణం గురించి అనేక కవితలు వచ్చాయి. వాటిలో ఒకటో రెండో మాత్రమే గుర్తుపెట్టుకునేట్టుగా ఉండడానికీ అలా ఉండనివాటికీ నడుమ తేడా కేవలం కవి సాహితీ శ్రమ. కాల్ గర్ల్ వేదన చెప్పే కొన్ని వందల కవితలు వచ్చాయి. ఇక్కడా అంతే ఒకటో రెండో మాత్రమే గుండెను చెమర్చడానికీ, మిగతావి కేవలం పొడిపొడిగా మిగిలిపోవడానికీ కారణం కవి సత్తాలోని తేడా మాత్రమే. ఎప్పుడైనా ఎక్కడైనా

■ ప్రసేన్
✆ 70133 58154

పూల బాట కావాలా నాయనా...

1
నడుస్తున్నాను, నడుస్తూనే ఉన్నాను
దుఃఖపు తీగ పైపైకి ఎగబాకుతున్నప్పుడు
నడవడం ఇప్పుడొక అనివార్యత.

ఎందుకో తెలియదు, అర్థమూ కాదు
ఎప్పటివరకో, ఎందాకనో గమ్యమూ ఉండదు
నడవడం ఇక తప్పనిసరి అని తెలిసాక
అడుగులు వాటంతటవే ఆలోచనలను వెంటేసుకుని
తెలియని దారెంబడి ప్రయాణం మొదలు పెడుతాయి.

2
ఒక్కసారి మొదలయ్యాక
నడుస్తూనే ఉండాలే నడుస్తూ సాగిపోతూనే ఉండాలే
మొండిచేసి, సాహసించి, ఆగిపోయి వెనుకడుగేస్తే
బతుకుమీద అమాంతం బండ కూలిపోతది
నడకతో పాటు ఊపిరే శాశ్వతంగా ఆగిపోతది.

నడవాలే
తప్పక నడవాలే
ఆగిపోకుండా నడుస్తూనే ముందుకు సాగిపోవాలే

3
రాళ్ళురప్పలు అడ్డొస్తాయి
బొటనవేలు రక్తమోడుతుంటది
ముళ్ళపొదలు ఎదురవుతాయి
కాళ్ళకు గీసుకొంటూ రక్త చరితలు రాస్తుంటాయి
ఉన్నట్టుండి దారికి అడ్డంగా పెద్ద కంచె మొలుస్తుంది
తెలియకుండానే కాలం పరీక్షకు సిద్ధం చేస్తుంది



భరించాలే అన్నీ భరించాలే
ప్రేమించాలే అన్నింటినీ సమానంగా ప్రేమించాలే
సర్దుకోవాలే ఒక్కొక్కదానికి సుతారంగా సర్ది చెప్పాలే
సిద్ధం కావాలే అన్ని కాల పరీక్షలకు సిద్ధం కావాలే
బతిమిలాడో, ప్రాధేయపడో, ఓర్పుతోనో, నేర్పుతోనో
మెల్లగా ఒప్పించి
కొంచెం కొంచెం దారిచేసుకుంటూ
కంచె దాటి ముందుకు అడుగేసి నెగ్గాలే.

4
అంతే, ఏమీ లేదు
దుఃఖాన్ని నదిగా చేసుకుని ప్రవహించినంత కాలం
నువ్వు ఒట్టి పోతూనే ఉంటావు
పాదాలు నెత్తుటి మరకలవుతున్నాయని
ఆగి ఆగి చూసుకున్నంత కాలం
ఏ చిన్న కంచెనూ దాటలేవు.

5
నడవాలే, నడుస్తూనే ఉండాలే
దాటాలే, అన్నింటిని దాటాలే
సిద్ధ పడాలే అన్నింటికి సిద్ధపడి అడుగేయాలే

దుఃఖపు తీగ తెగి పడుతది
బతుకు తొవ్వ పూల దారై పరుచుకుంటది.

■ బిల్ల మహేందర్
✆ 91776 04430

మొదటి నవలల పోటీ

కొత్త రచయితల మొదటి నవలలకు పోటీ నిర్వహిస్తున్నాం. ప్రథమ, ద్వితీయ బహుమతులు వరుసగా రూ.20వేలు, రూ.10వేలు. 2020–25 సంవత్సరాల మధ్య రాసిన, ప్రింట్‌లో 100 పేజీలకు తగ్గకుండా, 250 పేజీలకు మించకుండా ఏ పత్రికలోనూ ప్రచురితంకాని వాటిని తప్పనిసరిగా టైప్ చేసి అక్టోబరు 31లోగా చిరునామా: డి. స్వప్న, అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్ట్, 20-7-71, ఎక్సైజ్ కాలనీ, హనుమకొండ, వరంగల్-506 001, ఫోన్: 99892 91299కు పంపాలి.

అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్ట్

'బోరచెక్కు' & 'మ్యాజిక్ ఇఫ్' కథలు

ఇండ్ల చంద్రశేఖర్ రాసిన 'బోరచెక్కు' & 'మ్యాజిక్ ఇఫ్' కథా సంపుటాల ఆవిష్కరణ సభ సెప్టెంబరు 20 సా.6గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్, హైదరాబాద్‌లో జరుగుతుంది. 'బోరచెక్కు' ఆవిష్కర్త సిద్ధార్థ, 'మ్యాజిక్ ఇఫ్' ఆవిష్కర్త కె. శ్రీనివాస్. అధ్యక్షత కోయి కోటేశ్వరరావు, ఇతర వక్తలు రామచంద్రారెడ్డి, ఆదిత్య కొర్రపాటి.

బోధి ఫౌండేషన్

తెలంగాణ సంకలనం 'కందిలి'

పదకొండు మంది తెలంగాణ కథకుల కథలతో రూపొందిన సంకలనం 'కందిలి' ఆవిష్కరణ సెప్టెంబర్ 21న ఖమ్మంలో వేదిక ఫంక్షన్ హాల్‌లో జరుగుతుంది. ఈ సందర్భంగా 'కథ – చర్చ' సెమినార్ ఉ.10గంటల నుంచి సా.5గంటల వరకు జరుగుతుంది. ఎన్. వేణుగోపాల్, సంగిశెట్టి శ్రీనివాస్, జూపాక సుభద్ర, పెద్దింటి అశోక్ కుమార్, సిద్దెంకి యాదగిరి, పదకొండు మంది కథకులు పాల్గొంటారు.

ధరణికోట రమేష్ కుమార్

శిఖామణి సాహితీ పురస్కారాలు

'కవిసంధ్య', యానాం సాహిత్యంలో జీవన సాఫల్య కృషికి యిచ్చే శిఖామణి సాహితీ పురస్కారానికి కొలకలూరి ఇనాక్, యువ కవులకు యిచ్చే శిఖామణి యువ పురస్కారానికి అవధానుల మణిబాబు ఎంపికయ్యారు. కవిసంధ్య ప్రతిభా పురస్కారాలకు– పి.ఆర్.ఎల్. స్వామి, కోయి కోటేశ్వరరావు, వరుగు భాస్కర్ రెడ్డి, పచ్చిమాల శివనాగరాజు, పుప్పాల సూర్యకుమారి, పొనుగుమట్ల అశోక్ కుమార్, పెనుమాక రత్నాకర్, మిరప మహేష్ ఎంపికయ్యారు. వివరాలకు: 9440105978. అక్టోబర్ చివరి వారంలో పురస్కార ప్రదానం ఉంటుంది.

దాట్ల దేవదానం రాజు

తల్లి పంచిన ప్రేమలూ గాయాల చిట్టా!


సాహిత్య ప్రపంచంలో సుపరిచితమైన పేరు అరుంధతి రాయ్. సామాజిక ఉద్యమకారిణిగా కూడా పేరు తెచ్చుకున్నారు. బుకర్ ప్రైజ్ పొందిన తన మొదటి నవల 'ది గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్'తో ప్రపంచాన్ని ఆకట్టుకున్న ఆమె, ఈసారి తన కలాన్ని తొలిసారిగా అంతర్గత ప్రపంచం వైపు మళ్లించారు. 'మదర్ మేరీ కమ్స్ టు మీ' అనే తన తొలి స్మృతిగ్రంథం (memoir)లో ఆమె తన తల్లి మేరీ రాయ్‌తో తనకు ఉన్న సంక్లిష్ట బంధాన్ని పాఠకుల ముందు ఉంచారు. ఇది కేవలం ఒక కూతురు తన తల్లికి నివాళిగా రాసిన పుస్తకం కాదు. ఈ పుస్తకం ఒక యుద్ధ ప్రకటనలా కనిపిస్తుంది. తల్లిలోని కాఠిన్యం వల్ల తనకు కలిగిన గాయాలకు, ఆ గాయాల నుంచి తాను పొందిన స్వేచ్ఛకు ఈ పుస్తకం అద్దం పడుతుంది. మేరీ రాయ్ ధైర్యం, ఆమె ప్రేమ, ఆమె కఠినత్వం, ఆమెలోని విషం... వీటన్నిటినీ అరుంధతి రాయ్ ఈ పుస్తకంలో సున్నితంగా విశ్లేషించారు.

అరుంధతికి తల్లిగా అపారమైన ప్రేమను, మద్దతును పంచి ఇచ్చారు మేరీ రాయ్. కానీ అదే సమయంలో ఆమె జీవితాన్ని ఒక



పెను తుపానులా కుదిపేశారు కూడా. "ఆమె ఆలోచించడం నేర్పింది, కానీ నా ఆలోచనలకే వ్యతిరేకంగా పోరాడింది. నన్ను రాయమంది, కానీ నేను రచయిత్రిగా ఎదిగినప్పుడు అసహనం చూపించింది. ఆమె నా ఆశ్రయం, ఆమే నా తుఫాను కూడా," అని రాస్తారు అరుంధతి.

"మేరీరాయ్ చాలామందికి రోల్ మోడల్. తిరుగుబాటుదారు, ప్రదర్శకురాలు. కానీ విద్యార్థులకు వీటన్నిటికీ మించిన వ్యక్తి. ఆమెను మేము భయంతోనూ, గౌరవంతోనూ చూసేవాళ్లం. ఆమెను సంతోషపెట్టడానికి ఏదైనా చేసేవాళ్లం. ఆమె నవ్వు మమ్మల్ని రోజంతా ఉత్సాహంగా వుంచేది. ఆమె కోపం దాన్ని పూర్తిగా నాశనం చేసేది. అమ్మ తన విద్యార్థులను ప్రేమతో చూసుకుంది. ఆ ప్రేమ వెలుగులోకి రావడానికి మేము- అంటే నేను, నా సోదరుడు ఆమె కోపాన్ని భరించాల్సి వచ్చింది. ఆమె సామ్రాజ్యంలో వాతావరణం బాగున్నపుడు ఆమె ప్రేమతో, ఆప్యాయతతో వుండేది. చిన్నప్పుడు నా సోదరుడు ఇంట్లో 'జాస్' అనే హారర్ సినిమా చూసేటప్పుడు ఆమె ఒడిలో ఎక్కి కూర్చున్నాడు. నేనైతే అలా చేయడానికి అస్సలు ధైర్యం చేసేదాన్ని కాదు. ఆ ఒడి బయటి ప్రపంచంలోని షార్క్ కన్నా ఎక్కువ భయాన్ని కలిగించింది," అని రాసారు అరుంధతి. తల్లి చేసిన గాయాలే ఇప్పటి తన బలానికి





> **ఒక ఆదర్శ మహిళగానే గాక, తన తల్లిలో ఉన్న సంక్లిష్టతలను, ఇతరులకు కష్టం కలిగించిన కోణాలను కూడా అరుంధతీ రాయ్ ఈ పుస్తకంలో నిస్సంకోచంగా ఆవిష్కరించారు. ఈ స్మృతిగ్రంథం ప్రతి పాఠకుడికి ఒక సత్యాన్ని గుర్తుచేస్తుంది: "మనల్ని గాయపరిచిన వారే మనల్ని నిలబెట్టేవారు కావచ్చు."**

సాక్ష్యమంటారు! ఈ పుస్తకంలో తన తల్లి విరుద్ధమైన స్వభావాన్ని, ఆమె తన జీవితంపైనా, రచనలపైనా చూపిన లోతైన ప్రభావాన్ని నిజాయితీగా చిత్రించారు అరుంధతీ రాయ్.

మేరీ రాయ్ కేరళలో పుట్టి పెరిగిన సాధారణ మహిళ కాదు. ఆమె జీవితం సాంతం ఒక విప్లవమే! ట్రావెన్కోర్ క్రైస్తవ వారసత్వ చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీం కోర్టు వరకు పోరాడి, క్రైస్తవ మహిళలకు ఆస్తి హక్కును సాధించిన సాహసికురాలు. కేరళలో పల్లికూడం స్కూల్ స్థాపించి, వేలాదిమంది పిల్లలకు విద్యను ప్రసాదించిన విద్యా సంస్కర్త. అరుంధతీ రాయ్ నవల 'ద గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్' లోని 'అమ్ము' పాత్రకు స్ఫూర్తి మేరీ రాయ్‌నే!

'మదర్ మేరీ కమ్స్ టు మీ' అనే ఈ పుస్తకం కేవలం మేరీ రాయ్ గొప్పతనాన్ని మాత్రమే చూపించలేదు. ఒక ఆదర్శ మహిళగానే గాక, తన తల్లిలో ఉన్న సంక్లిష్టతలను, ఇతరులకు కష్టం కలిగించిన కోణాలను కూడా అరుంధతీ రాయ్ నిస్సంకోచంగా ఆవిష్కరించారు. ఈ స్మృతిగ్రంథం ప్రతి పాఠకుడికి ఒక సత్యాన్ని గుర్తు చేస్తుంది: "మనల్ని గాయపరిచిన వారే మనల్ని నిలబెట్టేవారు కావచ్చు. మన జీవితంలోని కొన్ని గాయాల వెనుక కూడా ప్రేమ ఉంటుంది. ప్రేమ ఎప్పుడూ మధురంగానే ఉండదు. అది కన్నీటి తుఫానుగా కూడా వస్తుంది. కానీ, ఆ తుఫానులే మన బలానికి పునాదులు వేస్తాయి." తల్లీకూతుళ్ల బంధంలోని ఈ విరుద్ధాల మేళవింపును ఈ పుస్తకం అద్భుతంగా ఆవిష్కరించింది. అరుంధతి రాయ్ సాహిత్య ప్రతిభకు, జీవితంలోని లోతైన క్షణాలను ధైర్యంగా బయటపెట్టే ఆమె నిజాయితీకి 'మదర్ మేరీ కమ్స్ టు మీ' నిదర్శనం. ఈ పుస్తకం చదువుతున్నప్పుడు మనం కేవలం అరుంధతీ రాయ్ జీవితాన్ని మాత్రమే కాదు, మన తల్లులతో మనకున్న బంధాన్ని కూడా పునరాలోచించుకుంటాం.

■ కృష్ణ కానూరి
✆ 79813 05779

దేహపు విత్తు

విత్తనం మహిమ తెలిసిన ఇంట్లోనే కదా
ఆమె మొలకెత్తింది!

విత్తనంలో
విత్తడంలో
బతుకు ఉంటాదనే పాఠం తెలిసిన అమ్మ!

అమ్మ విత్తిన ప్రతి విత్తనమూ
మొలిచిన ప్రతి మొలకా
గెమనానికి వొస్తాయి నాకు!

నా పసితనం నుంచీ,
నన్ను అనాథను చేసేసేదాకా..
విత్తిన ప్రతి విత్తూ!

అమ్మ విత్తిన అక్షరాలు
నా చదువులుగా మొలకెత్తాయి!
అమ్మ విత్తిన ఆలోచనలు
నా బుద్ధిలో పరిణతిగా మొగ్గతొడిగాయి!
నాపై విత్తిన ఆశలు
మొలకెత్తి నా జీవితంగా వికసించాయి!
నా వీపుపై బెత్తంతో విత్తిన విత్తులు
నాకు అబ్బిన క్రమశిక్షణగా ఫలించాయి!

అమ్మ మంచి సేద్యగత్తె
విత్తడం అమ్మ లక్షణం!
నేలతల్లిని పొదుపుకుని వచ్చిన మోగు
రెండాకులు తొడిగిన కాణ్ణించీ..
ఆ మొలకకు రక్షణ తొడుగు కూడా అమ్మే!
మొక్కకు దాహం తీర్చే చేరడు నీరూ అమ్మే!
వెలుతురుతో జీవం అందించే
ఏడుగుర్రాల రేడూ అమ్మే!

ఆకాశాన్ని లక్ష్యంగా ఎన్నుకుని
నిటారుగా ఎదగడం నేర్పింది అమ్మ!
బుర్ర తొలిచే పురుగులు చేరినప్పుడెల్లా
మందుల పిచికారీతో కాపాడిందే అమ్మ!
పనికిమాలిన కొమ్మల్ని ప్రూనింగ్ చేస్తూ
దృఢంగా తీరేలా చూసుకుంది అమ్మ!
అంటుకట్టి, పిలకలు ఎదిగేదాకా
ఆగి, ఆ సేద్యం అద్దంలో
తననూ, తన కష్టాన్నీ
తృప్తిగా చూసుకుంది అమ్మ!

ఆ మొక్క చెట్టు అయ్యాక..
ఆ ఫలాల్ని పూర్తిగా ఆస్వాదించకుండానే..
ఆ నీడన నిండా సేదతీరకుండా జారుకున్నదే అమ్మ!
ఆ నీడ తనకు చాలనుకున్నదా?



తన జాడ ఆ చెట్టుకు చాలనుకున్నదా?

ఆ నీడలో తన పాద తాడనాల సవ్వడులే..
ఆ చెట్టు వేర్ల గుండెచప్పుడులని
అమ్మకు తెలియదా?
నీడను ఏమార్చి తాను జారుకుంటే
ఆ గుండె నిస్సద్దు అవుతుందనీ
ఆ చెట్టు నిస్సత్తు వవుతుందనీ
అమ్మకి ఎరుకలేదా?

+++

అమ్మ తనను తాను విత్తుకుంది
తన దేహాన్ని విత్తుకుంది!
అనాటమీ ల్యాబులో మొలకెత్తుతుంది!
రేపటి డాక్టర్ల జ్ఞానంలో
పుష్పించి, ఫలించి వర్ధిల్లుతుంది!
చెట్టునీడన సేదతీరే రకం కాదు అమ్మ..
తనే శాఖోపశాఖలుగా మహావృక్షమై విస్తరిస్తుంది!

(మెడికల్ కాలేజీకి అమ్మ దేహదానం
తరువాత... మెలిపెడుతున్న యాదిలో)

■ కె.ఎ. మునిసురేష్ పిళ్లై
✆ 99594 88088

చదువు ముచ్చట

అర్థమయ్యే కథలే మేలైన కథలు అనుకునేవాణ్ని

సాయి వంశీ



రీసెంట్‌గా చదివి మీకు బాగా నచ్చిన రచన?

ఖదీర్ బాబు రాసిన 'వాన కురిసినప్పుడు మా ఇంట్లో'. ఆయన వాక్యం శ్రుతిలో రాగయుక్తంగా సాగుతున్న పాటలా ఉంటుంది.

మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవటం గుర్తుంది?

గురజాడ 'కన్యాశుల్కం'. ఇప్పటికి ఒక యాభైసార్లకు పైగానే చదివి ఉంటాను. ఎప్పుడు చదివినా మొదటిసారి చదువుతున్నట్లే అనిపిస్తుంది. అందులోని సంభాషణలు కంఠతా వచ్చేశాయి.

మీ పఠనాభిరుచి కాలంతోపాటు ఎలా మారింది?

చందమామ, బాలమిత్ర మాసపత్రికలతో మొదలైన ప్రయాణం, ఆ తర్వాత వారపత్రికల దాకా చేరింది. 2016 నుంచి కథల మీద అమితమైన ఆసక్తి ఏర్పడింది. మొదట్లో నాకు సులభంగా అర్థమయ్యే కథలే మేలైన కథలు అనుకునేవాణ్ని. నాలో అంతర్మథనం కలిగించి, ఆలోచింప జేసే కథల ప్రాధాన్యాన్ని గుర్తించాక అలాంటి కథల్ని వెతుక్కుని చదవడం మొదలుపెట్టాను. ఇప్పటికీ కథలంటే చాలా ఆసక్తిగా చదువుతాను. నవలలంటే మాత్రం కొంత ఎక్కువ సమయం తీసుకుంటాను.



మీరు ఎక్కువసార్లు చదువుకున్న కథా సంపుటి?

చిలుకూరి దేవపుత్ర రాసిన 'వంకరటింకర ఓ!' కథాసంపుటిని ఎక్కువసార్లు చదువుకున్నాను. రాయలసీమ సాహిత్యం అంటే కరువు, రాజకీయాలు, రైతుల సమస్యలు అనే ఆలోచన ఉన్న సమయంలో ఆయన అక్కడి మనుషుల జీవితాల్లో హాస్యాన్ని కథలుగా రాశారు. వంశీ 'మా పసలపూడి కథలు' పుస్తకాన్ని కూడా ఎక్కువసార్లు చదివాను.

సాహిత్యంలో మీకు ఆల్టర్ ఈగోలా అనిపించిన పాత్ర ఏది, ఎందుకు?

నేను చదివిన పరిమిత సాహిత్యంలో ఏ పాత్రా నాకలా అనిపించలేదు. ముందు నాకు నేను పరిపూర్ణంగా అర్థమైతే, ఆ తర్వాత నాకు ఆల్టర్ ఈగోలా అనిపించే పాత్రను పోల్చుకోవచ్చు.

మీ నమ్మకాల్ని ప్రభావితం చేసిన రచన?

బిభూతి భూషణ్ బందోపాధ్యాయ రాసిన బెంగాలీ నవల 'పథేర్ పాంచాలీ' జీవితం పట్ల కొత్త దృక్పథాన్ని అందించింది. అప్పటిదాకా నేను చూస్తున్న జీవితాలకు భిన్నమైన మనుషులు ఈ ప్రపంచంలో ఉన్నారని తెలిసేలా చేసిన రచన అది. దాన్ని మద్దిపట్ల సూరి తెలుగులోకి అనువదించారు. ఆయన అనువాదం అద్వితీయం.

(2024లో 'మైక్రో కథలు' కథాసంపుటి వెలువరించారు. 'రేగి అచ్చులు' పేరుతో పుస్తక ప్రచురణ చేస్తున్నారు.)

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
సోమవారం 15 సెప్టెంబరు 2025



ఇల్లందలో మరో అహోబిలం
ఒకే ప్రాంగణంలో శైవ-వైష్ణవ దేవాయాలు
7



నేను పూటకో పార్టీ మారలేదు..

- 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నా..
- నాపై విమర్శలు మంత్రి విజ్ఞతకే వదిలేస్తున్నా..
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



జీడబ్ల్యూఎంసీ వద్ద మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): 'నాకు కాంగ్రెస్ పార్టీతో 40 ఏళ్ల అనుబంధం ఉంది.. నేను పూటకో పార్టీ మారలేదు..' అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆదివారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ నుంచి ఇండోర్‌కు వెళుతున్న స్టడీటూర్ బస్సుల ప్రారంభానికి హాజరై విలేకరులతో మాట్లాడారు. తాను అదృష్టవంతుడిని కావడంవల్లనే ఎమ్మెల్యేగా గెలుపొందానని అన్నారు. అదృష్టం లేని వారు ఎందుకు గెలుస్తారని మంత్రి సురేఖ చేసిన వాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. నేను పూటకో పార్టీ మారితే నేను కూడా నాలుగైదుసార్లు ఎమ్మెల్యేగా ఉండేవాడినని (మిగతా 6లో..)

ప్రాణాలర్పించినా పట్టించుకోరా ?

- రజాకార్లతో పోరాడిన తిమ్మంపేట గ్రామం
- చిహ్నాలుగా మిగిలిన బురుజు, చావడీలు
- గుర్తించాలంటున్న గ్రామస్థులు

7



'ఫీ'పైర్!

ఫీజు బకాయిలు చెల్లించాలని కళాశాలల సమ్మెబాట

- నేటి నుంచి 21వ తేదీ వరకు తొలి దఫా మూసివేత
- ఈలోగా చెల్లించకుంటే కళాశాలల నిరవధిక సమ్మె
- నాలుగేళ్లుగా పేరుకుపోయిన రీయింబర్స్‌మెంట్ బిల్లులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో రూ.570కోట్ల బకాయిలు
- టోకెన్లు ఇచ్చినా విడుదల కాని నిధులు
- పలుకుబడి ఉన్న కాలేజీ యాజమాన్యాలకే చెల్లింపులు
- మనుగడ కష్టంగా మారిన చిన్న కాలేజీలు

హనుమకొండ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థలు ఆందోళనబాట పట్టడంతో విద్యార్థుల భవిష్యత్తుపై అయోమయం నెలకొన్నది. ఈనెల 15 సోమవారం నుంచి 21వ తేదీ వరకు మొదటిదఫాగా విద్యాసంస్థల బంద్ పాటించాలని ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో నిర్ణయించారు. ఈలోగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలిన ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. ఒక వేళ చెల్లించకుంటే 21వ తేదీ నుంచి నిరవధికంగా కళాశాలలను బంద్ పెట్టాలని నిర్ణయం తీసుకున్నది. ఈ సమావేశానికి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సుందర్‌రాజుతోపాటు పలు ఉన్నత విద్యా సంస్థల యాజమాన్యాలు పాల్గొన్నాయి.

రూ.570కోట్ల బకాయిలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివిధ ప్రైవేటు కాలేజీల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెద్ద ఎత్తున పేరుకుపోతున్నాయి. ప్రైవేటు యాజమాన్యాల కింద నడుస్తున్న ఇంజనీరింగ్, ఫార్మసీ, నర్సింగ్, బీఈడీ, ఎంఈడీ, డిగ్రీ, జూనియర్ కాలేజీలకు స్కాలర్‌షిప్పులతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. సంక్షేమ శాఖలు రీయింబర్స్‌మెంట్ బిల్లులను ఎప్పటికప్పుడు తయారు చేసి ట్రెజరీలకు సమర్పిస్తున్నాయి. ట్రెజరీల్లో చెల్లింపుల కోసం ఆర్థిక శాఖ సైతం టోకెన్లు జారీ చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2022-23, 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు సంబంధించిన బకాయిలు రూ.570కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ మొత్తంలో 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి రూ.170కోట్లు, 2023-24కు సంబంధించి రూ.170కోట్లు, 2024-25 సంవత్సరం బకాయిలు రూ.170కోట్లు, 2025-26 విద్యా సంవత్సరం మార్చితో ముగియనున్నది. ఈ బకాయిలు కూడా కలుపుకుంటే మొత్తం బకాయిలు రూ.680 కోట్లకు చేరుకుంటుంది. ట్రెజరీలో బిల్లులు చెల్లించిన తర్వాత బకాయిలు చెల్లించడానికి టోకెనుగా ఇచ్చిన మొత్తం రూ.50 కోట్ల వరకు ఉన్నాయి. ఎక్కువ మొత్తం బకాయిలు హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిలోని కాలేజీలకు రావలసివే. సుమారు లక్షమంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి చదువుకుంటున్నారు. వీరిలో 50శాతం మంది బీసీ విద్యార్థులే కావడం గమనార్హం. ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతానికి చెందినవారు. ఎప్పుడో 2019 సంవత్సరానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు.. అది కూడా కొద్ది మొత్తం ఇటీవలే విడుదలయ్యాయంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం ఫీజు కడుతుందికదా అన్న ధీమాతో ప్రైవేటు కళాశాలల్లో చేరిన పేద విద్యార్థుల కష్టాలు ఏ స్థాయిలో ఉన్నాయో అంచనా వేయవచ్చు. కష్టపడి చదువు పూర్తిచేసినా ఫీజు కట్టనందుకు కళాశాలల నుంచి ఫైనల్ సర్టిఫికెట్లు పొందలేని దౌర్భాగ్య స్థితివారిది.

మూడేళ్ల నుంచి..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2022-23, 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు సంబంధించిన ఫీజుల చెల్లింపు ఇప్పటి వరకు జరగలేదు. మార్చివస్తే 2025-26 విద్యా సంవత్సరం బకాయిలు కూడా తోడవుతాయి. ఒక్కో కాలేజీకి విద్యార్థుల సంఖ్యను బట్టి గరిష్ఠంగా రూ.10కోట్ల నుంచి రూ.25కోట్ల వరకు బకాయిలు రావలసి ఉంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 397 ఉన్నత విద్యా కళాశాలలు ఉన్నాయి. 8 ఇంజనీరింగ్ కాలేజీలు, 24 ఫార్మసీ కాలేజీలు, 8 నర్సింగ్ కాలేజీలు, 20 బీఈడీ కాలేజీలు, మూడు అగ్రికల్చరల్ కాలేజీలు, 2 హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీలు, 332, ఇంటర్, డిగ్రీ కాలేజీలు నడుస్తున్నాయి. ఒక్క హనుమకొండ జిల్లాలోనే 282 కాలేజీలు (మిగతా 6లో..)



ఫీజు రీయింబర్స్‌మెంట్స్ వెంటనే చెల్లించాలి

సంగంరెడ్డి సుందర్ రాజు యాదవ్,
డిగ్రీ, పీజీ కళాశాల అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు

ఉన్నత విద్యా సంస్థలకు మూడేళ్లుగా ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి. ఈనెల 15 నుంచి 21వరకు ఉన్నత విద్యా సంస్థలు బంద్ పాటిస్తాయి. అప్పటికీ ప్రభుత్వం స్పందించపోతే నిరవధిక బంద్ పాటిస్తాయి. రాష్ట్రంలో 25లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి తమ ఉన్నత చదువులను కొనసాగిస్తున్నారు. ఫీజు రీయింబర్స్ చేయకపోవడంవల్ల ఎక్కువగా నష్టపోయేది బహుజన విద్యార్థులే. వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలి.

కమిషనరేట్‌లో 10,321 కేసుల పరిష్కారం

- సత్ఫలితాలిచ్చిన జాతీయ లోక్ అదాలత్
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



వరంగల్ క్రైం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని సెంట్రల్, ఈస్ట్, వెస్ట్ జోన్‌లలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 10,321 కేసులు పరిష్కారమైనట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. అదే విధంగా సైబర్ క్రైం కేసుల్లో 83 లక్షలకు పైగా రీఫండ్ మొత్తాన్ని బాధితులకు అందజేయాల్సిందిగా కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. రాజీపడిన 10,321 కేసుల్లో 1,073 ఎఫ్ఐఆర్ కేసులు, 6,012 ఈ పెట్టి కేసులు, 3,003 డ్రంకెన్ డ్రైవ్, మోటార్ వెహికల్ చట్టం కేసులు, 227 సైబర్ కేసులు ఉన్నాయన్నారు. కేసుల పరిష్కారానికి కృషిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని సీపీ అభినందించారు. అలాగే లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవడానికి సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయసేవాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



6

ధర్మసాగర్‌లో రాజయ్య దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

తాటికొండ వ్యాఖ్యలపై భగ్గుమన్న కాంగ్రెస్


- ధర్మసాగర్, వేలేరులో దిష్టిబొమ్మల దహనం
- కడియం జోలికొస్తే ఊరుకోమంటూ హెచ్చరిక

ఉసురు తీసిన 'యూరియా'

- కూపన్ల కోసం బైక్‌పై వెళుతుండగా ప్రమాదం
- బొలెరో ఢీకొని ఇద్దరు రైతుల మృతి
- జగన్నాయకులగూడెం రహదారిపై ఘటన



బానోత్ లాల్య(ఫైల్)



ధరావత్ వీరన్న(ఫైల్)

గూడూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): యూరియా కూపన్ల కోసం వెళుతున్న ఇద్దరు రైతులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడ్డారు. గూడూరు మండలం జగన్నాయకుల గూడెంలో వద్ద ఆదివారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి గూడూరు ఎస్సై గిరిధర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుబ్బగూడెంకు చెందిన బానోతు లాల్య (77)కు రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో వరి, మిర్చి, మొక్కజొన్న పంటలను సాగు చేశాడు. జోషి తండాకు చెందిన ధరావత్ వీరన్న (46)కు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా అందులో వరి, మిర్చి, మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్నాడు. పంటకు యూరియా తీసుకు వచ్చేందుకు ఇద్దరు కలిసి ద్విచక్రవానంపై కూపన్‌లను తీసుకునేందుకు బొద్దుగొండ రైతువేదిక వద్దకు వస్తున్నారు. ఈ క్రమంలో జగన్నాయకులగూడెం క్రాస్‌రోడ్డు వద్ద మహబూబాబాద్ నుంచి నర్సంపేట వైపు వెళుతున్న బోలేరో వాహనం.. ద్విచక్రవాహనంపై వస్తున్న రైతులను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి లాల్య అక్కడికక్కడే మృతి చెందగా వీరన్నను మహబూబాబాద్ జిల్లా అస్పత్రికి తరలించారు. అనంతరం అక్కడ వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు తరలిస్తుండగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐ సూర్య ప్రకాష్ ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతుడు లాల్యకు భార్య లక్ష్మి, కుమారుడు రమేష్, కుమార్తెలు సునీత, వినోద ఉన్నారు. ధారావత్ వీరన్న కు భార్య లక్ష్మి, కుమారుడు గణేష్, కుమార్తెలు అఖిల, సునీతలు ఉన్నారు. మృతి చెందిన రైతుల కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా, మృతిచెందిన రైతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మార్చురీ గది ఎదుట బాధితకుటుంబ సభ్యులు బైఠాయించి అందోళన చేపట్టారు. వారికి మద్దతుగా మాజీమంత్రి సత్యవతిరాథోడ్ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు సత్యవతిరాథోడ్ రైతుల మృతి విషయాన్ని ఫోన్‌ద్వారా వివరించారు. రైతులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు జీడబ్ల్యూఎంసీలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతీ వారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించడం జరుగుతుందని గ్రేటర్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ తెలిపారు.

ప్యాచ్ పనులు పైపైనే..

నాణ్యతాలోపంతో నగర రోడ్లకు మరమ్మతు పనులు

- వేసిన గంటల్లోనే పాడైపోతున్న వైనం
- తూతూ మంత్రంగా పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు
- పట్టించుకోని గ్రేటర్ అధికారులు, పాలకులు



ములుగురోడ్డులో మెటల్‌రోడ్డుకు బదులు సీసీ రోడ్డు పనులు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ పరిధిలో ఇటీవల కురిసిన వర్షాలకు నగరంలోని కొన్నిచోట్ల రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. అంతే కాకుండా కాలనీలు, ప్రధాన రహదారిని కలిపే అంతర్గత రోడ్లుచాలా ప్రాంతాల్లో గుంతలు పడి ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. అటుగా ప్రయాణించే వాహనదారులకు రోడ్లపై ఏర్పడిన గుంతలు తలనొప్పిగా మారుతున్నాయి. దీనిపై అధికారులు ప్రత్యేక బడ్జెట్ ద్వారా ప్యాచ్ వర్క్ పనులు చేస్తున్నప్పటికీ అవి కొన్ని గంటల్లోనే కొట్టుకుపోతున్నాయి. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో రోడ్డు మరమ్మతు పనులు లోపభూయిష్టంగా మారాయి. ప్రధానంగా కేయూ రోడ్డు, రంగశాయిపేట, శివనగర్, ఏనుమాముల, చిన్నవడ్డెపల్లి చెరువు రోడ్డు, భద్రకాళి రోడ్డు, భట్టుపల్లిరోడ్డు, పోతననగర్, 12 మోరీల రోడ్డు, చింతల్, లేబర్ కాలనీ, గోపాలపురం, దర్గా, బాపూజీనగర్ ప్రధాన రోడ్లు వర్షం కారణంగా గుంతలు ఏర్పడ్డాయి. కేయూ బైపాస్‌రోడ్డు గొల్లపల్లి, రెడ్డికాలనీ వద్ద అగుడులోతు గుంత ఏర్పడినా సంబంధిత అధికారులు, స్థానిక కార్పొరేటర్ పట్టించుకోవడం లేదని

నాణ్యతా ప్రమాణాలు గాలికి..

రోడ్ల మరమ్మతులు పనుల్లో వినియోగించిన మెటీరియల్ నాసిరకంగా ఉండడం, పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల కొందరు కాంట్రాక్టర్లు తూతూ మంత్రంగా పనులు చేసి వదిలివేశారు. రోడ్లపై ఏర్పడిన గుంతల్లో మెటల్ రోడ్డుపై సీసీ రోడ్డుకు ఉపయోగించే సిమెంట్, కంకరపోసి చేతులు దులిపేసుకున్నారు. ఇంకా కొన్నిచోట్ల మొరం మాత్రమే పోసి పనులు పూర్తిచేసినట్టు బిల్లులు కాజేస్తున్నట్లు విమర్శలున్నాయి. అయితే పనులు చేసిన కొన్ని రోజుల్లోనే యథాస్థితికి చేరడంతో ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. నగర రోడ్లపై ఏర్పడిన గుంతల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కాగా, సంబంధిత ఇంజనీరింగ్ అధికారితో మాట్లాడగా నిబంధనల ప్రకారమే ప్యాచ్ వర్క్‌లు చేస్తున్నామన్నారు. (మిగతా 6లో..)

17, 18 తేదీల్లో ఎస్‌జీఎఫ్ఐ మండల స్థాయి క్రీడలు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈ నెల 17, 18 తేదీల్లో హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ఐ క్రీడా పోటీల మండల కార్యదర్శి ఎం.కరుణాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17 బాలబాలికల విభాగాల్లో రెండు రోజుల పాటు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడాంశాల్లో మండల స్థాయిలో ఎంపిక పోటీలను నిర్వహిస్తామన్నారు. అండర్-14 బాలబాలికల విభాగంలో పాల్గొనే వారు 1 జనవరి 2012 సంవత్సరం తర్వాత జన్మించిన వారు అర్హులని, అండర్-17 బాలబాలికల విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 1 జనవరి 2009 సంవత్సరం తర్వాత జన్మించిన వారు ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనడానికి అర్హులన్నారు. ఇక్కడ మండల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు త్వరలో జిల్లా స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీల్లో ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 7396051876 నంబర్‌లో సంప్రదించాలని కరుణాకర్ సూచించారు.

బ్లూ క్రాస్ అధ్యక్షుడిగా కొడకండ్ల సదాంత్



సదాంత్‌కు నియామక పత్రం అందిస్తున్న అక్కినేని అమల

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, అక్కినేని నాగార్జున ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొడకండ్ల సదాంత్ ఉమ్మడి వరంగల్ జిల్లా బ్లూ క్రాస్ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. బ్లూ క్రాస్ సంస్థ 33వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ చైర్‌పర్సన్ అక్కినేని అమల ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూగజీవులను చంపకూడదని, ఈ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లను, ఇతర అధికారులను కలిసి బ్లూ క్రాస్ సంస్థ చేస్తున్న సేవల గురించి తెలియజేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో బ్లూ క్రాస్ మేనేజర్ కుమారి, సభ్యులు నరేందర్ నాయుడు, తూము నారాయణ, గుండెటి రాజేష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా నర్సంపేట రోడ్డు



గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారిన రోడ్డు

గీసుగొండ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారి మండలంలోని హోల్‌సేల్ మార్కెట్ సమీపంలో ప్రమాదకరంగా మారింది. నిరంతరం వందలాది వాహనాలు నడిచే రోడ్డుపై గుంతలు ఏర్పడి ఎపుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక పెట్రోల్ బంక్ ఎదురుగా రోడ్డు డైవర్షన్ వద్ద గుంత ఏర్పడి వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా పడిపోయే అవకాశం ఉంది. రోడ్డు పక్కనే ఇటీవల కురిసిన వర్షాలకు బురదగుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనదారులు రోడ్డు దిగాలన్నా ఇబ్బందిగా మారుతుందని వాపోతున్నారు. కాగా, ఇటీవల వర్షాలు పడినప్పుడు రోడ్డుపై ఉన్న గుంతలో నీరు నిలిచి వాహనదారులు గుర్తించక పోవటంతో కొందరు ద్విచక్ర వాహనదారులు పడిపోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. వరదనీరు రోడ్డుపై వరకు నిలిచి పోవటంతో రోడ్డు ఇరుకుగా మారి వాహనాలు అదుపుతప్పుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ లారీలు అడ్డగా ఉండటంతో తరుచూ లారీలు మట్టినేలపై నుంచి బీటీ రోడ్డుపైకి రావటంతో టైర్ల ద్వారా వచ్చిన మట్టి బురదమయంగా మారుతుందని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. ఒక్కోసారి ద్విచక్ర వాహనాలు స్కిట్ అయి పడిపోతున్నట్లు చెబుతున్నారు. ఎప్పుడు రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

స్టడీ టూరా? విహార యాత్రనా?

- కార్పొరేటర్ల పర్యటనపై విమర్శల వెల్లువ
- స్మార్ట్‌సిటీ నిధుల వినియోగంపై ఆగ్రహం



అధ్యయన యాత్ర బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మహా నగరపాలక సంస్థ పాలక మండలి పదవీకాలం మరో ఏడుమాసాల్లో ముగుస్తుండగా ప్రజాప్రతినిధులు, అధికారులు స్టడీ టూర్‌కు వెళ్లడం విమర్శలకు తావిస్తోంది. ఈ స్టడీ టూర్‌కు ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన సుమారు రూ.50లక్షల వరకు ఖర్చు చేయడంపై నగర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బల్దియాఆదాయాన్ని దుర్వినియోగం చేస్తున్నారని సామాజిక కార్యకర్తలు, నగర ప్రజలు విమర్శిస్తున్నారు.

ఖర్చు బల్దియాదే..

ఈనెల 14నుంచి 19 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్, రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో పర్యటించేందుకు కార్పొరేటర్లు, అధికారులు బయలుదేరారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు, రాత్రి 8.10 గంటలకు హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి రెండు విమానాల్లో ఇండోర్‌కు చేరుకున్నారు. మేయర్‌తోపాటు 55 మంది కార్పొరేటర్లు, 23 మంది జీడబ్ల్యూఎంసీ వింగ్ అధికారులకు విమాన టికెట్లు స్మార్ట్‌సిటీ నిధులతో బుక్ చేశారు. వీరిలో కొందరు మహిళా కార్పొరేటర్ల భర్తలు, పురుష కార్పొరేటర్ల భార్యలు, ఇంకా కొందరు కార్పొరేటర్ల తనయులు సుమారు 40 మంది కార్పొరేషన్ నిధులతో విమానంలో ప్రయాణించడం వివాదంగా మారింది. ఇది స్టడీ టూర్ కాదని, పక్కా విహారయాత్ర అని కొందరు సామాజిక కార్యకర్తలు ఘాటుగా విమర్శిస్తున్నారు.

ఉత్తమ ర్యాంకు కోసం కృషి చేయాలి

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శానిటేషన్‌తో ఉత్తమ ర్యాంకు సాధించేందుకు అన్ని విభాగాల వింగ్ అధికారులు, కార్పొరేటర్లు కృషి చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం వరంగల్ నగరం నుంచి మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌కు అధ్యయన కార్యక్రమానికి వెళుతున్న కార్పొరేటర్ల బస్సులను ప్రారంభించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో యేటా ప్రథమ స్థానంలో నిలిచే ఇండోర్‌కు కార్పొరేటర్లు, అధికారులు వెళ్లడం సంతోషంగా ఉందన్నారు. అధ్యయన కార్యక్రమంలో విశ్లేషించిన అంశాలను ఇక్కడ అమలు చేసి దేశంలో స్థానం సంపాదించాలని అన్నారు. వరంగల్ నగరం ఉత్తమ శానిటేషన్ అవార్డును గెలిచేందుకు అధికారులతో పాటు నగర ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ప్రయాణికుడు పోగొట్టుకున్న నగదు అందజేత

వరంగల్ క్రైం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆటోలో పోగొట్టుకున్న రూ.3లక్షల నగదును గుర్తించి తిరిగి బాధితుడికి అప్పగించినట్లు మిల్స్‌కాలనీ సీఐ బొల్లం రమేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన మహ్మద్ అప్సర్.. ఆదివారం సెకండ్ హ్యాండ్ మహేంద్ర బొలేరో వాహనం కొనుగోలు చేసేందుకు వరంగల్ ఆర్‌టీవో కార్యాలయం వద్ద ఉన్న కన్సల్టెన్సీకి వచ్చాడు. ఆటో దిగే సమయంలో తనతో తెచ్చుకున్న రూ.3లక్షల డబ్బుల బ్యాగును మరిచిపోయాడు. వెంటనే మిల్స్‌కాలనీ పోలీసులను ఆశ్రయించగా ఎస్సై శ్రవణ్, క్రైం పార్టీ హోంగార్డు జంపాల నాగేశ్వర్‌రావు సీసీ కెమెరాలు పరిశీలించారు. ఆటో వివరాలు తెలుసుకుని బాధితుడికి తిరిగి అందజేశారు. డబ్బులను నిజాయితీగా తిరిగి ఇచ్చిన కాజీపేటకు చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ యాసిన్‌ను పోలీసులు అభినందించారు.



బాధితుడికి డబ్బులు అందజేస్తున్న సీఐ రమేశ్

ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఆనందం

రాంనగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడిగా వరంగల్ సర్కిల్‌లో టెక్నికల్ డీఈగా విధులు నిర్వర్తిస్తున్న ఎ.ఆనందంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం హనుమకొండలోని ఓ సమావేశ మందిరంలో రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శ్యామ్ మనోహర్, రాష్ట్ర సెక్రటరీ జనరల్ మేడి రమేశ్ ఆధ్వర్యంలో కంపెనీ ఎన్నికలు నిర్వహించారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.శంకర్, జనరల్ సెక్రెటరీగా ఎన్.కుమారస్వామిలను ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఆనందం మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై విరామం లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమస్యల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సంఘం ఏ పిలుపునిచ్చినా ఉద్యోగులు కదలిరావాలని కోరారు. రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ నాంపెల్లి, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.చంద్రయ్య, అసోసియేషన్ ఫౌండర్ కలకుంట్ల మాణిక్యం పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్, కార్యదర్శి

టీపీడీఈఏ అధ్యక్ష, కార్యదర్శులుగా సుబ్రమణ్యేశ్వర్‌రావు, మల్లికార్జున్

రాంనగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీజీ ఎన్పీడీసీఎల్ తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ కంపెనీ కార్యవర్గం అధ్యక్ష, కార్యదర్శులుగా నార్ల సుబ్రమణ్యేశ్వర్‌రావు, మల్లికార్జున్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎలక్షన్ ఆఫీసర్ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం హంటర్‌రోడ్డులోని దీపాభవన్‌లో జరిగిన ఎన్నికల్లో కంపెనీ డిప్యూటీ జనరల్ సెక్రటరీగా అనిల్‌కుమార్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఇంద్రాసేనారెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా ఎ.శ్రీనివాస్, అడ్వయిజర్లుగా మధుసూదన్, మనోహర్, కార్యవర్గ సభ్యులుగా తరుణ్, వరుణ్, జ్యోతిర్మయి, రాములు, లక్ష్మణ్‌నాయక్, వాలునాయక్, సత్యనారాయణ, యుగేందర్, ఖలీం, టి.శ్రీనివాస్, కాంత్రికుమార్, కార్యాలయం కార్యదర్శిగా భవాని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎలక్షన్ అధికారి నరేందర్ తెలిపారు.



సుబ్రమణ్యేశ్వర్‌రావు, మల్లికార్జున్

ప్యాచ్ పనులు పైపైనే..

(5వ పేజీ తరువాయి)

అక్కడి ప్రజలు మండిపడుతున్నారు. ఇంజనీరింగ్ అధికారులు కాసులకు కక్కుర్తిపడి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నారు.

గ్రేటర్ అధికారుల తీరుపై విమర్శలు

ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలమయమైన రోడ్లను పూడ్చేందుకు మరమ్మతు పనులు చేపట్టాలని మునిసిపల్ ఉన్నతాధికారులు ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. ఈ మేరకు రూ.10లక్షలు కేటాయించారు. కానీ కొందరు కాంట్రాక్టర్లు నాణ్యతపై శ్రద్ధ చూపకుండా పైపైనే మెరుగులుదిద్ది చేతులు దులుపుకుంటున్నారు. కొందరు కాంట్రాక్టర్లు తూతూమంత్రంగా రోడ్ల మరమ్మతు పనులు చేసి బిల్లులు కాజేసినట్టు విశ్వసనీయ సమాచారం.



యాదవనగర్‌లో మరమ్మతు పనులు కొట్టుకుపోయిన దృశ్యం

తాటికొండ వ్యాఖ్యలపై భగ్గుమన్న కాంగ్రెస్

- ధర్మసాగర్, వేలేరులో దిష్టిబొమ్మల దహనం

ధర్మసాగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అనుచిత వాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ ధర్మసాగర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. బస్టాండ్ సెంటర్‌లో రాజయ్యకు వ్యతిరేకంగా నాయకులు, కార్యకర్తలు పెద్దపెత్తున నినాదాలు చేశారు. అనంతరం రాజయ్య దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ.. రాజకీయంగా, వ్యక్తిగతంగా దూషించుకోవడం సహజమని, రాజయ్యకు ప్రజల్లో మద్దతు లేకపోవడం వల్ల అసహనానికి గురై ఇలా మాట్లాడుతున్నారని అన్నారు. అనంతరం రాజయ్యపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ధర్మసాగర్ పోలీసుస్టేషన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్, మండల నాయకులు వల్లపురెడ్డి రాంరెడ్డి, తోట నాగరాజు, శరత్, పెసరు రమేష్, మంద ఆరోగ్యం, వెంకట్‌రెడ్డి, పాషా, మాజీ ఎంపీటీసీ సుధాకర్, కునూరు రాజు, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు: ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే రాజయ్య అనుచిత వ్యాఖ్యలు చేశారని నిరసిస్తూ వేలేరులో రాజయ్య దిష్టిబొమ్మను దహనం చేశారు. రాజయ్యకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల నాయకులు సద్దాం హుసేన్ మాట్లాడుతూ.. కడియం శ్రీహరిని తలుచుకోనిది రాజయ్యకు నిద్రపట్టడం లేదన్నారు. నిజాయితీ పరుడివైతే పార్టీ టిక్కెట్ కేసీఆర్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కడియం శ్రీహరి జోలికి వస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి రణాధీర్‌రెడ్డి, సంపత్, రమేష్, అనుదీప్, సలీమ్ మాలిక్, బి.శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.



వేలేరు మండల కేంద్రం అంబేద్కర్ సెంటర్‌లో మాట్లాడుతున్న మండల నాయకులు సద్దాంహుసేన్

నేను పూటకో పార్టీ మారలేదు..

(5వ పేజీ తరువాయి)

ఎద్దేవా చేశారు. భద్రకాళి అమ్మవారి ధర్మకర్తల నియామకం పారదర్శకంగా లేదని ఎమ్మెల్యే అన్నారు. మంత్రి పీఏ తల్లిని ధర్మకర్తగా నియమించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 15 ఏళ్లుగా ఆలయ కమిటీలో అన్యాయం జరుగుతోందన్నారు. ఇటీవల ధర్మకర్తల నియామకం విషయంలో 7 మీకు, 4 మాకు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యే కావాలని ఎప్పుడూ రాజకీయాలు చేయలేదని నాయిని అన్నారు. 12 ఏళ్లపాటు ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా, 12 ఏళ్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా చేశానని, పార్టీలో 40 ఏళ్ల ప్రయాణం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం రక్తం ధారపోసి పనిచేశానని, ఎన్నోసార్లు కేసులపాలయ్యానని అన్నారు. తాను పార్టీ మారితే చాలా అవకాశాలు వచ్చేవని, ఇప్పటివరకు మారకపోవడం వల్లనే ఎమ్మెల్యే స్థాయిలో ఉన్నానని అన్నారు. తనపై మంత్రి కొండా సురేఖ చేసిన విమర్శలు ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. జిల్లా మంత్రి అంటే.. అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలను సమన్వయం చేసి పని చేయాలని, పార్టీ కోసం పనిచేసిన ప్రతీ కార్యకర్తలకు గుర్తింపునివ్వాలి తప్ప.. వ్యక్తిగత విమర్శలు చేయడం సరైంది కాదని హితవు పలికారు. తాను కాంగ్రెస్ పార్టీలో నిఖార్సైన కార్యకర్తనని, తన ప్రాణం ఉన్నంత వరకు పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు.

తండ్రి, సవతి తల్లి వేధింపులతో..

- వేలేరులో యువతి ఆత్మహత్య
- ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్థులు, బంధువులు
- పోలీసులు సర్దిచెప్పడంతో అంత్యక్రియలు పూర్తి





పీచరలో పోలీసులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్థులు, మనీషా (ఫైల్)

వేలేరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ యువతి మృతి చెందిన సంఘటన వేలేరు మండలం పీచరలో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పీచర గ్రామానికి చెందిన శివరాత్రి రాజు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. రాజుకు కుమారుడు కుమారస్వామి, కూతురు మనీషా(18) ఉన్నారు. కాగా, 15 ఏళ్ల కిందట రాజు భార్య లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. ఆ తర్వాత రాజు రెండో వివాహం చేసుకున్నాడు.

కాగా, రాజు కుమారుడు కుమారస్వామి హైదరాబాద్‌లో ప్రైవేట్ కంపెనీలో పని చేసేందుకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన సవతి తల్లి లక్ష్మి, తండ్రి రాజు నిత్యం మనీషాను వేధింపులకు గురిచేయడంతో పాటు కొడుతుండేవారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కూడా గొడవ పడి కొట్టడంతో మనీషాను నానమ్మ సుభద్ర వ్యవసాయ పనులకు తీసుకువెళ్లింది. అక్కడ పత్తి చేనులో సుభద్ర కలుపు తీస్తుండగా మనీషా అక్కడే ఉన్న చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో సుభద్ర చుట్టుపక్కల వారికి సమాచారాన్ని అందించగా గ్రామస్థులు వెంటనే పోలీసులకు తెలియజేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

కాగా, పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలు నిర్వహించేందుకు శనివారం స్వగ్రామానికి మనీషా మృతదేహాన్ని తీసుకరాగా మృతురాలి బంధువులు, పీచర గ్రామస్థులు అంత్యక్రియలను అడ్డుకుని నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. సవతి తల్లి, తండ్రిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఆస్తిని కుమారస్వామి పేరున రిజిస్ట్రేషన్ చేయించాలని డిమాండ్ చేశారు. కుమారస్వామి పేరుపై రిజిస్ట్రేషన్ చేయిస్తామని ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, సీఐ ప్రవీణ్‌కుమార్ హామీ ఇవ్వడంతో శాంతించగా, అంత్యక్రియలు నిర్వహించారు.

ఐటీఐలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):కాజీపేట బాపూజీనగర్‌లోని ప్రభుత్వ ఐటీఐలో 2025-26 విద్యా సంవత్సరానికి మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, 14 సంవత్సరాల వయస్సు కలిగిన అభ్యర్థులు fuv-H'zHay www.iti.telengana.govt.in ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని వాక్ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు.

'ఫీ'ఫైర్!

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. వీటిలో ఇంజనీరింగ్ కళాశాలల రీయింబర్స్‌మెంట్ ఫీజు రూ.35వేలు. మిగతావాటివి రూ.25వేల లోపే. ఒకప్పుడు 27 ఇంజనీరింగ్ కాలేజీలు ఉండేవి. నిర్వహణ భారంవల్ల వీటిలో చాలా వరకు మూతపడ్డాయి.

టోకెన్లు ఇచ్చినా..

ఫీజు రీయింబర్స్ బకాయిల బిల్లుల దరఖాస్తులను ఆయా ప్రైవేటు కళాశాలల యజమాన్యాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల్లో ఎప్పటికప్పుడు సమర్పిస్తున్నాయి. వీటికి ఆ కార్యాలయాలు టోకెన్లయితే ఇస్తున్నారు కానీ.. చెల్లింపులు జరగడం లేదని కళాశాలల నిర్వాహకులు వాపోతున్నారు. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించిన దరఖాస్తులను గత సంవత్సరం నవంబర్, డిసెంబర్ నెలల్లోనే సమర్పించారు. వీటికి టోకెన్లు ఇవ్వగానే ఇక చెల్లింపులు జరుగుతాయని కళాశాలల యజమానులు ఆశపడ్డారు. కానీ ఇప్పటి వరకు ఒక్కపైసా కూడా ఇవ్వకపోవడంతో వారు నిరాశకు లోనవుతున్నారు. నిధుల ఫ్రీజింగ్ వల్ల ప్రతీనెల ఉద్యోగుల వేతనాలు, పెన్షన్ నిధులను మాత్రమే పరిష్కరిస్తున్నామని, మిగతా ఎలాంటి బిల్లులకు ఆమోదం లభించడం లేదని సంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు. మూడేళ్లుగా ఫీజులు విడుదల కాకపోవడంతో కళాశాలలను నడపడం కష్టంగా ఉందని యజమాన్యాలు వాపోతున్నాయి.

సర్టిఫికెట్లు ఇవ్వక..

ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించక పోవడంతో యాజమాన్యాలు చదువు పూర్తిచేసిన విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయి. దీంతో విద్యార్థులు ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. పైచదువులకోసం వేరే కాలేజీలో ప్రవేశం తీసుకోవాలనుకుంటున్న విద్యార్థులు సైతం సర్టిఫికెట్లు లేక నష్టపోతున్నారు. దీనితో మరోదారి లేక పేద, మధ్య తరగతి విద్యార్థులు అప్పులు చేసి ఫీజు బకాయిలు చెల్లించి సర్టిఫికెట్లను తీసుకోవలసి వస్తోంది.

పలుకుబడి ఉంటేనే..

అధికార పార్టీ అండదండలు, పలుకుబడి ఉన్న ప్రైవేటు కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మాత్రం వెంట వెంటనే చెల్లింపులు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. పేరున్న విద్యాసంస్థల యాజమాన్యాలు తమ పలుకుబడిని ఉపయోగించి, ప్రభుత్వం నుంచి ఒత్తిడి తెచ్చి ఎలాగోలా బకాయిలను క్లియర్ చేయించుకుంటున్నాయి. కానీ పలుకుబడి, రాజకీయ నేపథ్యం లేని చిన్న కాలేజీలు మాత్రం బకాయిల కోసం ఏళ్ల తరబడి వేచిచూడాల్సి వస్తోంది. బిల్లుల చెల్లింపుల కోసం అధికారుల చుట్టూ ఎంత తిరిగినా ఫలితం ఉండడం లేదు. ఫీజులు రాకపోవడంతో వాటి మనుగడ కష్టమవుతోంది.

పరీక్షల కేంద్రాల మార్పు

సెప్టెంబరు 15 నుంచి ప్రైవేట్ కళాశాలలు బంద్ కానున్న నేపథ్యంలో కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు ప్రైవేట్ కళాశాలల్లో నిర్వహిస్తున్న పరీక్షల కేంద్రాలను మార్చుతూ నిర్ణయం తీసుకున్నారు. 15న మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హంటర్‌రోడ్డులోని అల్లూరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ కళాశాలలో జరగాల్సిన ఎల్ఎల్‌బీ 5ఏళ్ల 6వ సెమిస్టర్ పరీక్షను సుబేదారిలోని యూనివర్సిటీ మహిళా కళాశాలకు మారుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే సెప్టెంబరు 15, 17, 19వ తేదీల్లో జరగాల్సిన ఫార్మాడీ మొదటి ఏడాది పరీక్షల కేంద్రాలను ప్రైవేట్ కళాశాలల నుంచి మార్చినట్లు ప్రకటించారు. విద్యార్థులు తమ పరీక్షల కేంద్రాన్ని వర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని కోరారు.

ఇల్లందలో మరో అహోబిలం

- ఒకే ప్రాంగణంలో శైవ-వైష్ణవ దేవాయాలు
- 18వ శతాబ్దంలో నిర్మించిన రాతి కట్టడాలు
- ఒకేచోట 4 శివలింగాలు, 2 నందులు
- శిథిలావస్థలో కట్టడాలు
- పట్టించుకోని ప్రభుత్వం


ఇల్లందలో ఒకే ప్రాంగణంలో ఉన్న శివ-విష్ణు దేవాలయాలు

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్రం అహోబిలంలో నవ నరసింహ క్షేత్రాల మాదిరిగా వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లందలో ఉంది. పూర్వకాలంలో వేద పండితులు ఇల్లంద ఆలయాన్ని ఆధారంగా చేసుకుని జఫర్‌గడ్, కక్కిరాలపల్లి చుట్టు పక్కల ప్రాంతాల్లో తొమ్మిది లక్ష్మీనర్సింహస్వామి ఆలయాలను నిర్మించారు. ఇల్లందలో రాతితో ఏర్పాటు చేసిన ఈ ఆలయాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి. 425 ఏళ్లకు పైగా చెక్కు చెదరకుండా దర్శనమిస్తోంది.


ఆలయంలోని రాతి స్తంభాలు

కాకతీయుల కాలం నాటి కట్టడాలు

మరో అహోబిలాన్ని తలపించేలా శివ-విష్ణు రూపస్ఫుట దేవాలయం (హరిహరులు ఒకే ప్రాంగణంలో ఉండడం) 18వ శతాబ్దంలో రామలింగేశ్వరస్వామి- లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయాలను ఒకేచోట వేర్వేరుగా నిర్మించారు. కాకతీయుల కాలంలో ఈ ఆలయాలకు అంకురార్పణ జరిగినట్లు వేద పండితులు, పూర్వీకులు చెబుతున్నారు. దానికి గుర్తుగా ఆలయానికి నాలుగు వైపులా బురుజులు కనిపిస్తాయి. కుడి వైపున ఉన్న లక్ష్మీనర్సింహస్వామి, ఎడమ వైపున రామలింగేశ్వర స్వామి ఆలయాలు ఉండడం విశేషం. విష్ణుమూర్తి కుడివైపునా ఉండి, శివుడు ఎడమ వైపున కనిపించడం అరుదు.

ఇలాంటి ఆలయం ప్రభుత్వ ఆదరణకు నోచుకోవడం లేదు.

ఆలయాల ప్రాముఖ్యత

దేవాలయాల నిర్మాణంలో ఎక్కడా సిమెంటు, మట్టి, ఇటుకలు లేకుండా రాతితో నిర్మించారు. వరంగల్ కోట తరహాలో దేవాలయంలోని గర్భాలయాలు, ముఖ మండపాలు, అర్థ మండపాలు సుందరంగా తయారు చేసిన స్తంభాలు కనిపిస్తాయి. దేవాలయాలపై కప్పులు కూడా పూర్తిగా శిలలతో అపురూపంగా తయారు చేసిన రాతి నగిషీలు కనువిందు చేస్తాయి. కాకతీయుల కాలంలో ఆలయాలను నిర్మించినట్లు ఆలయం చుట్టూ నాలుగు బురుజుల ఆనవాళ్లు ఇప్పటికీ కనిపిస్తాయి. అవి శిథిలావస్థకు చేరి పిచ్చి మొక్కలు పెరిగాయి.

జీర్ణావస్థలో శైవ-వైష్ణవ ఆలయాలు

ఈ ఆలయాలను ప్రభుత్వాలు, పాలకులు పట్టించుకోవడం లేదు. దీంతో చాలా సంవత్సరాలుగా ఆలయాలు జీర్ణావస్థకు చేరుకున్నాయి. ఉభయ దేవాలయాలపై నిర్మించిన గోపురాలు కూలిపోయే స్థితికి చేరుకున్నాయి. గర్భాలయాల పై ఇటుకతో నిర్మించిన గోపురాలపై చెట్లు మొలుస్తున్నాయి. వర్షాకాలంలో గోపురాలపై నుంచి గర్భాలయంలోకి నీరు కారుతూ పూజా కార్యక్రమాలకు ఇబ్బందిగా మారింది. భారీ వర్షాలు కురిస్తే ఎప్పుడు కూలుతాయోనని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేవాలయ ప్రాంగణం కంటే గర్భాలయాలు, ముఖ మండపం రెండు అడుగుల లోతులోకి వెళ్లిపోయాయి. దీంతో వర్షపు నీరు దేవాలయంలోకి చేరడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దేవాలయానికి చుట్టూ ఉన్న ప్రాకారం కూడా రాతితో ఏర్పాటు చేశారు. సుమారు పది అడుగుల వెడల్పు, పది ఫీట్ల ఎత్తుతో నిర్మించిన ప్రహరీ రాళ్లు చెదిరి పడిపోతున్నాయి. చారిత్రక కట్టడాలను కాపాడి భావితరాలకు అందించాల్సిన ప్రభుత్వాలు, పాలకులు పట్టించుకోవడం లేదు. ఈ ఆలయంపై ఇప్పటికైనా శ్రద్ధ వహించి భక్తులు కోరుతున్నారు.

చతుర్లింగేశ్వర దేవాలయం

ఈ ఆలయం చతుర్లింగేశ్వర దేవాలయంగా ప్రసిద్ధి. గర్భాలయంలో కుష్మాండ లింగం, అర్థ మండపంలో సోర లింగం, ముఖ మండపంలో బ్రహ్మసూత్ర లింగాలు కనిపిస్తాయి. అలాగే గర్భాలయానికి ఎదురుగా రెండు నందులు కూడా ఉండడం విశేషం.

ప్రతీ ఏటా ఉత్సవాలు

మాఘ మాసంలో పౌర్ణమి సందర్భంగా ఐదు రోజుల పాటు లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ ఉత్సవాలు నిర్వహిస్తారు. అదే మాసంలో ఆరుద్ర నక్షత్రంలో శివ కల్యాణం మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తారు. ఈ కల్యాణం సందర్భంగా ఇతర నగరాలు, ప్రాంతాలకు వెళ్లిన వేద పండితుల కుటుంబాలు సైతం తప్పనిసరిగా హాజరవడం సంప్రదాయంగా వస్తోంది. దీనికి తోడు హనుమాన్ జయంతి, వినాయక చవితి, దేవి నవరాత్రోత్సవాలు ఇందులోనే నిర్వహిస్తారు.


శిథిలావస్థలో ఉన్న ఆలయ గోపురం


విజేత ఆదిలాబాద్ బాలుర జట్టుకు షీల్డులను అందిస్తున్న అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు

బాల్ బ్యాడ్మింటన్ సందడి

- విజేతలుగా ఆదిలాబాద్ (బాలుర), మెదక్ (బాలికల) జట్లు
- బాల్ బ్యాడ్మింటన్ అభివృద్ధికి కృషి చేస్తామన్న నిర్వాహకులు
- జనగామ జిల్లా కూనూరులో ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు

జఫర్‌గడ్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు ఆదివారం అట్టహాసంగా ముగిశాయి. జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలంలోని కూనూరు జడ్పీ హైస్కూల్ ఆవరణలో రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు తెలంగాణ రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ (టీబీబీఏ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు ఉమ్మడి జిల్లాల వారీగా సబ్ జూనియర్ బాలురు, బాలికల పోటీలు ఉత్సాహంగా సాగాయి. అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గాదెపాక అయోధ్య అధ్యక్షతన ఆదివారం జరిగిన క్రీడల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యుడు బి.జయకర్, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి వివి.రమణ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాలకు చెందిన బాలబాలికలు ఈ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటారన్నారు. బాల్ బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి అసోసియేషన్ కృషి చేస్తోందన్నారు. ప్రతీ ఏటా పోటీలను నిర్వహిస్తూ క్రీడా నైపుణ్యాలను వెలికితీస్తోందన్నారు. రాష్ట్రస్థాయి పోటీల విజయవంతానికి సహకరించిన అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు, దాతలు, క్రీడాభిమానులు, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

విజేతలకు బహుమతులు

కూనూరులో శని, ఆదివారాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఉమ్మడి జిల్లాలకు చెందిన బాలురు, బాలికలు 10 జట్ల చొప్పున మొత్తం 20 జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో మొదటి స్థానం ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు సాధించగా నల్లగొండ (రెండు), కరీంనగర్ (మూడు), నిజామాబాద్ (నాలుగు) స్థానాలు సాధించాయి. బాలికల విభాగంలో మొదటి స్థానం మెదక్ జట్టు, ఖమ్మం (రెండు), వరంగల్ (మూడు), ఆదిలాబాద్ (నాలుగు) స్థానాలు సాధించాయి. విజేతలకు ముఖ్య అతిథులు, అసోసియేషన్ ప్రతినిధులు బహుమతులు అందజేశారు. ప్రతిభ చాటిన, క్రీడల నిర్వహణలో సహకరించిన ప్రతినిధులు, పీఈటీలను ఈ సందర్భంగా నిర్వాహకులు సన్మానించి మెమెంటోలు అందించారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర, వివిధ జిల్లాల ప్రతినిధులు నారాయణ రెడ్డి, వీరభద్రరావు, రవీంద్రకుమార్, వీరయ్య, కమల్‌కుమార్, తిరుపతి, శ్యాం, శ్రీనివాస్ రెడ్డి, బయ్యన్న, వి.రమణ, కృష్ణమూర్తి, సాంబయ్య, ఇల్లందుల కుమార్, సిహెచ్.శ్రీనివాస్, వాసుదేవరావు, కాటం లక్ష్మారెడ్డి, నీరటి ప్రభాకర్, కాటం రాజిరెడ్డి, పీడీ సాయికుమార్, అజయ్‌కుమార్, పెద్దిరెడ్డి, చందర్ పాల్గొన్నారు.


కూకటి వేళ్లతో కూలిపోయిన శివాల మర్రి

2017లోనే హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి'

దీనిపై ఎండోమెంట్ శాఖ దృష్టి సారించకపోతే రానున్న రోజుల్లో భక్తులు ఇబ్బందులకు గురయ్యే అస్కారం ఉందని 'ఆంధ్రజ్యోతి' 2017లోనే హెచ్చరించింది. ప్రైవేటు స్థలం.. తామేమీ చేసేది అన్నట్లుగా శాఖ వదిలేసింది.

కూలిపోయిన పూనకాల 'శివాల మర్రి'

ఐనవోలు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వెయ్యేళ్ల విశ్వాసం.. శివసత్తులకు కొలువైన దైవం.. నిలువెళ్ల భక్తిభావాన్ని నింపే ఐనవోలు మల్లన్న స్వామి శివాల మర్రి ఆదివారం సాయంత్రం కూకటి వేళ్లతో కూలిపోయింది. ఈ శివాల మర్రి మహావృక్షానికి ఎంతో మహిమ ఉందని ఇక్కడికి వచ్చే భక్తుల నమ్మకం. యేటా బండారి తిలకంతో లక్షలాది మంది భక్తులకు పూనకాలిస్తుంది.

వెళ్లి బోనం వండి నైవేద్యం సమర్పించి పట్నాలు వేసి మొక్కులు చెల్లిస్తారు.

ఉత్తరం వైపు వృక్షం

మల్లికార్జునస్వామి ఆలయం ఉత్తరం వైపు వెయ్యేళ్ల పైనుంచే శివాల మర్రి కొలువైంది. అప్పటినుంచి మర్రిచెంతనే పూనకాలు మొదలవుతున్నాయని చరిత్ర. ఏటా సంక్రాంతి నుంచి ఉగాది వరకు జరిగే జాతరకు వచ్చే భక్తులు శివాలమర్రిని దర్శించుకున్నాకే ఆలయానికి వెళ్తారు. వాహనాల సౌకర్యం లేనిరోజుల్లో భక్తులు ఎడ్లబండ్లపైనే ఐనవోలుకు వచ్చి శివాల మర్రి వద్దకు వెళ్లి ప్రదిక్షణలు చేసేవారు. ఊడలు దిగి విశాలంగా ఉన్న చెట్టు స్థలం 1954లో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడం, ఎండోమెంట్ శాఖ పట్టించుకోని కారణంగా చుట్టూ నిర్మాణాలు జరిగాయి. అప్పటి నుంచి భక్తులు కాలినడకన వెళ్లి దర్శించుకుంటున్నారు.

స్వామివారిని దర్శించుకోవాలంటే ముందుగా ఈ మహావృక్షం వద్దకు వెళ్లి పూజాతంతును పూర్తిచేశాకే ఆలయానికి పూనకాలతో వెళ్తారు. అలాంటి శివాల మర్రి కూలిపోవడం మల్లన్న భక్తులను ఆందోళన గురిచేస్తోంది.

ఇక్కడే పూనకాలు మొదలు

రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భక్తులు డోళ్లు, ఢమరుకాలు, బండారిని తీసుకుని సమూహంగా మర్రి వద్దకు చేరుకుంటారు. పూసలు తొడిగిన అంగీలు, గజ్జెల లాగులు ధరించి చేతిలో వీరకోలు పట్టుకుంటారు. నుదుట బండారి పసుపు బొట్టు పెట్టాక.. వారిలో స్వామి వారు ఆవహిస్తారని విశ్వాసం. మూడుసార్లు మర్రి చుట్టూ తిరిగాక డోలు, ఢమురుక శబ్దాల నడుమ పూనకంతో శివమెత్తి తన్మయంతో శివనాట్యం చేస్తూ ఆలయ ప్రదక్షిణకు బయలుదేరుతారు. మూడుసార్లు తిరిగాక స్వామి వారిని దర్శించుకుంటారు. అక్కడి నుంచి విడిది చేసిన చోటికి


ఐనవోలు ఆలయ సమీపంలో శివాల మర్రి (ఫైల్)

రీ ప్లాంటేషన్ చేయాలి

ఎంతో చరిత్ర కలిగిన శివాల మర్రిని రీ ప్లాంటేషన్ ద్వారా మళ్లీ నిలబెట్టే అవకాశాలను పరిశీలించాలని భక్తులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఎండోమెంట్ శాఖ ఈ వృక్షాన్ని నిలబెట్టాలని కోరారు. ఈ విషయంపై ఈవో సుధాకర్‌ను వివరణ కోరగా.. వృక్షాన్ని మళ్లీ నిలబెట్టే అవకాశంపై పరిశీలిస్తామని, ఆ స్థలం వారు సహకరిస్తే తప్పకుండా నిలబెట్టే ప్రయత్నం చేస్తామని తెలిపారు.

ప్రాణాలర్పించినా పట్టించుకోరా ?

- రజాకార్లతో పోరాడిన తిమ్మంపేట
- తిరుగుబాటు గ్రామాన్ని గుర్తించాలని కోరుతున్న స్థానికులు
- గుర్తులుగా మిగిలిన బురుజు, చావడీ

దుగ్గొండి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా గ్రామస్థుల తిరుగుబాటు కోసం ఏర్పాటు చేసుకున్న బురుజు, రజాకారుల నివాసం కోసం ఏర్పాటు చేసుకున్న చావడీలు వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని తిమ్మంపేటలో చిహ్నాలుగా మిగిలాయి. రజాకారుల సైన్యం స్థానిక పోలీసు పటేల్, వారి అడుగుజాడల్లో ఉన్న భూస్వాములతో కలిసి గ్రామంలోకి చొరబడి గ్రామస్థులను చిత్రహింసలు పెట్టేవారు. అధిక పన్నులు వసూలు చేయడం, పన్ను చెల్లించనివారిని దండించడం, రోజురోజుకు వారి ఆగడాలు పెరగడంతో గ్రామస్థులు వారిపై తిరుగుబాటు చేశారు. సైన్యం చేతిలో కొంత మంది చనిపోయారు. ప్రధానంగా ఆత్మకూరు దేశాయి దొర ఆధ్వర్యంలో భూస్వాములు ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. రక్షణ కోసం గ్రామస్థులు బురుజు నిర్మించి కాపలా కాసేవారు.

ప్రాణాలు కోల్పోయిన గ్రామస్థులు

1945లో రజాకారులను గ్రామానికి చెందిన కొంత మంది ప్రతిఘటించారు. వారిలో గొల్ల (తోటకూరి) బక్కయ్య, గొల్ల కనకయ్య, కత్తి సాంబయ్య, బాషబోయిన నర్సయ్యను రజాకారులు పట్టుకొని పాకాల అడవుల్లో కాల్చి చంపారు. వారి ప్రధాన అనుచరులుగా పని చేసిన భూపతి రాజలింగం, జనార్దన్, గడ్డం లక్ష్మీనర్సయ్య, కోమటి భద్రయ్యను చిత్రహింసలకు గురి చేశారు. గ్రామంలోని నాగెల్లి ముత్తయ్య, బండి మల్లయ్య, ఒద్దుల బుచ్చిరామయ్య, కుమ్మరికుంట్ల బొందయ్య, కూచన నర్సింహరాములు, గిన్నె మల్లయ్య రజాకారులు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడారు. గ్రామంలో కుమ్మరికుంట్ల బొందయ్య నాయకత్వంలో అమరవీరుల స్థూపం ఏర్పాటు చేయడంతో పాటు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. బొందయ్య సీతారామయ్య అనే పేరుతో తుపాకి పట్టి రజాకారులు, భూస్వాములు, దొరలకు వ్యతిరేకంగా గుర్రంపై తిరుగుతూ వారిని ఎదిరించారు. భూస్వామ్యుల భూములను బొందయ్య పేదలకు పంచాడు. కానీ ప్రభుత్వ పరంగా ఎలాంటి సహాయం అందకుండానే మృతి చెందాడు. వారి కుటుంబం సైతం ఎలాంటి లబ్ధి పొందలేదు.


తిమ్మంపేటలో ఉన్న బురుజు

గ్రామ రక్షణగా బురుజు

అప్పట్లో నిఘా కోసం 80 అడుగుల బురుజును గ్రామం మధ్యలో ఏర్పాటు చేసుకున్నారు. బురుజుపై గ్రామంలో వంతుల ప్రకారం కాపలాగా ఉండేవారు. ఆ బురుజు ఇప్పుడు శిథిలావస్థలో ఉంది. ప్రస్తుతం 33 అడుగుల వరకు ఉండి చిహ్నంగా మిగిలిపోయింది. ప్రతి ఏడాది ఇక్కడ వద్ద దసరా ఉత్సవాలు నిర్వహిస్తారు.

గ్రామంలో చావడీ

నిజాం రజాకారుల సైన్యం, పోలీస్ పటేల్, దొరలు, భూస్వాముల నివాసం కోసం గ్రామంలో చావడీని నిర్మించారు. ఇక్కడి నుంచే వారి కార్యకలాపాలు కొనసాగించేవారు. చావడీ నేటి వరకు గుర్తింపు చిహ్నంగా ఉండిపోయింది. ప్రస్తుతం చావడీలో ప్రతి ఏడాది ముస్లింలు పీరీలను ఏర్పాటు చేసి మొహర్రం ఉత్సవాలు జరుపుకుంటారు.


పోలీస్ పటేల్, దొరల నివాసం కోసం ఏర్పాటు చేసిన చావడీ

గ్రామానికి గుర్తింపు కల్పించాలి..



నాగెల్లి కొంరయ్య, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు

తిరుగుబాటు చేసిన గ్రామస్థులను రజాకారుల సైన్యం పాకాల అడవుల్లో కాల్చి చంపారు. గ్రామ రక్షణగా బురుజు నిర్మాణం చేసుకొని సైన్యం రాకను పసిగట్టి తిరుగుబాటు చేశారు. గ్రామంలో నెలకొల్పిన అమరవీరుల స్థూపం సైతం రోడ్డు వెడల్పులో లేకుండా పోయింది. ప్రతీ ఏడాది 17న విమోచన దినంగా అమరవీరులకు నివాళులర్పించాలి. ప్రభుత్వం గుర్తింపు కల్పించాలి.

అమరవీరుల స్థూపం నిర్మించాలి



తోటకూరి రాజు, తిమ్మంపేట

తెలంగాణ సాయుధ పోరాట యోధుల స్థూపం గ్రామంలో నిర్మించాలి. బురుజు, చావడీలు మరమ్మతులు చేయాలి. దాని చుట్టూ కంచె నిర్మాణం చేసి నేటి తరానికి అందించాలి.

కేయూలో విద్యార్థుల ఆందోళన

ఎంబీఏ విద్యార్థిపై దాడి చేసిన వారిని శిక్షించాలని డిమాండ్


కేయూలో నిరసన చేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులు నిరసన ఆందోళన, ఉద్రిక్తతకు దారితీసింది. శనివారం రాత్రి వర్సిటీ గెస్ట్ హౌస్ సమీపం లో దివ్యాంగుడైన ఎంబీఏ విద్యార్థిని ఓ విద్యార్థి సం ఘానికి చెందిన నాన్‌బోర్డరైన ఇద్దరు విద్యార్థి నాయకులు అడ్డుకుని దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారని విద్యార్థులు ఆందోళనకు దిగారు. దీంతో వర్సిటీ క్యాంపస్‌లో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. శనివారం జరిగిన గొడవను దృష్టిలో ఉంచుకుని ఆదివారం మధ్యాహ్నం వర్సిటీ కామన్ మెస్ వద్ద మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో మళ్లీ విద్యార్థుల మధ్య మాటా మాట పెరిగి గొడవకు దిగారు. ఎంబీఏ విద్యార్థిని దుర్భాషలాడుతూ దాడికి పాల్పడమే కాకుండా ఆదివారం మళ్లీ బెదిరింపులకు దిగడంతో ఎంబీఏ విద్యార్థులు కేయూ క్యాంపస్‌లోని మొదటి గేటు వద్ద బైఠాయించారు. దాడులకు పాల్పడిన సదరు విద్యార్థి సంఘం నేతలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో హనుమకొండ, సుబేదారి సీఐల నేతృత్వంలో ముగ్గురు ఎస్సైలు, పోలీసులు క్యాంపస్‌కు చేరుకున్నారు. అలాగే వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌లు ఆందోళనలకు దిగిన విద్యార్థులను సముదాయించేందుకు ప్రయత్నించారు. ఆదివారం అర్ధరాత్రి వరకు ఎంబీఏ విద్యార్థుల ఆందోళన వర్సిటీ క్యాంపస్‌లో కొనసాగింది. న్యాయం చేయాలని విద్యార్థుల నినాదాలతో క్యాంపస్ హోరెత్తింది. దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని విద్యార్థులు నిరసన సాగించారు.

చేప పిల్లల పంపిణీ జరిగేనా ?

- సరఫరాకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- గత బిల్లులు చెల్లించకపోవడమే కారణం



బాలసముద్రం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం కోసం అమలు చేస్తున్న ఉచిత చేపపిల్లల సరఫరా పథకం నిర్వహణలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. చేప పిల్లలను సరఫరా చేసేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. గత ఆగస్టు చివరి వారంలో ప్రభుత్వం టెండర్ల దాఖలుకు చివరి రోజైన సెప్టెంబరు 1 నాటికి రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 24 జిల్లాలు మాత్రమే టెం డర్లు పడ్డాయి. ఇందులో 16 జిల్లాలకు మాత్రమే రెండు కంటే ఎక్కువ టెండర్లు దాఖలయ్యాయి. 8 జిల్లాలకు అసలే టెండర్లు పడలేదు. దీనితో ప్రభుత్వం టెండర్లు వేసేందుకు ఈనెల 8 వరకు గడువును పొడిగించింది. అయినా కాంట్రాక్టర్ల నుంచి సరైన స్పందనరాకపోవడంతో ఈ నెల 12 వరకు గడువును పొడిగించారు. టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడానికి కారణం గత రెండు సంవత్సరాలుగా చేప పిల్లలను సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడమే కారణంగా తెలుస్తోంది. 2023-24 సంవత్సరంలో చేప పిల్లలను సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 74 కోట్లు చెల్లించకుండా బకాయి పెట్టింది. అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత సంవత్సరం జూలై 12న టెండర్లను ఆహ్వానించింది.

బకాయి పడిన బిల్లులు చెల్లించకుండా టెండర్లు ఎలా వేస్తామని మత్స్య శాఖ డైరెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రీ బిడ్ సమావేశంలో కాంట్రాక్టర్లు ప్రశ్నించారు. పాత బిల్లులు త్వరలో ఇప్పిస్తామని టెండర్లలో పాల్గొనాల్సిందిగా అధికారులు కోరారు. రెండు పర్యాయాలు టెండర్లు పిలిచినా ఎవరు టెండర్‌లో పాల్గొనలేదు. టెండర్లు నిర్వహించకుంటే పేద మత్స్యకారుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకం రద్దవుతుందని అధికారులు కాంట్రాక్టర్లకు నచ్చజెప్పి ఆగస్టులో మూడోసారి టెండర్లు పిలిచారు. రాష్ట్రానికి చెందిన 30 మంది కాంట్రాక్టర్లు టెండర్‌లో పాల్గొన్నారు. ప్రభుత్వం చేప పిల్లల కొనుగోలుకు రూ. 19. 26 కోట్లు మాత్రమే నిధులు కేటాయించిందని వాటితో రూ.80 కోట్ల చేప పిల్లలను సరఫరా చేసేందుకు ఎలా సాధ్యమవుతుందని కాంట్రాక్టర్లు ప్రశ్నించారు.

అధికారులు అందులో సగం 40 లక్షల చేప పిల్లల సరఫరాకు మాత్రమే టెండర్లు పిలవాలని జిల్లాల మత్స్యశాఖ అధికారులకు సర్క్యులర్ జారీ చేశారు. అంత వరకు మాత్రమే చేప పిల్లల సరఫరా జరిగింది. మళ్లీ 2025-26 సంవత్సరానికి రొయ్యలతో పాటు ఈ పథకం అమలుకు ప్రభుత్వం రూ. 122 కోట్ల 23 లక్షలు కేటాయించిందని, కానీ ఇంత వరకు బడ్జెట్ రిలీజ్ కాలేదని కాంట్రాక్టర్లు టెండర్ వేసేందుకు ఎవరు ముందుకు రావడం లేదు. ఎలాగైనా టెండర్లు నిర్వహించి పథకాన్ని కొనసాగించాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆంధ్ర ప్రాంతానికి చెందిన కాంట్రాక్టర్లు టెండర్లు వేయాలని కోరుతున్నట్లు తెలుస్తోంది.

వెయిట్ లిఫ్టింగ్‌లో గోల్డ్‌మెడల్

- ఖమ్మంలో జరిగిన 60 కేజీల విభాగంలో పతకం
- జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి హరిత
- ఆనందంలో స్వగ్రామం జనగామ జిల్లా ఇప్పగూడెం


గోల్డ్ మెడల్‌తో వారాల హరిత

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలం లోని ఇప్పగూడెంకు చెందిన వారాల హరిత ఆదివారం రాత్రి ఖమ్మంలో జరిగిన రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ 60కేజీల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన వారాల రాజు-రమ్య దంపతుల చిన్న కుమార్తె హరిత, నాల్గవ తరగతిలో హైదరాబాద్ హాకీం పేట స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపి కైంది. ప్రస్తుతం స్కూల్‌లో పదోతరగతి చదువుతోంది. వెయిట్ లిఫ్టింగ్‌లో తర్ఫీదు పొందిన హరిత జాతీయ స్థాయిలో రాణించడం విశేషం. జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక కావడానికి క్రీడా కారులు రెండు స్టేట్‌మీట్‌లలో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధిం చాల్సి ఉంటుంది. అందులో భాగంగా హరిత సెప్టెంబర్ 7న హైదరాబాద్ లాలాపేట్ ఇండోర్ స్టేడియంలో జరిగిన స్టేట్ మీట్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. ఈరోజు (14 సెప్టెంబర్)న ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగిన స్టేట్ మీట్‌లో హరిత గోల్డ్‌మెడల్ సాధించింది. ఈనెల 22న కర్ణాటక రాజధాని బెంగుళూరులో జరిగే జాతీయస్థాయి పోటీలో పాల్గొననుంది. హరిత ఎంపికపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

60వ డివిజన్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా శ్వేతా గౌడ్

వడ్డెపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లి ప్రాంతానికి చెందిన గన్నెబోయిన శ్వేతాగౌడ్ 60వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ఆదేశం మేరకు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్ ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్ సూచన మేరకు డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని శ్వేతా గౌడ్ పేర్కొన్నారు.


శ్వేతా గౌడ్ →

గాంధీ సిద్ధాంతాలు సదా ఆచరణీయం

» పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
» లక్ష గాంధీ విగ్రహాల ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ

హనుమకొండ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మహాత్ముడు చూపిన శాంతి, అహింస, స్వదేశీ మార్గాలు సమాజానికి ఎంతో అవసరమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మహాత్మా గాంధీ జీవితం, సిద్ధాంతాలు. మార్గదర్శనాన్ని ప్రస్తుతతరానికి పరిచయం చేసేందుకు చేపట్టిన లక్ష గాంధీ విగ్రహాల ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను రాజేందర్‌రెడ్డి ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గాంధీ సిద్ధాంతాలను యువతకు చేరవేయడానికి ఇంటి కార్యక్రమాలు బహుళంగా నిర్వహించాలని అన్నారు. లక్ష గాంధీజీ విగ్రహాల ప్రదర్శన అనేది ఒక సాంస్కృతిక, సమాజ మార్పు కాంక్షతో కూడిన విప్లవాత్మక ఆలోచన అన్నారు. గ్లోబల్ గాంధీ ఫెడరేషన్ నుండి వచ్చిన నిర్వాహకులు వచ్చే నెల 10 నుంచి 14వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో జరగబోయే మహాత్మాగాంధీ జాతీయ సుస్థిర విజ్ఞాన సదస్సు స్వదేశీ మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొనాల్సిందిగా ఎమ్మెల్యేను ఆహ్వానించారు.

ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కోఆర్డినేటర్ డాక్టర్ పులి అనిల్, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాసి సాయిచంద్, యూత్ విభాగం ఉపాధ్యక్షుడు సంతోష్ రెడ్డి, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు సాగర్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఫెడరేషన్ ఛైర్మన్ రాజేందర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి, యూత్ పెసిడెంట్ సంజయ్ రెడ్డి, నాయకులు రాజ్‌కుమార్, ప్రశాంత్, సతీష్, అరుణ్, సంతోష్, దొరబాబు, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నంది హిల్స్ సభ్యులు

నంది హిల్స్ కాలనీని అభివృద్ధి చేయాలి

న్యూశాయంపేట (ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్ రోడ్డులోని నందిహిల్స్ కాలనీలో అంతర్గత రోడ్లు, సీసీ రోడ్లు, వివిధ సమస్యలు పరిష్కరించాలని నందిహిల్స్ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. నందిహిల్స్‌లోని రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, అక్కడ సీసీ రోడ్లు వేయాలని కోరారు. అలాగే కాలనీలోని శ్రీ పంచముఖ అంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని, పక్కకు జరిపించాలని ఎమ్మెల్యేకు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే నాయిని త్వరలోనే నందిహిల్స్ కాలనీలో పర్యటించి, సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నందిహిల్స్ ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి దుర్గారావు, తొగరు జగన్మోహన్ రెడ్డి, రావుల శ్రీధర్, గొంది జగన్మోహన్ రెడ్డి, పసునూటి సురేష్ కుమార్, సంకు యాకూబ్‌రెడ్డి, నడిపెల్లి నర్సింహారావు, పి.కిషన్ రావు, పిన్నింటి కిషన్‌రావు, వన్నాల బాస్కర్, జలగం కిషన్ రావు, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నవరాత్రి ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

హనుమకొండ కల్చరల్ (ఆంధ్రజ్యోతి): చారిత్రక రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరిగే నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను ఆదివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నవరాత్రి ఉత్సవాలను ఎలాంటి అడ్డంకులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. దసరా ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పురావస్తు శాఖ సీఏ అజిత్, ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, కాంగ్రెస్ నాయకులు బత్తిని శ్రీనివాస్, శ్రీనివాసచారి, తోట పవన్, ఆలయ ఈవో అనిల్‌కుమార్, ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి, సీఐ శివకుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


వారాల కుల సంఘం కమిటీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వారాల కులాన్ని ఓబీసీ జాబితాలో చేర్చాలి

హసన్‌పర్తి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వారాల కులానికి ఓబీసీలో అవకాశం కల్పించేందుకు కృషి చేస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. ఆదివారం కాంగ్రెస్ 66వ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్ ఆధ్వర్యంలో హసన్‌పర్తి వారాల కుల సంఘం నూతన కమిటీ ఎమ్మెల్యే నాగరాజును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన కమిటీకి శాలువా కప్పి స్వాగతం పలికి అభినందించారు. వారాల కులానికి రాష్ట్ర కుల జాబితాలో బీసీ (డీ) క్రమ సంఖ్య (43) ఉందని ఓబీసీ జాబితాలో కూడా అవకాశం కల్పించాలని కుల సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాకుండా కుల సంఘ భవనంలో తాగునీరు, ఇతర అవసరాల కోసం ఒక బోర్ వేయాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. వారాల కులానికి ఓబీసీ జాబితాలో అవకాశం కల్పించే విధంగా సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కుల సంఘ భవనంలో బోరు వేసేందుకు నిధులు మంజూరి చేయించి త్వరలోనే పని పూర్తి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కలిసిన వారిలో కుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాపిశెట్టి రాజు, గుండమీది కృష్ణమోహన్, సంయుక్త కార్యదర్శులు పాపిశెట్టి ప్రవీణ్, కార్యవర్గ సభ్యులు ముక్త మహేష్, గౌరిశెట్టి సురేందర్, పావుశెట్టి అభిలాష్, దాసరి బాలరాజు, నన్నెంశెట్టి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

హనుమకొండ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ఆర్‌డీ కోఆపరేటివ్ జూనియర్ కళాశాలలో చదివిన 1999-2002 బ్యాచ్ సీఈసీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. విద్యార్థులంతా ఒక్క చోట చేరి తాము కళాశాలలో చదువుకున్న రోజుల నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గురువులను సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ మిత్రులలో ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా అందరూ ఆదకోవడానికి ముందుండాలని అన్నారు. ప్రస్తుత విద్యార్థులకు మార్గదర్శకంగా నిలిచి భవిష్యత్తు లో తమ సహకారం అందిస్తామని సంకల్పం తీసుకున్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

మడికొండ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని పద్మశాలి భవనంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు బిల్ల రవిందర్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ధీర అధ్యక్షురాలు శ్రీవాణి, విజయకుమారి సౌజన్యంతో ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈసందర్భంగా కంటి, బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కళ్ళజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుస్మిత కంటి దవాఖాన సిబ్బంది టి. అఖిల్, సంఘం నాయకులు కామని మల్లేష్, వంగ రమేష్, నల్ల సురేష్, పోతరాజు ప్రకాష్, కేటిక సదానందం, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

» చెలిమి సాహిత్య, సాంస్కృతిక వేదిక కన్వీనర్ ఎం. రవీందర్
» వడ్డెపల్లిలో తంగెళ్ల శృతి యాది సభ


శృతి యాది సభలో మాట్లాడుతున్న మెట్టు రవీందర్

వడ్డెపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను నిలిపేసి మావోయిస్టులతో బేషరతుగా శాంతి చర్చలు జరుపాలని చెలిమి సాహిత్య, సాంస్కృతిక వేదిక కన్వీనర్, తెలుగు సాహిత్య విమర్శకులు మెట్టు రవీందర్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ వడ్డెపల్లిలో తంగెళ్ల శృతి యాది సభ ఆమె తండ్రి తంగెళ్ల సుదర్శనం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్టు రవీందర్ మాట్లాడుతూ.. యువత సాయుధ పోరాటాన్ని ఎందుకు ఎంచుకుంటుందో ప్రభుత్వం ఆలోచించాలని అన్నారు. సమాజంలోని అసమానతలు, అవినీతిని నిర్మూలించకుండా ఉద్యమకారులను హతమార్చడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలపై జరుపుతున్న అమానుష మారణకాండను పౌర సమాజం వ్యతిరేకించాలని కోరారు. తెలంగాణ ఏర్పడిన తొలి ఏడాదిలోనే తంగెళ్ల శృతి, సాగర్‌లను తెలంగాణ ప్రభుత్వం భూటకపు ఎన్‌కౌంటర్లలో హత్య చేసిందని ఆరోపించారు. ఈ యాది సభలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, చిలువేరు అశోక్, డాక్టర్ ఎం.గంగాధర్, శాంతి చర్చల ప్రతినిధి వేకువ దుర్గాప్రసాద్, కవులు ఆదిరెడ్డి, శాఖమూరి రవి, అమరుల బంధు మిత్రుల సంఘం జిల్లా నాయకులు భారతక్క, ఊర్మిళ, టీపీఎఫ్ నేతలు బి. రమాదేవి, పార్వతి, వివేక్, యోగానంద్, మాధవి, రాకేష్, శృతి తల్లి రమాదేవి, తంగెళ్ల కుమారస్వామి, గోవర్ధన్‌తో పాటు బంధుమిత్రులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

» పీఆర్సీని వెంటనే అమలు చేయాలి
» డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.లింగారెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.లింగారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన లింగారెడ్డి మాట్లాడారు. పీఆర్సీ గడువు పూర్తయ్యి రెండేళ్లు దాటుతున్నా.. పీఆర్సీని అమలు చేయాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేకపోవడం బాధాకరమన్నారు. డీఏలు పెండింగ్‌లోనే ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఉప్పలయ్య, కె.శ్రీనివాస్, అధ్యాపక జ్వాల ప్రధాన సంపాదకులు డాక్టర్ ఎం.గంగాధర్, కమిటీ సభ్యులు బి.అంజనీదేవి, ఎస్.సుమ, డాక్టర్ కిషన్, ఎ.మల్లయ్య, డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లింగారెడ్డి


హాకథాన్‌లో పాల్గొన్న నిర్వాహకులు

సృజనాత్మకతతో ఉన్నత అవకాశాలు

హసన్‌పర్తి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సృజనాత్మకతతోనే ఉన్నత అవకాశాలు సాధ్యమని ఎస్సార్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ మహేష్ ఉట్కూరు అన్నారు. మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయంలో 24 గంటల పాటు స్మార్ట్ ఇండియా (ఎస్ఐహెచ్)-2025 అంతర్గత హాక్‌థాన్ రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి ఆదివారం ఉదయం 9 గంటల వరకు 24 గంటల పాటు నిర్వహించిన హకథాన్ ఘనంగా ముగిసింది. విశ్వవిద్యాలయం నలుమూలల నుంచి 100కిపైగా విద్యార్థుల బృందాలు ఉత్సాహంగా పాల్గొని తమ నైపుణ్యాలను, సాంకేతిక ప్రతిభను ప్రదర్శించారు. ఐదు రౌండ్ల మూల్యాంకనం నిర్వహించగా 50 ఉత్తమ బృందాలను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్ లీడ్ స్కైహై సెక్యూరిటీ జయపాల్‌రెడ్డి ఉరాది, జే.పి.మోర్గాన్ చేజ్ అండ్ కో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దత్తసాయి తనుజ్.వి, డాక్టర్ రూపేష్ మిశ్రా, డాక్టర్ సురేష్‌కుమార్ మండల, అనిరుధ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గోపాల్‌పూర్, బ్యాంక్‌కాలనీ, సుబాష్ రోడ్డు, కనకదుర్గకాలనీ, ఎల్ఐసీ కాలనీ, అమరావతినగర్ టవర్స్ ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు.

ఎన్నికలను వెంటనే నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న అర్జుల కిషన్‌రెడ్డి

వడ్డెపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా అపార్ట్‌మెంట్స్ ఓనర్స్ అసోసియేషన్‌కు ఎన్నికలను వెంటనే నిర్వహించాలని వరంగల్ జిల్లా అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ వడ్డెపల్లి మెయిన్ రోడ్డులోని టీచర్స్‌కాలనీ ఫేస్-1లోని కమ్యూనిటీ హాల్‌లో జిల్లా అపార్ట్‌మెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత పాలకవర్గానికి కాల పరిమితి దాటి ఏడాదిన్నర కావస్తున్నదని అన్నారు. అపార్ట్‌మెంట్స్ ఓనర్స్ అసోసియేషన్‌కు పాలక వర్గం లేకపోవడం వలన అపార్ట్‌మెంట్స్‌లో నివసిస్తున్న ఓనర్స్ ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ బైలా ప్రకారం నిర్వహించాలని డిమాండ్ చేశారు. నెలలోపు ఎన్నికలను నిర్వహించకుంటే తామే నూతన పాలకవర్గాన్ని ఎన్నుకుంటామని అర్జుల కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అపార్ట్‌మెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు రఘుపతి రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వి. నరేందర్‌రెడ్డి, మర్రెడ్డి, నరహరి, పొట్లపల్లి శంకర్‌రావు, తిరువరంగం ప్రభాకర్, అనిల్‌కుమార్, వెంకట్ రాజ్‌మోహన్, ఓం ప్రకాష్, హన్మంతరెడ్డి, రవీందర్, డాక్టర్ హరి, రత్నాకర్, సురేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాందేవ్‌రెడ్డి, వినయ్, రమేష్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్, జీవీబీ శ్రీధర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అంబేద్కర్ శ్రేణులు

వడ్డెపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ యువజన సంఘం 49వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మధుపాక ఎల్లయ్య పిలుపు నిచ్చారు. ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ యువజన సంఘం ఆవిర్భావ దినోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. ఈ నెల 21న అంబేద్కర్ యువజన సంఘం ఆవిర్భావ దినోత్సవాలను వరంగల్ ఉమ్మడి జిల్లాలోని మండల, గ్రామ స్థాయిల్లో నిర్వహించాలని కోరారు. ఈ నెల 21న ఉదయం 11 గంటలకు హనుమకొండ చౌరస్తా నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం జెండా ఆవిష్కరణ చేస్తామని అంబేద్కర్ వాదులు, అంబేద్కర్ యువజన సంఘం కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ మాంకాల యాదగిరి, ఎస్సీ ఎస్టీ జిల్లా సంక్షేమ సంఘం ఏనుట్ల రవీందర్, సంఘ సలహాదారులు, డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్‌కుమార్, వనపాకల రాజయ్య, సత్తూరి చంద్రమౌళి, కామెర లక్ష్మణ్, కలకోట్ల ప్రతాప్, మేకల ప్రవీన్, వల్లందాస్ వెంకన్నలు పాల్గొన్నారు.

విద్యారంగంలో ప్రైవేటు విద్యా సంస్థలు కీలకం

• రిటైర్డ్ ప్రొఫెసర్ కె.విజయబాబు
• ప్రైవేట్ టీచర్లకు అవార్డులు


హడుప్సా అవార్డులు అందుకున్న ప్రైవేట్ టీచర్లు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో ప్రభుత్వ విద్యా సంస్థలతో పాటు ప్రైవేటు విద్యా సంస్థలు కీలక భూమిక పోషిస్తున్నాయని కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కె.విజయబాబు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీకళాశాల సెమినార్ హాల్‌లో హడుప్సా ఆధ్వర్యంలో గురు పూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయబాబు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు విద్యా సంస్థలు విద్యారంగం వ్యాప్తిలో గణనీయమైన కృషి చేస్తున్నాయన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సహకారంతో ప్రైవేటు ఉపాధ్యాయులు విద్యార్థుల ఎదుగుదలకు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అంతకుముందు హడుప్సా అధ్యక్షుడు తక్కళ్లపల్లి బుచ్చిబాబు అధ్యక్షోపన్యాసం చేస్తూ సంఘం సభ్య పాఠశాలల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన హడుప్సా అదే లక్ష్యంతో పాటుపడుతుందన్నారు. ప్రైవేటు యాజమాన్యాలు, ఉపాధ్యాయులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసేందుకు వర్క్‌షాపులు, ఓరియెంటేషన్ కార్యక్రమాలు, సెమినార్లు, క్రీడలతో పాటు సంస్కృతి, సాంస్కృతిక పరమైన కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యారంగ వ్యాప్తికి సంఘం కృషి చేస్తుందన్నారు. అనంతరం 75 సభ్య పాఠశాలల నుంచి 75 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారిని అహూతుల చేతుల మీదుగా సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధానకార్యదర్శి ఎం.సంతోష్‌రెడ్డి, కోశాధికారి డి.శంకర్, సలహాదారులు జనార్ధన్, వేణుమాధవచారి, నాయకులు రాజేశ్వర్ రావు, సురేష్, మధుకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, రామారావు, వెంకటేశ్వర్లు, సంపత్‌రెడ్డి, రామచంద్రమూర్తి, వాసుదేవరెడ్డి, సర్వరాజ్, రాజు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాటాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. హనుమకొండ అశోక జంక్షన్‌లో సీపీఐ సీనియర్ నాయకుడు బీఆర్ భగవాన్‌దాస్ విగ్రహం వద్ద మండల కార్యదర్శి యేషబోయిన శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో సీపీఐ భిక్షపతి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలో లిఖించదగిందని, ఈ చరిత్రను ముస్లిం, హిందువుల మధ్య జరిగిన యుద్ధం లాగా విష్రప్రచారం చేస్తున్న నాటి ఉద్యమంలో సంబంధం లేని వక్తలు దానిపై మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు. తెలంగాణలో నైజాం రాజుల నిరంకుశ, నియంతృత్వ పాలనలో ప్రజాస్వామ్యం లేక జీవించే హక్కులను కాలరాస్తూ ఆనాడు గ్రామాల్లో వెట్టిచాకిరి, బానిసత్వం, భూస్వాముల అరాచకాలు, దొరల అగడాలకు వ్యతిరేకంగా ప్రజలు తెగబడ్డారు. ఈ దురాగతాలకు వ్యతిరేకంగా పీడిత ప్రజలకు అండగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మొయినోద్దీన్‌లు పిలుపునిచ్చారు. ఆనాటి పోరాటంలో 4500మంది కమ్యూనిస్టులు, సానుభూతిపరులు తమ రక్తం చిందించి అమరులయ్యారని భిక్షపతి గుర్తు చేశారు. 3వేల గ్రామలను విముక్తి చేసి, భూస్వాముల నుంచి 10లక్షల ఎకరాల భూములను స్వాధీనం చేసుకొని పేదలకు పంపిణీ చేశారన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి మాట్లాడుతూ.. నాటి సాయుధ పోరాటంలో దున్నేవాడికి భూమి అన్న నినాదం దేశమంతటా విస్తరించిందన్నారు. నేటితరానికి ఈ చరిత్రను అందించవలసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. తెలంగాణ ప్రాంతాల్లో ఏగ్రామంలో అయినా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నడిపించింది సీపీఐ పార్టీ అని, నేటికీ ఆ ఆనవాళ్లు ఉన్నాయని జ్యోతి అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సిరబోయిన కరుణాకర్, అదిరి శ్రీనివాస్, ప్రజా నాట్యమండలి కార్యదర్శి కొట్టెపాక రవి, నాయకులు యాళ్ల సంజయ్, కండె నరసయ్య, పిలకల రాజు, ప్రభాకర్, చంద్రమౌళి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో పాల్గొన్న సీపీఐ నాయకులు



కలంకారీ తయారీ ప్రక్రియ తెలిసిన కళాకారులకు వ్యాపారాలు, విక్రయాలు తెలియవు. విక్రయిస్తూ వ్యాపారం చేసేవారికి కలంకారీ తయారీ ప్రక్రియ తెలియదు. ఈ రెండూ తెలిసిన అరుదైన మహిళే, మచిలీపట్నానికి చెందిన తుమ్మలపల్లి లక్ష్మీ మనోజ్ఞ. కలంకారీ కళకు కొత్త హంగులు జోడిస్తూ లెగ్గింగ్స్, బ్లౌజులతో వినూత్న ఆదరణ పొందుతున్న మనోజ్ఞతో నవ్య మాటా మంతీ...

కలంకారీకి కొత్త హంగులు

మాది నూజివీడు. చిన్నప్పుడే మచిలీపట్నం వల సొచ్చేశాం. నాన్న ఆరోగ్యం దెబ్బ తినడంతో కుటుంబ పోషణ భారం నా మీద పడింది. 2000 సంవత్సరంలో ఆంధ్రప్రభలో టైపిస్ట్‌గా పని చేశాను. ఆ సమయంలో దుస్తులు కుట్టించుకోవడం కోసం పెడన వెళ్లి నచ్చిన కలంకారీ వస్త్రాలను తెచ్చుకునేదాన్ని. ఆ వస్త్రాల్లో ఉండే సౌకర్యం, తయారీ ప్రక్రియలు నాకెంతో బాగా నచ్చేశాయి. నాక్కూడా ఆ వస్త్రాలతో ప్రయోగాలు చేయాలనే కోరిక బలంగా ఉండేది. కానీ అందుకు పరిస్థితులు అనుకూలించలేదు. 2009లో పెళ్లయింది. మా దంపతులిద్దరి లక్ష్యాలు ఒకటే కావడంతో, మా ఆలోచనలు కూడా కలిశాయి. అప్పటికే ఆయన కూడా వ్యాపారంలో నష్టపోయి ఉన్నారు. టైపిస్ట్ ఉద్యోగంతో, అదనపు పనివేళలతో నేను కూడా విసిగిపోయి ఉన్నాను. దాంతో ఇద్దరం కొత్త వ్యాపార మార్గంలోకి అడుగుపెట్టాలని నిర్ణయించుకున్నాం. అప్పట్లో కలంకారీ కర్చీఫ్స్ తయారవుతూ ఉండేవి. కాబట్టి వాటిని కొనుక్కొచ్చి, ప్లెయిన్ చీరల మీద కర్చీఫ్ డిజైన్లు కట్ చేసి అప్లిక్ వర్క్ చేయడం మొదలుపెట్టాను. బొటిక్స్‌కు సప్లై చేసినా ఆదరణ అంతంత మాత్రంగానే ఉండడంతో, పెడనలో ఎవరి దగ్గరైతే ప్రింటింగ్ వేయించుకున్నామో, వాళ్లకే రెడీమేడ్ ప్యాక్స్‌ను అందజేశాం! ఆ ప్యాచ్‌వర్క్స్ రెండేళ్ల పాటు చాలా బాగా అమ్ముడైపోయాయి. ఆ తర్వాత వాళ్లు మాకు ముడిసరుకు ఇవ్వడం మానేశారు. దాంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. అలా మొదటిసారిగా ఉత్పత్తి రంగంలోకి అడుగుపెట్టవలసిన పరిస్థితి తలెత్తింది.

క్రెడిట్ అంతా మా వారిదే!

ఇద్దరు మాస్టర్లను తీసుకొచ్చి, జాగా వెతుక్కుని ఉత్పత్తి మొదలుపెట్టాం. కానీ ఆ మాస్టర్లు మెలకువలను వివరించేవారు కాదు. అనుభవం లేని వాళ్లు ప్రింట్లు తప్పుగా గుద్దేసేవారు. అలాంటి వాటితో సంచులు కుట్టించి, అప్లిక్స్ అంటించి లేపాక్షిలో విక్రయించడం మొదలుపెట్టాను. పెడన నుంచి కూడా కొనుగోళ్లు జరిగాయి. అలా మాస్టర్లతో పలు విధాలుగా ముప్పుతిప్పలు పడిన తర్వాత, దంపతులిద్దరం, కలంకారీ లోతుపాతులను నిశితంగా పరిశీలించి, ప్రయోగపూర్వకంగా నేర్చుకున్నాం. నిజానికి ఈ క్రెడిట్ మొత్తం మా వారు సబ్బిశెట్టి నవీన్ కుమారోకే దక్కాలి. క్లిష్టమైన పరిస్థితి తలెత్తిన ప్రతిసారీ, కొత్తగా ఏం చేయొచ్చని మాత్రమే నేను ఆలోచించేదాన్ని. ఆ కొత్త ఆలోచనకు కార్యరూపమిచ్చి, ఉత్పత్తిని మార్కెట్‌కు చేరువ చేయడంలో మా వారి కృషి ఎంతో ఉంది.

అలా అసలైన కలంకారీ ఉత్పత్తిలో అంచెలంచెలుగా ఎదిగిన తర్వాత మరొక పెద్ద సమస్య తలెత్తింది. నాణ్యతలో రాజీ పడకుండా తయారుచేసినా, పెడనతో పోల్చి మమ్మల్ని నీరుగార్చేవాళ్లు పెరిగిపోయారు. చివరకు దంపతులిద్దరం హైదరాబాద్‌లో షోరూమ్ పెట్టాలని నిర్ణయించుకున్నాం! అలా 2019లో ఇద్దరు పిల్లలతో సహా హైదరాబాద్ వచ్చేశాం! షోరూమ్‌కు అడ్వాన్స్ కూడా ఇచ్చేశాం. అదే సమయంలో కొవిడ్ మొదలై, రెండోసారి మా వ్యాపారానికి గండి పడింది. దాంతో మచిలీపట్నం తిరుగుముఖం పట్టి, అక్కడి సొంత ఇంట్లోనే పనులు మొదలుపెట్టేశాం. కానీ పాత ప్రదేశంలో తిరిగి పాత సమస్యే ఎదురైంది. అక్కడి ధరలతో సమానంగా అమ్మలేం! ధరలు పెంచి అమ్మే పరిస్థితి కూడా లేదు. దాంతో ఎప్పటి నుంచో ఉన్న నా పాత ఆలోచనను మళ్లీ మా వారి ముందు ఉంచాను. అలా పుట్టుకొచ్చినవే... లైక్రా లెగ్గింగ్స్, బ్లౌజెస్.

లైక్రా బ్లౌజులు భేష్

సాధారణంగా వేసవిలో చీరకట్టుతో ఏదైనా వేడుకకు వెళ్తే, ఇంటికొచ్చి బ్లౌజ్ విప్పే వరకూ ఎంతో చికాకుగా ఉంటుంది. ఈ ఇబ్బంది లైక్రా బ్లౌజులతో ఉండదనిపించింది. కరక్కాయ, పాల మిశ్రమంలో ముంచి తయారుచేస్తున్న లెగ్గింగ్స్ ఎంత మృదువుగా, సుతిమెత్తగా, సౌకర్యంగా ఉన్నాయో బ్లౌజులు కూడా అలాగే ఉండాలని ఆలోచించాను. అలాగే మిగతా బ్లౌజుల్లాగే ఒంటికి హత్తుకుపోయి, ముడతలు లేకుండా ఉండడం కోసం ఎంతో కష్టపడ్డాను. లైక్రా కలంకారీ లెగ్గింగ్స్‌తో పాటు బ్లౌజులు సూపర్‌హిట్ అవడంతో, 2023లో మళ్లీ హైదరాబాద్ వచ్చేసి, కూకట్‌పల్లిలో స్టోర్ తెరిచాను. నేను తయారుచేసిన బ్లౌజులకు గిరాకీ పెరగడానికి పలు కారణాలున్నాయి. స్థూలకాయులు, బ్లౌజులు వేసుకునే అలవాటు లేనివాళ్లు సాధారణ బ్లౌజ్‌లు ధరించడానికి ఇబ్బంది పడుతూ ఉంటారు. అలాగే గుండె జబ్బులున్నవాళ్లు కూడా బిగదీసినట్టుండే సాధారణ బ్లౌజులతో అసౌకర్యానికి గురవుతూ ఉంటారు. వీళ్లందరికీ నా బ్లౌజులు ఒక వరంలా పని చేశాయి.

నాణ్యతే ప్రధానంగా...

ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు విజయవాడలో 'మానవ్' కలంకారీ షోరూమ్స్ ఉన్నాయి. త్వరలో విశాఖపట్నంలో కూడా షోరూమ్ రాబోతోంది. బెంగళూరు, చెన్నైల్లో కూడా షోరూమ్స్ ప్రారంభించాలనే ఆలోచన ఉంది. ప్రస్తుతం నా దగ్గర 200 మంది కళాకారులు పని చేస్తున్నారు. అర్ధకం పని పూర్తిగా మహిళలదే! ప్రస్తుతం నా దగ్గర కలంకారీ టాప్స్, కాడ్ సెట్స్, లైక్రా లెగ్గింగ్స్, బ్లౌజెస్, టీషర్ట్స్, ఫ్రాక్స్, చీరలు తయారవుతున్నాయి. నైట్‌వేర్ తయారుచేయాలనే ఆలోచన కూడా ఉంది. స్క్రీన్ ప్రింట్లకు గిరాకీ పెరుగుతోంది కాబట్టి మేం కూడా ఈ ప్రింట్స్ వేస్తున్నాం. కానీ నాణ్యత కోసం కరక్కాయ పొడి, పాలు ఉపయోగించడంతో పాటు తప్పనిసరిగా రెండు సహజసిద్ధ రంగులను కూడా ఉపయోగిస్తున్నాం. కృత్రిమ రంగు వేసినా, రసాయనాల ప్రభావంతో చర్మం దెబ్బతినకుండా ఉండడం కోసం రంగు వేసిన వస్త్రాన్ని బాయిల్ చేసిన తర్వాతే మార్కెట్‌లో ప్రవేశపెడుతూ ఉంటాం.

● గోగుమళ్ల కవిత

అసలైన కలంకారీ అదే!

రామాయణ, భాగవతాలను కలంతో బొమ్మలుగా గీసుకుని, సహజసిద్ధ రంగులు అద్దే పనితనమే కలంకారీ. కానీ ఇలాంటి అసలైన కలంకారీ కళ క్రమేపీ అంతరించిపోతోంది. ప్రస్తుతం స్క్రీన్ మీద ఔట్ లైన్ గీసుకుని, చీర మీద ప్రింట్ తీసుకుని, చేత్తో రంగులు అద్దే ప్రక్రియ పెరుగుతోంది. అలాగని స్వచ్ఛమైన కలంకారీ కళ పూర్తిగా అంతరించిపోలేదు. గిట్టుబాటు ధర చేతికందే సందర్భంలో, ప్రత్యేకించి కంచిపట్టు చీరల కోసం అసలైన కలంకారీకి పూనుకునే కళాకారులు కూడా కొద్ది సంఖ్యలో ఉన్నారు. ఇది శ్రీకాళహస్తి పరిస్థితి. కలంకారీకి పేరు పొందిన పెడనలో పరిస్థితి కాస్త భిన్నం. ఉడ్ బ్లాక్ మీద డిజైన్ చెక్కి, ఐదారు సహజసిద్ధ రంగుల్లో అద్ది అద్దకం వేసే కలంకారీ ప్రక్రియ ఇది. తుప్పు పట్టిన ఇనుప రేకు, బెల్లం, ఉప్పులను కలిపి ఊరబెడితే నలుపు రంగు తయారవుతుంది. అలాగే అడవుల నుంచి కొన్ని సహజరంగులు సేకరిస్తారు. జాజి ఆకు, మోదుగ పువ్వు, తుమ్మ జిగురు.. ఇలా కావలసిన రంగు కోసం పలు రకాల ప్రకృసిద్ధ ముడిపదార్థాలను ఉపయోగిస్తారు. ఇలా ముడిపదార్థాలన్నీ ఉపయోగించి ఒక చీర తయారుచేయడానికి 40 నుంచి 45 రోజుల సమయం పడుతుంది. ఇందుకు వాతావరణం కూడా అనుకూలించాలి.



ఒక్క చీర తయారీకి 45 రోజులు

మొదట్లో లుంగీలు, తలుపు కర్టెన్లు, కర్చీఫ్స్ తయారయ్యేవి. తర్వాత దుప్పట్లు, చీరలు అందుబాటులోకొచ్చాయి. ఆ తర్వాత స్క్రీన్ ప్రింటింగ్ చీరలు వాడుకలోకొచ్చాయి. ఇప్పటికీ వాటినే అసలైన కలంకారీ చీరలుగా నమ్ముతున్నవాళ్లున్నారు. నిజానికి కలంకారీ చీర అసలు ప్రక్రియ గురించి అందరికీ తెలియదు. రన్నింగ్ మెటీరియల్ లేదా చీర.. ఇలా కావలసిన ముడిసరుకు తెచ్చుకుని అవసరమైనంత పొడవు కత్తిరించుకుని, మూటల్లా కట్టి, 24 గంటలపాటు చెరువుల్లో చలవ చేస్తారు. తర్వాత బిరుసు తొలిగిపోయేలా ఉతికి, ఆరబెట్టి, కరక్కాయ పొడి, పాలు కలిపి ఆ మిశ్రమంలో వస్త్రాన్ని నానబెట్టుకుంటారు. తర్వాత ఇదే వస్త్రం ప్రింట్లు పూర్తి చేసుకుని, వాసింగ్‌కు వెళ్లేవరకూ దీని మీద నీటి చుక్క పడకుండా జాగ్రత్త తీసుకోవాలి. లేదంటే వస్త్రం మీద నల్ల మచ్చలు ఏర్పడతాయి. ఇలా ఆరబెట్టి సిద్ధం చేసుకున్న వస్త్రం మీద సహజసిద్ధ రంగులను అద్దుకుంటారు. తర్వాత చివర్లో అదనపు రంగులను వదిలించడం కోసం పారే నీళ్లలో మునిగేలా మోకుకు కట్టి ఉంచుతారు. ఇలా అంతిమంగా అసలు రంగులు తేలిన తర్వాత ఆరబెట్టి, దినుసులు కలిపిన నీళ్లలో మరిగించి, సెకండ్ ప్రింట్ వేసుకుని, రెండోసారి వాష్ చేసి, చివర్లో పటికలో పెడతారు. ఈ ప్రక్రియ మొత్తానికీ 45 రోజుల సమయం పడుతుంది.

ఇంట్లోనే కూరగాయలు పండిద్దాం..!

మనకు కావాల్సిన కూరగాయలను ఇంట్లోనే పండించుకుని వండుకుంటే ఆ ఆనందమే వేరు. ఎటువంటి రసాయనాలు లేకుండా సేంద్రీయ పద్ధతుల్లో పండించిన కూరగాయలను తినడం ఆరోగ్యానికి మంచిది కూడా. ఇంట్లో కూరగాయల మొక్కలను ఎలా పెంచాలో తెలుసుకుందాం...



- కూరగాయల మొక్కలకు సూర్యరశ్మి అత్యవసరం. రోజుకు కనీసం అయిదు నుంచి ఆరు గంటలపాటు మొక్కలకు ఎండ తగిలేలా చూసుకోవాలి. మేడపైన, బాల్కనీల్లో కుండీలు లేదా గ్రో బ్యాగ్‌లు ఏర్పాటు చేసుకోవచ్చు. ఇంటి వెనక ఖాళీ ప్రదేశంలో నాటితే మొక్కలు ఏపుగా పెరుగుతాయి.
- మొక్కలకు ఉదయం, సాయంత్రం తగుమాత్రం నీళ్లు పోయాలి. మట్టి ఎప్పుడూ తడిగా ఉండేలా చూసుకోవాలి. కుండీలు, గ్రో బ్యాగ్‌ల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. అదనపు నీరు బయటికి వెళ్లేలా అడుగు భాగంలో రంధ్రాలు చేయాలి. పెరట్లో అయితే మట్టితో మడులు తయారుచేసి వాటిలో కూరగాయల మొక్కలు పెంచవచ్చు.
- టమాటా, వంకాయ, బెండకాయ, దొండకాయ, దోస, బీర, చిక్కుడు, గుమ్మడి, పాలకూర, తోటకూర, పుదీనా మొక్కలను సులభంగా పెంచుకోవచ్చు. కుటుంబసభ్యులందరూ ఇష్టంగా తినే కూరగాయలను పండించడం సంతోషంగా అనిపిస్తుంది. కూరగాయల విత్తనాలను నేరుగా మట్టిలో వేసి మొక్కలు పెంచవచ్చు. అయితే విత్తనాల ప్యాకెట్ల మీద సూచించిన లోతు, దూరం నిబంధనలను కచ్చితంగా పాటించాలి. లేదంటే నర్సరీల నుంచి చిన్న మొక్కలను తెచ్చి నాటుకోవచ్చు.
- కూరగాయలు, ఆకుకూరల మొక్కలు ఏపుగా పెరగడానికి మట్టి నాణ్యత తప్పనిసరి. మొక్కలకు కావాల్సిన పోషకాలు మట్టి నుంచే అందుతాయి. కాబట్టి మట్టిలో సేంద్రీయ ఎరువులు, కోకోపిట్ లాంటివి కలపడం ప్రయోజనకరంగా ఉంటుంది.
- మొక్కలకు క్రిమి కీటకాలు చేరకుండా తరచూ వేప నీళ్లు, పసుపు నీళ్లు పిచికారీ చేస్తూ ఉండాలి.

కలిసికట్టుగా బండ్లు నడిపిస్తున్నారు!

పెట్రోల్ బంక్‌లో మహిళా సిబ్బంది కనిపించడమే అరుదు. కానీ స్వయంగా పెట్రోల్ బంక్ నిర్వహిస్తూ లాభాలు ఆర్జిస్తూ... కొత్త వ్యాపారాలకు ప్రణాళికలు వేస్తున్నారు నారాయణపేట జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు. దేశంలోనే మొదటిసారిగా ఒక మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్‌బంక్‌గా ఇది గుర్తింపు పొందింది.



మహిళలకు అవకాశం కల్పిస్తే ఏ పనినైనా సమర్థవంతంగా చేయగలరని నిరూపిస్తున్నారు తెలంగాణలోని నారాయణపేట జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు. గత ఫిబ్రవరి 21న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా వారు ప్రారంభించిన పెట్రోల్‌బంక్ లాభాల బాటలో దూసుకుపోతోంది. మహిళలే నిర్వహించేలా ఒక పెట్రోల్ బంక్‌ను కేటాయించడం విశేషమే. దీని వెనుక కథేమిటంటే... రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ సమస్య వివిధ అంశాలపై అధ్యయనం చేసి, దాన్ని ముఖ్యమంత్రికి సమర్పించారు. దానిలోని అంశాల ఆధారంగా పెట్రోల్ బంక్ ఏర్పాటుకు సీఎం అనుమతించారు. ఈ నేపథ్యంలో... నారాయణపేట జిల్లా కేంద్రంలోని సింగారం చౌరస్తాలో... డీఆర్‌డిఏ కార్యాలయం దగ్గర 300 గజాల ప్రభుత్వ స్థలాన్ని అధికారులు కేటాయించారు. కిందటి ఏడాది సెప్టెంబర్‌లో భారత్ పెట్రోలియం సంస్థతో జిల్లా మహిళా సమాఖ్య ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం... 20 ఏళ్ల పాటు నెలకు రూ.20 వేల అద్దె ప్రాతిపదికన సమాఖ్య ఈ పెట్రోల్ బంక్‌ను నిర్వహిస్తుంది. స్థలం రాష్ట్ర ప్రభుత్వానిది కాగా, మిగిలిన నిర్మాణపనులను భారత్ పెట్రోలియం సంస్థ పూర్తి చేసింది. దీనికి రూ1.3 కోట్లు ఖర్చు చేశారు. మహబూబ్‌నగర్-యాద్గిర్ (కర్ణాటక) అంతర్రాష్ట్ర రహదారిలో ఏర్పాటైన ఈ పెట్రోల్ బంక్‌ను ఈ ఫిబ్రవరిలో సీఎం ప్రారంభించారు.

కొనుగోళ్లు, నిర్వహణ అంతా వారే...

ఈ బంక్‌ను సమాఖ్యకు చెందిన 11 మంది మహిళలు నిర్వహిస్తున్నారు. డీజిల్, పెట్రోలు కొనుగోళ్లు తదితరాలను వారే నిర్వహిస్తున్నారు. మేనేజర్‌కు నెలకు రూ.18 వేలు, పదిమంది మహిళలకు నెలకు రూ.13 వేలు చొప్పున, వాచ్‌మేన్‌కు రూ.6 వేలు వేతనంగా సమాఖ్య చెల్లిస్తోంది. నిర్వహణకోసం సమాఖ్య ద్వారా రూ. 35 లక్షలు పెట్టుబడి పెట్టినట్టు సభ్యులు తెలిపారు. వేతనాలు, నిర్వహణ ఖర్చులు పోనూ గత ఆరు నెల్లో ఈ బంక్ రూ.13.58 లక్షల లాభాన్ని సంపాదించింది. కాగా... ప్రస్తుతం సీఎన్‌జీ గ్యాస్ అందించడం లేదా టీ, టిఫిన్ పాయింట్ ఏర్పాటు చేయడం గురించి ఆలోచించాల్సిందిగా సభ్యులకు కలెక్టర్ సంచిత్ సంగ్వార్ చూపించారు. దీంతో మరికొంతమంది మహిళలకు ఉపాధి కల్పించడానికి సమాఖ్య ప్రణాళికలు వేస్తోంది.

\- శ్రీధర్ రావు, నారాయణపేట

మొదట్లో ఇబ్బందులు పడ్డాం



మొదట్లో పెట్రోల్, డీజిల్‌ను వాహనాలకు వెయ్యడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. కొన్నిరోజుల తర్వాత అలవాటు కావడంతో ప్రస్తుతం సాఫీగా పనులు సాగిస్తున్నాం. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విధులు నిర్వహిస్తున్నాం.

\- అనిత, జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి, నారాయణపేట

మహిళల ఆర్థిక ఎదుగుదలకు దోహదం



మహిళలు వంటింటికే పరిమితం కాదని మా సమాఖ్య నిరూపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహంతో పెట్రోల్ బంకు నిర్వహణ చేపట్టాం. 11 మంది మహిళలు కష్టపడి పని చేస్తున్నారు. మా బంక్‌కు జాతీయ స్థాయి పేరురావడం సంతోషంగా ఉంది. ఈ ఆగస్టులో ఢిల్లీలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవాల్లో పాల్గొని ప్రధాని నరేంద్రమోదీని కలుసుకున్న సందర్భాన్ని మరచిపోలేం.

\- చంద్రకళ, పెట్రోల్ బంకు మేనేజర్, నారాయణపేట

అందం పెరిగేందుకు...




ప్రతిఒక్కరూ అందంగా కనిపించాలని కోరుకుంటూ ఉంటారు. అందుకోసం ఖరీదైన క్రీములు, ఫేస్ ప్యాక్‌లు, మేకప్ ఉత్పత్తులు వాడుతూ ఉంటారు. అలా చేసే బదులు చిన్న చిట్కాలు పాటించి అందం, ఆరోగ్యాలతో మెరిసిపోవచ్చంటున్నారు నిపుణులు. ఆ వివరాలు...

- రోజూ సాధ్యమైనంత ఎక్కువగా మంచినీళ్లు తాగాలి. వాతావరణం చల్లగా ఉన్నప్పుడు దాహం అనిపించకపోయినా కొన్ని నీళ్లు తాగుతూ ఉండాలి. తరచూ పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, సూప్‌లు తాగాలి. అప్పుడే శరీరం తేమగా ఉంటుంది. చర్మం, శిరోజాలు మెరుస్తూ ఉంటాయి. మొటిమలు, గుల్లల సమస్య తీరుతుంది.
- ఒక బకెట్ నీళ్లలో రెండు గుప్పెళ్ల వేపాకులు వేసి బాగా మరిగించాలి. ఈ నీటితో స్నానం చేస్తే చర్మం నిగనిగలాడుతుంది. ఎలాంటి చర్మ సమస్యలూ దరి చేరవు.
- టమాటా, బొప్పాయి, లేత కొబ్బరి, శనగపిండి తదితరాల్లో ఒక దాన్ని ఉపయోగించి తయారుచేసిన ఫేస్ ప్యాక్‌ను ముఖానికి పట్టించి అరగంటసేపు ఆరనివ్వాలి. తరవాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని కడిగేసుకుంటే పిగ్మెంటేషన్, మొటిమల మచ్చలు, సన్నని ముడుతలు మాయమవుతాయి. బయట తిరిగే వారు తరచూ ముఖానికి ఆవిరి పట్టడం మంచిది. దీనివల్ల చర్మ రంధ్రాలు తెరచుకుని శుభ్రపడతాయి. దుమ్ము, ధూళి తొలగిపోయి ముఖం ప్రకాశవంతంగా మారుతుంది.
- రోజూ తాజా పండ్లు, ఆకు కూరలు, కూరగాయలను తీసుకోవాలి. అప్పుడే కళ్లు, గోళ్లు, చర్మం, శిరోజాలు ఆరోగ్యంగా ఉంటాయి.
- తలస్నానం తరవాత ఒక మగ్గు నీటిలో రెండు చెంచాల నిమ్మరసం కలిపి తలకు పట్టించాలి. దీనివల్ల కుదుళ్లు గట్టిపడి జుట్టు రాలడం తగ్గుతుంది. కండిషనర్‌ను ఉపయోగిస్తే జుట్టు నల్లగా ఒత్తుగా కనిపిస్తుంది.
- పేరిన నెయ్యి లేదా కొత్తిమీర రసం రాస్తుంటే పెదాల నలుపు తగ్గుతుంది. తరచూ కొబ్బరినూనెతో మర్దన చేయడం వల్ల కనుబొమ్మలు నల్లగా ఒత్తుగా పెరుగుతాయి.

చిన్ని చేతులు అద్భుతం చేశాయి

శ్రేయోవీ మెహతా నడక రాకముందే అడవుల్ని చుట్టేసింది. అక్షరాలు దిద్దుతూనే కెమేరా చేతపట్టింది. పదేళ్ళ వయసుకే అంతర్జాతీయ స్థాయి వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ పోటీలో రన్నర్-అప్‌గా గెలిచింది. వచ్చే నెల లండన్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియంలో జరిగే ప్రదర్శనకు సిద్ధమవుతోంది. తనకు ప్రకృతితో, కెమేరాతో ఉన్న అనుబంధం గురించి శ్రేయోవి ఏం చెబుతోందంటే...



"కిందటి ఏడాది లండన్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియంలోకి తొలిసారి అడుగుపెట్టాను. అక్కడ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్‌ను చూసినప్పుడు ఎంతో ఉద్వేగం చెందాను. ప్రపంచస్థాయిలో గొప్ప ఫొటోగ్రాఫర్లు తీసిన ఛాయాచిత్రాలు నన్ను కళ్ళు తిప్పుకోనివ్వలేదు. 'నా ఫొటోలు కూడా ఈ ప్రదర్శనలో చోటు చేసుకుంటే ఎంత బాగుంటుందో?' అనిపించింది. ఏడాది తిరిగేలోపే ఆ కల నెరవేరబోతోంది. ఈ ఏడాది అక్టోబర్‌లో జరిగే ఎగ్జిబిషన్‌లో నేను తీసిన ఫొటో ప్రదర్శితం కాబోతోంది.

ఎక్కడికి వెళ్ళినా అది నాతోపాటే...

ప్రకృతి, వన్యప్రాణులు, ఫొటోగ్రఫీ... ఇవంటే నాకు ప్రాణం. ఆ అభిరుచి నాలో కలగడానికి, పెరగడానికి కారణం నా తల్లిదండ్రులు. నాన్న శివాంగ్ మెహతా ప్రొఫెషనల్ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్, అమ్మ కప్నా మెహతా ఒక వైల్డ్‌లైఫ్ ట్రావెల్ కంపెనీ నడుపుతోంది. నేను పుట్టిన కొన్నాళ్ళకే తనతోపాటు నన్నూ టూర్స్‌కు తీసుకువెళ్ళేది. అలా ఊహ తెలియకముందే నాకు ప్రకృతి, వన్య ప్రాణులు పరిచయమయ్యాయి. నాన్న అడవుల్లో తిరిగి ఫొటోలు తీసేవారు. వాటిని చూస్తూ పెరిగిన నాకు కూడా ఫొటోలు తీయాలనే ఆసక్తి మొదలయింది. నాన్న దగ్గర చాలా కెమేరాలు ఉండేవి. నా ఉత్సాహం చూసి... నాలుగేళ్ళ వయసులోనే ఫొటోలు తీయడం అలవాటు చేశారు. ఆరేళ్ళు వచ్చేసరికి నాన్న దగ్గర ఎన్నో మెలకువలు నేర్చుకున్నాను. మొదటిసారిగా ప్రొఫెషనల్ కెమేరాను నాన్న నాకు ఇచ్చారు. అది చాలా బరువుగా ఉండేది. ఫ్రేమింగ్, యాంగిల్స్, కెమేరా సెట్టింగ్స్... అన్నీ తెలుసుకున్నాను. అప్పటి నుంచి ఎక్కడికి వెళ్ళినా నాతోపాటు కెమేరా కూడా ఉండేది. నేషనల్ పార్కులు, సఫారీలకు అమ్మతో నాన్నతో వెళ్ళినప్పుడు... ఎంతో మంది ప్రకృతి ప్రేమికులతో, పర్యావరణవాదులతో పరిచయం ఏర్పడింది. వారిద్వారా ఎన్నో జంతువులు, కీటకాలు, పక్షులు, చెట్ల పేర్లను, వాటి ప్రత్యేకతలను తెలుసుకున్నాను. వన్యప్రాణులను ఫొటోలు తీసేటప్పుడు... వాటి మూడ్స్ గమనించాలని అప్పుడు మరింత బాగా అర్థమయింది. క్రమంగా మా అమ్మ తన ట్రావెల్ కంపెనీతో బాగా బిజీ అయిపోయింది. ఏడాదిలో దాదాపు మూడువందల రోజులు పర్యాటకులను టూర్లకు తీసుకువెళ్ళాల్సి వచ్చేది. దాంతో ఏమాత్రం ఖాళీ దొరికినా నేనూ, నాన్నా ఆమెతో పాటు వెళ్ళేవాళ్ళం. ప్రకృతితో మరింత మమేకం అయ్యే అవకాశం నాకు కలిగింది.



117 దేశాల నుంచి 60 వేల ఎంట్రీలు...

ఉత్తరాఖండ్‌లోని జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్, రాజస్థాన్‌లోని భరత్‌పూర్ నేషనల్ పార్క్‌లకు మేము తరచూ వెళ్ళేవాళ్ళం. నాన్న, నేను పోటీ పడి వన్యప్రాణులను, ఆకర్షణీయమైన ప్రకృతి దృశ్యాలను ఫొటోలు తీసేవాళ్ళం. 2023 నవంబర్‌లో మేము భరత్‌పూర్‌లో ఉన్నాం. ఒక రోజు తెల్లవారుజామున వాకింగ్‌కు బయల్దేరాం. అప్పుడే తెల్లవారుతోంది. చెట్ల గుబుర్ల మధ్యలో రెండు నెమళ్ళు అటూ ఇటూ తిరిగి నిలబడి ఉన్నాయి. నాన్న సూచనతో ఆ దృశ్యాన్ని ఫొటో తీశాను. అది చాలా బాగా వచ్చింది. దాన్ని చూసి అమ్మా, నాన్నా చాలా మెచ్చుకున్నారు. దాన్ని పోటీలకు పంపాలనే ఆలోచన వారికి వచ్చింది. లండన్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియం ప్రతి సంవత్సరం బీబీసీ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ పోటీని నిర్వహిస్తుంది. కిందటి ఏడాది ఆ పోటీకి నేను తీసిన ఫొటోను 'ఇన్ ది స్పాట్‌లైట్' పేరుతో వారు పంపించారు. ఆ పోటీకి 117 దేశాల నుంచి దాదాపు 60 వేలమంది ఎంట్రీలను పంపారు. పదేళ్ళు, అంతకు తక్కువ వయసున్న వారి విభాగంలో 'వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ది ఇయర్-2024' రన్నర్-అప్‌గా పురస్కారం నాకు లభించింది.

అది గొప్ప గౌరవం

వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీలో ఆస్కార్ బహుమతిగా గుర్తింపు ఉన్న ఈ అవార్డును... తొమ్మిదేళ్ళ వయసులో నేను అందుకుంటానని ఊహించలేదు. అంతేకాదు... మన దేశం నుంచి ఇది సాధించిన అతి పిన్నవయస్కురాలిని నేనే. అది కూడా మన జాతీయ పక్షుల ఫొటోకు రావడంతో నా ఆనందానికి అవధులు లేవు. దీనంతటి వెనుక నా తల్లితండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంది. చదువును, ఫొటోగ్రఫీని బ్యాలెన్స్ చేసుకోవడానికి వాళ్ళు ఎంతో మద్దతు ఇస్తున్నారు. మేము హర్యానాలోని ఫరీదాబాద్‌లో ఉంటాం. అక్కడే ఆరో తరగతి చదువుతున్నా. వచ్చేనెలలో లండన్‌లో జరిగే ఎగ్జిబిషన్‌లో నా ఫొటో చోటు చేసుకోవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. బాగా చదవాలి. ఫొటోగ్రాఫర్‌గా ఇంకా చాలా నేర్చుకోవాలి. అందుకోసం ఎంతో అభ్యాసం చేయాలి. నా ఫొటోల ద్వారా వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజల్లో అవగాహన కలిగించాలి. ప్రస్తుతం ఇవీ నా లక్ష్యాలు."

దిక్సూచి

మేనేజ్‌మెంట్ విద్యార్థుల కోసం 'ఇగ్నో' ఉచిత కోర్సులు



మేనేజ్‌మెంట్, కామర్స్ విద్యార్థుల కోసం ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో) కొన్ని ఉచిత కోర్సులను అందిస్తోంది. కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని 'స్వయం' (https://swayam.gov.in) - పోర్టల్‌లో ఈ కోర్సుల పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. అలాగే ఎన్‌రోల్ కావచ్చు.

బిజినెస్ లా: సోషల్, డొమెస్టిక్, మోరల్, రిలీజియస్, కమర్షియల్‌కి సంబంధించిన అగ్రిమెంట్స్ మొదలైన వాటిపై కోర్సు ఉంటుంది. 16 వారాల కోర్సు. పరీక్షలు డిసెంబర్ రెండో వారంలో ఉంటాయి. ప్రొఫెసర్ డా.మధులిక సారికర్ బోధిస్తారు.

ఇన్‌కంటాక్స్ లా అండ్ ప్రాక్టీస్: ఇన్‌కంటాక్స్ చట్టాలు, ప్రాక్టీస్ పట్ల విద్యార్థులకు అవగాహన పెంచడం కోసం ఉద్దేశించిన 15 వారాల కోర్సు ఇది. డిసెంబర్ రెండో వారంలో పరీక్షలు నిర్వహిస్తారు.

ప్రిన్స్‌పల్స్ ఆఫ్ మార్కెటింగ్: ఏ వ్యాపారంలోనైనా మార్కెటింగ్ రోల్‌ను అర్థం చేసుకోవడం, తదితరాలపై ఏర్పాటు చేసిన కోర్సు ఇది. ప్రొఫెసర్ డాక్టర్ అనుప్రియా పాండే దీనిని బోధిస్తారు. 16 వారాలో కోర్సు. డిసెంబర్ రెండో వారంలో పరీక్షలు నిర్వహిస్తారు.

బిజినెస్ కమ్యూనికేషన్: బిజినెస్ కమ్యూనికేషన్ ఎలా జరుగుతుంది, మీటింగ్స్, బిజినెస్ డీలింగ్స్, క్లయింట్ ప్రజంటేషన్ తదితరాలన్నీ ఇందులో బోధిస్తారు. ప్రొఫెసర్ డాక్టర్ రశ్మీ బన్సాల్ దీనిని బోధిస్తారు. మొత్తం 12 వారాల కోర్సు. పరీక్షలు 2025 డిసెంబర్‌లో ఉంటాయి.

ఫైనాన్షియల్ లిటరసీ: ఫైనాన్స్‌లో కెరీర్ ఎంచుకోవాలనుకునే వారికి ఉద్దేశించిన కోర్సు ఇది. భారతదేశంలో ఫైనాన్షియల్ సెక్టార్‌లో పేరొందిన వారు బోధిస్తారు.

ఎంట్రప్రెన్యూర్ స్కిల్స్ అండ్ డిజిటల్ మార్కెటింగ్ స్ట్రాటజీస్: కోర్సు వ్యవధి 12 వారాలు. ఎంట్రప్రెన్యూర్‌షిప్ ఫండమెంటల్స్, డిజిటల్ మార్కెటింగ్ స్ట్రాటజీస్ తదితరాలపై కోర్సు ఉంటుంది. ఎంట్రప్రెన్యూర్స్ కావాలనుకునే వారిని, కాలేజ్ లెర్నర్స్, చిన్న బిజినెస్ వారిని ఉద్దేశించి తయారు చేశారు. వారికి ప్రాక్టికల్ నాలెడ్జ్ కల్పిస్తారు.

ఫైనాన్షియల్ అకౌంటింగ్: అకౌంటింగ్, అకౌంటింగ్ ప్రాసెస్, ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్ ప్రిపరేషన్, అండర్ స్టాండింగ్, ఇంటర్‌ప్రిటేషన్ ఆఫ్ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్ తదితరాలను ప్రొఫెసర్ సునీల్ కుమార్ బోధిస్తారు. మొత్తం 16 వారాల కోర్సు. 2025 డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు.

బిజినెస్ ఆర్గనైజేషన్ అండ్ మేనేజ్‌మెంట్: బిజినెస్ అండ్ బిజినెస్ ఎంట్రప్రైజెస్‌పై ఉంటుంది. ప్రొఫెసర్ నావెల్ కిశోర్, అతని టీమ్ దీనిని బోధిస్తారు. 16 వారాల కోర్సు. పరీక్షలు 2025 డిసెంబర్‌లో నిర్వహిస్తారు.

బ్యాంక్ ఉద్యోగాలు



ఎస్‌బీఐలో మేనేజర్లు

ఖాళీలు 122

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెగ్యులర్ ప్రాతిపదికన 122 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- మేనేజర్(క్రెడిట్ అనలిస్ట్): **63 పోస్టులు**
- మేనేజర్(ప్రొడక్ట్స్-డిజిటల్ ప్లాట్‌ఫామ్స్): **34 పోస్టులు**
- డిప్యూటీ మేనేజర్(ప్రొడక్ట్స్ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్): **25 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ/ ఎంబీఏ/పీజీడీబీఏ/ పీజీడీబీఎం/ సీఏ/సీఎఫ్ఏ/ఐసీడబ్ల్యూఏ/ బీఈ/బీటెక్ తోపాటు పని అనుభవం ఉండాలి.

వయస్సు: మేనేజర్‌కు 28-35 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 25-32 ఏళ్లు, మేనేజర్ క్రెడిట్ అనలిస్ట్ 25-35 ఏళ్ల మధ్యలో ఉండాలి.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 2

వెబ్‌సైట్: https://sbi.bank.in/

ఐఓబీలో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

ఖాళీలు 127

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్(ఐఓబీ)లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ ఆఫీసర్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వెలువడింది.

అర్హత: డిగ్రీ/బీఆర్క్/బీటెక్/బీఈ, ఎంఎస్సీ/ ఎంఈ/ ఎంటెక్ ఎంబీఏ/పీజీడీబీఏ/పీజీడీఎమ్ పాసై ఉండాలి.

వయస్సు: 2025 సెప్టెంబర్ 1 నాటికి పోస్టులను అనుసరించి 25 నుంచి 40 ఏళ్ల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా జరుగుతుంది.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 3

వెబ్‌సైట్: www.iob.bank.in/Careers

ఆర్‌బీఐలో గ్రేడ్-బీ ఆఫీసర్లు

ఖాళీలు 120

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 120 ఆఫీసర్ గ్రేడ్-బీ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది.

- ఆఫీసర్స్ గ్రేడ్ బీ(జనరల్ కేడర్): **83**
- ఆఫీసర్స్ గ్రేడ్-బీ(డీఈపీఆర్ కేడర్): **17**
- ఆఫీసర్స్ గ్రేడ్-బీ(డీఎస్ఐఎమ్ కేడర్): **29**

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ పాసై ఉండాలి. పని అనుభవం కూడా ఉండాలి.

వయస్సు: 2025 సెప్టెంబర్ 1 నాటికి 21 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 30

వెబ్‌సైట్: https://opportunities.rbi.org.in/

స్కూలు టీచర్ల కోసం మద్రాసు ఐఐటీ ఫ్రీ ఏఐ కోర్సులు



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ప్రతీ రంగాన్ని రీషేపింగ్ చేసింది. దీనికి అతీతమైన రంగం అంటూ ఇప్పుడు లేదు. దీనికి ఎడ్యుకేషన్ మినహాయింపు ఏమీ కాదు. లెర్నింగ్ ప్రక్రియను ఏఐ పూర్తిగా మార్చేసింది. ఈ ప్రక్రియను ఎవరైతే తరగతి గది వరకు తీసుకెళ్లగలరో వారే భవిష్యత్తులో విజయవంతమైన ఉపాధ్యాయులుగా నిలబడగలుగుతారు. దేశానికి అలాంటి టీచర్లను తయారు చేయడం కోసం మద్రాస్ ఐఐటీ ఒక ప్రోగ్రామ్‌ను రూపొందించింది. కిండర్ గార్టెన్ మొదలుకుని ఇంటర్ వరకు దేశవ్యాప్తంగా ఉన్న స్కూలు టీచర్ల కోసం 'ఏఐ ఫర్ ఎడ్యుకేటర్స్' పేరుతో ఉచిత ఆన్‌లైన్ కోర్సులను ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వ స్వయం పోర్టల్ ద్వారా ఈ కోర్సులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. గతంలో 'ఏఐ ఇన్ ఫిజిక్స్', 'ఏఐ ఇన్ కెమిస్ట్రీ', 'ఏఐ ఇన్ అకౌంటింగ్', 'క్రికెట్ అనాలిసిస్ విత్ ఏఐ', 'పైథాన్ ద్వారా ఏఐ/ఎంఎల్' కోర్సులను తెచ్చింది.

- 'ఏఐ ఫర్ ఎడ్యుకేటర్స్' కోర్సు కాలవ్యవధి 25 నుంచి 45 గంటలు. ఇది పూర్తిగా ఉచితం. దీనిలో సర్టిఫికెట్ కావాలనుకునే వ్యక్తులు నామ మాత్రపు ఫీజు చెల్లించి, ఎంపిక చేసిన కేంద్రాల్లో పరీక్ష రాయాలి. సర్టిఫికెట్ వద్దు అనుకునేవారు ఆన్‌లైన్ కోచింగ్‌తోనే ఆపేయవచ్చు.
- ఏఐ అవగాహన పెంచుకోవాలనుకునేవారు, ఏఐతో తమ బోధన ప్రమాణాలు పెంచుకోవాలనుకునేవారు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి ఎలాంటి ఏఐ, కోడింగ్ అనుభవం అవసరం లేదు. డిజిటల్ లిటరసీ ఉంటే చాలు అని చెబుతున్నారు మద్రాస్ ఐఐటీ డైరెక్టర్ వి.కామకోటి. ఆర్ట్స్, కామర్స్, సైన్స్ ఇలా అన్ని రంగాల వారికీ ఉపయోగ పడేలా ఈ కోర్సును డిజైన్ చేశారు. 2025 అక్టోబర్ 10లోపు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు.

వెబ్‌సైట్: swayamplus.swayam2.ac.in/aiforallcourses

SCHOLARSHIP ALERT

JK Tyre Shiksha Sarthi Scholarship Program

Description: JK Tyre & Industries Limited invites applications from daughters of heavy vehicle drivers who are pursuing general or professional undergraduate or diploma courses and reside in select locations.

Eligibility: Open to female students who are HMV Driver's daughters and are enrolled in general or professional undergraduate or diploma courses.

- Applicants must have secured a minimum of 55% marks in their previous academic year.
- Annual family income must be less than or equal to 5,00,000.
- Applicants must be residents of Rajasthan, Madhya Pradesh, Uttarakhand, Karnataka, and Tamil Nadu.
- Children of employees of JK Tyre and Buddy4Study are not eligible to apply.

Prizes & Rewards: Annual Fixed Scholarship Details:

- Professional Undergraduate Courses: INR 25,000
- General Undergraduate Courses: INR 15,000
- Diploma Courses: INR 15,000

Last Date to Apply: 06-10-2025 ***Application mode:*** Online Application only

Short Url: www.b4s.in/aj/JKTS3

OakNorth STEM Scholarship Programme

Description: The OakNorth STEM Scholarship Programme is an initiative by OakNorth aimed at supporting underprivileged women aspiring to pursue a degree in STEM (Science, Technology, Engineering, Mathematics). This scholarship is available to female students from Haryana, Uttarakhand, and Bihar who have completed their Class 12 and are currently enrolled in a STEM-related undergraduate program (any year) at government colleges or universities.

Eligibility: The scholarship is available to students who are residents of Haryana, Uttarakhand, and Bihar.

- Only female applicants are eligible for consideration.
- Applicants should be enrolled in an undergraduate STEM program (Science, Technology, Engineering, Mathematics) at government universities or colleges in India, regardless of the year of study.
- Candidates must have secured an aggregate of 75% or more in their Class 12 (or equivalent) exam, with at least 65% in the previous class/semester/year (if applicable).
- The annual family income of the applicant should not exceed 3 lakhs.
- Children of Buddy4Study and OakNorth employees are not eligible to apply.

Prizes & Rewards: 30,000 (fixed amount) ***Last Date to Apply:*** 30-09-2025


Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/ONSS4

buddy4study.com

చిత్రజ్యోతి

SINCE 1965



దసరాకు ఇడ్లీకొట్టు

ధనుశ్ హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఇడ్లీ కొట్టు'. డాన్ పిక్చర్స్, వండర్‌బార్ ఫిల్మ్ బేనర్‌పై ఆకాశ్ భాస్కరన్, ధనుశ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఇది ధనుశ్ దర్శకత్వం వహిస్తోన్న నాలుగో చిత్రం కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. దసరా సందర్భంగా తెలుగు, తమిళ్‌లో అక్టోబరు 1న విడుదలవుతోందీ చిత్రం. తెలుగులో వేదక్షర మూవీస్ బ్యానర్‌పై నిర్మాత చింతపల్లి రామారావు విడుదల చేస్తున్నారు. సత్యరాజ్, అరుణ్ విజయ్, నిత్యా మీనన్, షాలినీ పాండే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: జీకే ప్రసన్న, డీఓపీ: కిరణ్‌కౌశిక్, సంగీతం: జీవి ప్రకాశ్‌కుమార్.

సినిమా విడుదలకు అనుమతివ్వలేదు



పాకిస్థాన్ నటుడు ఫవాద్ ఖాన్, బాలీవుడ్ నటి వాణి కపూర్ ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం 'అబీర్ గులాల్'. అయితే ఈనెల 26న సినిమా ఇండియాలో విడుదల కానున్నదనే వార్తలు కొద్ది రోజులుగా బీటౌన్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. తాజాగా ఈ వార్తలు అవాస్తవమని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) పేర్కొంది. ఈ సినిమా విడుదలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేసింది. నిజానికి సినిమా ఈ ఏడాది మే 9న ఇండియాలో విడుదల కావాల్సి ఉంది. అయితే ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి అనంతరం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో విడుదల నిలిచిపోయింది. కాగా, భారతదేశం మినహా ప్రపంచ వ్యాప్తంగా ఈనెల 12న సినిమా విడుదలైంది.



'ఉస్తాద్ భగత్ సింగ్' షూటింగ్ పూర్తి

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్'. శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. 'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తర్వాత పవన్ కల్యాణ్- హరీశ్ శంకర్ కలయికలో వస్తున్న ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై అభిమానుల్లో అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. తాజాగా చిత్రబృందం భారీ షెడ్యూల్‌ను విజయవంతంగా ముగించింది. పవన్ కల్యాణ్ కూడా తన భాగం చిత్రీకరణను పూర్తి చేశారు. త్వరలోనే నిర్మాణాంతర కార్యక్రమాలు మొదలు పెట్టనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

మరో పాట సిద్ధం



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఓజీ'. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై డీవీవీ దానయ్య నిర్మించారు. సినిమా ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. అయితే తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన 'గన్స్ అండ్ రోజెస్' గీతాన్ని నేడు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం పేర్కొంది. తమన్ సంగీతం అందించారు. ఈ సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన స్పెషల్ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది.

ఊర్వశీ రౌతేలాకు ఈడీ సమన్లు



బెట్టింగ్ యాప్స్ కేసులో భాగంగా బాలీవుడ్ నటి ఊర్వశీ రౌతేలాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. '1 ఎక్స్ బెట్' అనే బెట్టింగ్ యాప్ కేసుకు సంబంధించి ఈడీ మంగళవారం ఊర్వశీని విచారించనుంది. నేడు నటి, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మిమి చక్రవర్తి కూడా ఇదే యాప్ కేసు విషయంలో ఈడీ విచారణకు హాజరు కానుంది. కాగా, ఇప్పటికే ఈ కేసు విషయంలో పలువురు సెలబ్రిటీలను ఈడీ విచారించింది.

అలాంటి పాటలు రాయడం చాలా కష్టం



శ్రీమణి

నాగచైతన్య నటించిన '100% లవ్' చిత్రంతో గీతరచయితగా టాలీవుడ్‌లో అడుగుపెట్టారు శ్రీమణి. ఆ తర్వాత వరుస చిత్రాలలో ఆయన రాసిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రస్తుతం 'ఆకాశంలో ఒక తార', 'సంబరాల యేటి గట్టు', 'ఇండియా హౌస్' చిత్రాలకు గీతాలు రాస్తున్న శ్రీమణి, తాజాగా మీడియాతో ముచ్చటించారు. 'అత్తారింటికి దారేది'లో పవన్‌కల్యాణ్ కోసం రాసిన 'ఆరడుగుల బుల్లెట్టు' సాంగ్ నా కెరీర్‌కు ఎంతగానో దోహదపడింది. నాకు కావాల్సిన బ్రేక్ ఇచ్చింది. 'ఎమ్‌సీఏ'లో 'ఎక్కడ ఎక్కడ' పాట వల్ల ప్రేమ పాటలకు ఎక్కువగా రాసే అవకాశం దక్కింది. ఒకప్పుడు పాట ప్రేక్షకులకు చేరువ కావడానికి కొంత సమయం పట్టేది. కానీ ఇప్పుడున్న సోషల్ మీడియా ట్రెండ్ పుణ్యమా అని విన్న వెంటనే నచ్చేయాలి. అలాంటి పాటలు రాయడం గీత రచయితలకు చాలా కష్టం. అయినా ఆ సవాల్‌ను స్వీకరించి పాటను పదేళ్ల పాటు గుర్తుపెట్టుకునేలా రాస్తున్నాం. దర్శకుడు సుకుమార్ నేను ఆరాధించే వ్యక్తుల్లో ఒకరు. 'గీత గోవిందం'లో నేను రాసిన 'వచ్చిందమ్మా' పాట విని ఆయన అభినందించడం చాలా గొప్పగా అనిపించింది. అలాగే దివంగత గేయరచయిత, సిరివెన్నెల సీతారామశాస్త్రి గారు 'మహర్షి' పాట విని బాగా రాశావని ప్రశంసించడం మరిచిపోలేని అనుభూతి' అని చెప్పారు.


కదిలించే సన్నివేశాలతో...



బి గణేశ్, బద్దెల శ్రీనివాస్, నవ్యశ్రీ ప్రధాన పాత్రధారులుగా టీకేఎస్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ప్రేమతో దెయ్యం'. బి కుమారస్వామి నిర్మించారు. తాజాగా చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ 'ఇదో విభిన్న తరహా చిత్రం. ఇందులోని సన్నివేశాలు ప్రేక్షకులను కదిలించేలా ఉంటాయి' అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: డీఆర్ శ్యామ్‌కుమార్, సినిమాటోగ్రాఫర్: శేఖర్, సంగీతం: సీహెచ్ అమ్మ పాండు.

వినోదంతో పాటు ఆలోచింపజేస్తుంది

- రామాంజనేయులు జవ్వాజి



"భద్రకాళి' లాంటి పొలిటికల్ థ్రిల్లర్ ఇప్పటివరకూ రాలేదు. ఈ సినిమాలో మంచి వినోదంతో పాటు ప్రేక్షకులను ఆలోచింపజేసే అంశాలూ ఉన్నాయి. ఇందులో విజయ్ ఆంటోనీ పాత్ర చిత్రణ నవ్యపంథాలో ఉంటుంది' అని నిర్మాత రామాంజనేయులు జవ్వాజి అన్నారు. విజయ్ ఆంటోని కథానాయకుడిగా అరుణ్ ప్రభు దర్శకత్వం వహించిన చిత్రమిది. సర్వంత్‌రామ్ క్రియేషన్స్ బేనర్‌పై రామాంజనేయులు నిర్మించారు. ఈ నెల 19న ఈ చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు.

- విజయ్ ఆంటోనీతో కలసి వరుస చిత్రాలు ప్లాన్ చేశాం. మా కాంబినేషన్‌లో వచ్చిన 'మార్గన్' చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. దానికి మించిన విజయాన్ని ఈ సినిమా అందుకుంటుందని భావిస్తున్నాం. అరుణ్ ప్రభు చెప్పిన లైన్ ఆకట్టుకుంది. ఆయన విజన్ వల్లే సినిమా బాగా వచ్చింది. సమకాలీన సమాజంలో చర్చనీయాంశంగా మారిన ఓ ముఖ్యమైన పాయింట్‌ను తీసుకొని ఆయన కథ రాసుకున్నారు. వాణిజ్య అంశాలకి, సామాజిక అంశాలను కలిపి సినిమా తీయడంలో ఆయనకు ఆయనే సాటి. సినిమా మొదలైన రెండు నిమిషాల్లోనే ప్రేక్షకులు కథలో లీనమైపోతారు. ఆరంభం నుంచి ముగింపు వరకూ ఎక్కడా బోర్ కొట్టదు. ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది.
- 'భద్రకాళి' విజయ్ ఆంటోనికి 25వ సినిమా. మంచి బడ్జెట్‌తో అన్ని హంగులతో తెరకెక్కించాం. విజయ్ పాత్ర సహజత్వానికి దగ్గరగా ఉంటుంది. ప్రస్తుతం తమిళం, మలయాళంలోనూ మా బేనర్‌పై సినిమాలు చేస్తున్నాం. తెలుగులో సత్యదేవ్‌తో 'ఫుల్ బాటిల్', తమిళంలో 'బిచ్చగాడు' దర్శకుడు శశితో విజయ్ ఆంటోని హీరోగా ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నాను.

ఆద్యంతం ఉత్కంఠభరితం



సూపర్ రాజా కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రానికి 'ఇలాంటి సినిమా మీరెప్పుడూ చూసుండరు' అనే టైటిల్‌ను ఖరారు చేసి, ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సూపర్‌రాజా మాటాడుతూ 'సహజత్వానికి దగ్గరగా ఉండే కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాను. ప్రతి ఒక్కరి జీవితానికి దగ్గరగా ఉంటుంది. ఇప్పటివరకూ తెలుగులో రాని విభిన్న కథ, కథనాలతో సినిమాను రూపొందించాం. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది' అని చెప్పారు.

ఆ టైటిల్ మాకే సొంతం



'అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ' పేరుతో వీఎస్ఆర్ ఫిల్మ్స్ సంస్థ బయోపిక్‌ను నిర్మిస్తోంది. దీనికి అచ్చర్ల రాజుబాబు దర్శకత్వం వహిస్తున్నారు ఏఆర్‌టీ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. త్వరలో రెగ్యులర్ షూటింగ్‌ని కూడా ప్రారంభించబోతున్నారు. ప్రస్తుతం నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక జరుగుతోంది. 'అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ' టైటిల్ హక్కులు తమకే సొంతమని, ఫిల్మ్ ఛాంబర్‌లో రిజిస్టర్ చేయించామని వీఎస్ఆర్ ఫిల్మ్స్ సంస్థ పేర్కొంది. మరోవైపు ఎలాంటి టైటిల్ రిజిస్ట్రేషన్ లేకుండానే 'ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ' పేరుతో రవి నారాయణ్ దర్శకత్వంలో ఉషారాణి మూవీస్ బేనర్‌పై వల్లూరి రాంబాబు నిర్మిస్తున్నారని వీఎస్ఆర్ ఫిల్మ్స్ ఆరోపించింది. 'రవి నారాయణ్ గతేడాది టైటిల్ ఇవ్వమని అడిగారు. మేము ఇవ్వడం కుదరదు అని తేల్చి చెప్పాం. అయినా కూడా మా అనుమతి లేకుండానే సినిమా షూటింగ్ చేస్తున్నారు. చట్టపరంగా వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాం' అని వీఎస్ఆర్ ఫిల్మ్స్ సంస్థ తెలిపింది.

మన బంగారాలు మీనాక్షి, జైస్మిన్


మీనాక్షి


జైస్మిన్


నూపుర్

- రెండు స్వర్ణాలు కొల్లగొట్టిన భారత బాక్సర్లు
- నూపుర్‌కు రజతం
- పూజకు కాంస్యం

లివర్‌పూల్ (ఇంగ్లండ్): జైస్మిన్ లంబోరియా, మీనాక్షి హుడా ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో స్వర్ణ పతకాలు కొల్లగొట్టారు. తద్వారా భారత బాక్సింగ్ చరిత్రలో తమ స్థానాలను సుస్థిరం చేసుకున్నారు. జైస్మిన్, మీనాక్షి అద్భుత ప్రతిభతో విదేశీ గడ్డపై పోటీల మహిళా విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన (2-1-1=4 పతకాలు) చేసిన ఘనతను భారత్ అందుకుంది. ఆదివారం జరిగిన మహిళల 57 కి. విభాగం ఫైనల్లో జైస్మిన్ 4-1 స్కోరుతో పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత జూలియా సెజెర్‌మెటా (పోలెండ్)ను చిత్తు చేసి ప్రపంచ విజేతగా ఆవిర్భవించింది. 48 కి. కేటగిరీ తుదిపోరులో మీనాక్షి హుడా 4-1 స్కోరుతోనే పారిస్ విశ్వక్రీడల్లో కాంస్యం సాధించిన నజీమ్ కిజయ్‌బై (కజకిస్థాన్)ను ఓడించి వరల్డ్ టైటిల్ దక్కించుకుంది. ఇక హోరాహోరీగా సాగిన మహిళల 80+కి. స్వర్ణ పతక పోరులో నూపుర్ షెరాన్ 2-3తో కజమరస్కా అగాట (పోలెండ్) చేతిలో ఓడి రజతం కైవసం చేసుకుంది. మహిళల 80 కిలోల విభాగం సెమీఫైనల్లో పూజారాణి 4-1తో సెర్మెటా జూలియా (పోలెండ్) చేతిలో పరాజయం చవిచూడడంతో కాంస్య పతకానికే పరిమితమైంది. మొత్తంగా..ఈసారి వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో భారత మహిళలు రెండు స్వర్ణ, ఒక రజత, ఒక కాంస్యంతో అత్యుత్తమ ప్రదర్శన చేయడం విశేషం. పసిడి పతకాలు సాధించడం ద్వారా..ప్రతిష్ఠాత్మక వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో ఆరు స్వర్ణాలు చేజిక్కించుకున్న మేరీ కోమ్, రెండుసార్లు విజేత నిఖత్ జరీన్, సరితాదేవి, జెనీ ఆర్‌ఎల్, కేసీ లేఖ, నితూ ఘన్హాస్, లవ్లీనా బోర్గొహైన్, స్వీటీ బూరా సరసన మీనాక్షి, జైస్మిన్ చేరారు.



మేఘనకు కాంస్యం

షూటింగ్ వరల్డ్‌కప్

నింగ్బో (చైనా): భారత షూటర్ మేఘన సజ్జనార్ తన కెరీర్‌లో తొలిసారిగా వరల్డ్‌కప్ పతకం సాధించింది. ఆదివారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో ఆమె కాంస్యం అందుకుంది. శనివారం 10 మీ. ఎయిర్ పిస్టల్‌లో ఇషా సింగ్ స్వర్ణం సాధించిన విషయం తెలిసిందే. దీంతో ఈ రెండు పతకాలతో ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్ రైఫిల్/పిస్టల్ ఈవెంట్‌లో భారత్ ఐదో స్థానంలో నిలిచింది. గత ఎనిమిదేళ్లలో తొలిసారి వరల్డ్‌కప్ ఫైనల్‌కు చేరిన మేఘన 230 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. అలాగే చైనాకు చెందిన 16 ఏళ్ల షూటర్ పెంగ్ జిన్ 255.3తో వరల్డ్ రికార్డుతో పసిడి పతకం దక్కించుకుంది. ఇక పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో ఫైనల్‌కు చేరిన కిరణ్ అంకుశ్ జాదవ్ ఎనిమిదో స్థానంలో నిలిచాడు. ఇదే ఈవెంట్‌లో స్వప్నిల్ కుశాలే ఫైనల్ చేరలేకపోయాడు.

రెండో స్థానంలో అర్జున్

సమర్కాండ్ (ఉజ్బెకిస్థాన్): ఫిడే గ్రాండ్ స్విస్ టోర్నమెంట్‌లో ఆదివారం పదో రౌండ్ ముగిసేసరికి ఇరిగేసి అర్జున్ (6) మరో ఆరుగురితో కలిసి రెండో స్థానంలో నిలిచాడు. బ్లూబామ్ (జర్మనీ-6.5) మరో ముగ్గురితో కలిసి టాప్‌లో ఉన్నాడు. పదో రౌండ్‌లో చైనా జీఎం యు యాంగితో తలపడిన అర్జున్ 54వ ఎత్తు వద్ద డ్రా చేసుకున్నాడు. స్థానిక జీఎం నోడిర్బెక్ అబ్దుసత్తోరోవ్‌తో తలపడిన నిహాల్ సరీన్ 53వ ఎత్తు వద్ద డ్రాకి అంగీకరించి రెండో స్థానంలో నిలిచాడు. మహిళల విభాగంలో ముజిచుక్ (ఉక్రెయిన్)పై వైశాలి (6.5) 42 ఎత్తుల్లో నెగ్గి మరో ముగ్గురితో కలిసి ప్రథమ స్థానంలో కొనసాగుతోంది.


భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ పుట్టినరోజు (ఆదివారం) సందర్భంగా దుబాయ్‌లోని హోటల్లో జరిగిన కార్యక్రమంలో అతన్ని అభినందిస్తున్న చాముండేశ్వర్‌నాథ్

పాక్‌ను కుమ్మేశారు

- రాణించిన సూర్య, అభిషేక్, తిలక్
- కుల్దీప్‌నకు మూడు వికెట్లు
- ఆసియాకప్

ఏడు వికెట్లతో టీమిండియా ఘనవిజయం

దేశమంతటా బాయ్‌కాట్ డిమాండ్ గట్టిగా వినిపిస్తున్న వేళ.. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను టీమిండియా కోలుకోలేని దెబ్బకొట్టింది. తమతో ఆట అంత సులువు కాదని చాటి చెబుతూ ఆసియా కప్‌లో పాక్‌పై విజయభేరి మోగించింది. స్పిన్నర్లు కుల్దీప్, అక్షర్ బంతితో చెలరేగితే.. బ్యాటింగ్‌లో అభిషేక్ మెరుపు ఇన్నింగ్స్‌కు సూర్యకుమార్, తిలక్ జత కలవడంతో పాక్ నిర్దేశించిన స్వల్ప స్కోరును భారత్ సులువుగా ఛేదించింది.


సూర్యకుమార్ (47 నాటౌట్)
కుల్దీప్ (3/18)

స్కోరుబోర్డు

పాకిస్థాన్: సయీమ్ (సి) బుమ్రా (బి) హార్దిక్ 0, ఫర్హాన్ (సి) హార్దిక్ (బి) కుల్దీప్ 40, హరీస్ (సి) హార్దిక్ (బి) బుమ్రా 3, ఫకర్ (సి) తిలక్ (బి) అక్షర్ 17, సల్మాన్ (సి) అభిషేక్ (బి) అక్షర్ 3, హసన్ నవాజ్ (సి) అక్షర్ (బి) కుల్దీప్ 5, మహ్మద్ నవాజ్ (ఎల్బీ) కుల్దీప్ 0, ఫహీమ్ (ఎల్బీ) వరుణ్ 11, అఫ్రీది (నాటౌట్) 33, సుఫియాన్ (బి) బుమ్రా 10, అబ్రార్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 20 ఓవర్లలో 127/9; వికెట్ల పతనం:** 1-1, 2-6, 3-45, 4-49, 5-64, 6-64, 7-83, 8-97, 9-111; **బౌలింగ్:** హార్దిక్ 3-0-34-1, బుమ్రా 4-0-28-2, వరుణ్ చక్రవర్తి 4-0-24-1, కుల్దీప్ యాదవ్ 4-0-18-3, అక్షర్ పటేల్ 4-0-18-2, అభిషేక్ 1-0-5-0.

భారత్: అభిషేక్ (సి) ఫహీమ్ (బి) సయీమ్ 31, గిల్ (స్టంప్డ్) హరీస్ (బి) సయీమ్ 10, సూర్యకుమార్ (నాటౌట్) 47, తిలక్ (బి) సయీమ్ 31, శివమ్ దూబే (నాటౌట్) 10, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 15.5 ఓవర్లలో 131/3; వికెట్ల పతనం:** 1-22, 2-41, 3-97; **బౌలింగ్:** అఫ్రీది 2-0-23-0, సయీమ్ 4-0-35-3, అబ్రార్ 4-0-16-0, మహ్మద్ నవాజ్ 3-0-27-0, సుఫియాన్ 2.5-0-29-0.

ఆసియా కప్‌లో నేటి మ్యాచ్‌లు
యూఏఈ x ఒమన్ (సా.5.30)
శ్రీలంక x హాంకాంగ్ (రా.8.00)

దుబాయ్: ఆసియాకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు దూసుకెళ్తోంది. పాకిస్థాన్‌పై తమ ఆధిపత్యాన్ని చాటుకుంటూ ఆదివారం గ్రూప్ 'ఎ'లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో ఏడు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. సూర్యకుమార్ (37 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 47 నాటౌట్) అజేయంగా నిలిచాడు. తాజా టోర్నీలో భారత్‌కిది వరుసగా రెండో విజయం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 127 పరుగులు చేసింది. ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ (44 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 40), షహీన్ అఫ్రీది (16 బంతుల్లో 4 సిక్సర్లతో 33 నాటౌట్) ఆకట్టుకున్నారు. స్పిన్నర్ కుల్దీప్‌నకు మూడు.. అక్షర్, బుమ్రాలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో భారత్ 15.5 ఓవర్లలో 3 వికెట్లకు 131 పరుగులు చేసి నెగ్గింది. అభిషేక్ (13 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 31), తిలక్ (31 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 31) రాణించారు. సయీమ్‌కు 3 వికెట్లు లభించాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా కుల్దీప్ యాదవ్ నిలిచాడు. ఇక.. గతంలో మాదిరిగా ఈ మ్యాచ్‌పై అభిమానుల్లో అమితోత్సాహం కనిపించలేదు. అలాగే దుబాయ్ స్టేడియాన్ని కమ్మేసే సెలెబ్రిటీల హంగామాగానీ అసలే కనిపించలేదు.

దూకుడుతో మొదలు..

స్వల్ప ఛేదనను భారత్ మెరుపు వేగంతో ఆరంభించడంతో పవర్‌ప్లేలోనే సగం స్కోరందుకుంది. ఇన్నింగ్స్ తొలి రెండు బంతులనే ఓపెనర్ అభిషేక్ శర్మ 4,6గా మలిచాడు. అటు గిల్ (10) తర్వాతి ఓవర్‌లోనే రెండు వరుస ఫోర్లు సాధించినా సయీమ్ అయూబ్ క్యారమ్ బాల్‌కు స్టంపౌట్ అయ్యాడు. ఇక షహీన్ ఓవర్‌లో అభిషేక్ మరోసారి 4,6తో ధాటిని కనబర్చాడు. అయితే తను కూడా సయీమ్ అయూబ్‌కే చిక్కాడు. నాలుగో ఓవర్‌లో రెండు వరుస ఫోర్లు సాధించిన అభిషేక్ లాంగాఫ్‌లో అష్రాఫ్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఇక తిలక్ ఆరో ఓవర్‌లో 13 రన్స్ అందించడంతో జట్టు 61/2 స్కోరుతో పటిష్ఠ స్థితిలో నిలిచింది. అనంతరం స్పిన్నర్లు అబ్రార్, సుఫియాన్ కట్టడి చేయడంతో సూర్య, తిలక్ కాసేపు ఆచితూచి ఆడారు. అయితే డ్రింక్స్ బ్రేక్‌కు ముందు తిలక్ 6,4తో బ్యాట్‌కు పనిజెప్పాడు. చక్కగా కుదురుకున్న ఈ జోడీని మళ్లీ సయీమ్ విడదీశాడు. 13వ ఓవర్‌లో అద్భుతంగా టర్న్ అయిన బంతికి తిలక్ బౌల్డ్ కావడంతో, మూడో వికెట్‌కు 56 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ దశలో సూర్య వేగం పెంచాడు. గతంలో పాక్‌పై ఎన్నడూ 20+ రన్స్ దాటని తను ఈసారి ఆ అడ్డంకిని అధిగమిస్తూ వరుస ఫోర్లతో చెలరేగాడు. దూబే (10 నాటౌట్)తో కలిసి నాలుగో వికెట్‌కు అజేయంగా 34 రన్స్ జోడించిన సూర్య ఓ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాడు.

దెబ్బతీసిన స్పిన్నర్లు

టాస్ గెలిచిన పాక్ జట్టు కెప్టెన్ సల్మాన్ భారీ స్కోరు సాధించాలనే ఆలోచనతో బ్యాటింగ్ ఎంచుకున్నాడు. కానీ అతడి వ్యూహం దారుణంగా బెడిసికొట్టింది. క్రీజులోకి దిగిన ప్రతీ బ్యాటర్ ఎదురుదాడికి దిగే ప్రయత్నంలో చకచకా పెవిలియన్‌కు చేరారు. భారత స్పిన్‌త్రయం ఆరు వికెట్లను నేలకూల్చగా.. ఓపెనర్ ఫర్హాన్ ఒక్కడే దీటుగా ఆడాడు. అయితే ఆఖర్లో షహీన్ షా చెలరేగి ఊరటనిచ్చాడు. ఇన్నింగ్స్ తొలి బంతికే ఓపెనర్ సయీమ్ అయూబ్‌ను హార్దిక్ గోల్డెన్ డకౌట్ చేశాడు. ఇక రెండో ఓవర్‌లో మహ్మద్ హారిస్ (3)ను బుమ్రా అవుట్ చేయడంతో ఆరు పరుగులకే పాక్ రెండు వికెట్లు కోల్పోయింది. ఈ స్థితిలో మరో ఓపెనర్ ఫర్హాన్, ఫఖర్ జమాన్ (17) జోడీ ఆదుకునే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా ఫర్హాన్ భారత బౌలర్లను ఇబ్బంది లేకుండా ఎదుర్కొన్నాడు. మూడో ఓవర్‌లో ఫఖర్ రెండు ఫోర్లతో 13 రన్స్ వచ్చాయి. ఇక బుమ్రా రెండు వరుస ఓవర్లలోనూ ఫర్హాన్ రెండు సిక్సర్లతో ఆకట్టుకున్నాడు. వాస్తవానికి పాక్‌తో ఆడిన చివరి ఐదు టీ20ల్లో బుమ్రా కనీసం ఒక్క సిక్సర్‌ను కూడా ఇవ్వలేదు. వీరి జోరుతో పవర్‌ప్లేలో జట్టు 42/2 స్కోరుతో ఫర్వాలేదనిపించింది. కానీ ఆ తర్వాత స్పిన్నర్ల రాకతో పాక్ కష్టాలు పెరిగాయి. కాస్త కుదురుకున్న ఫఖర్ జమాన్‌ను అక్షర్ అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 39 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కెప్టెన్ సల్మాన్ (3)ను కూడా అక్షర్ అవుట్ చేయగా, 13వ ఓవర్‌లో కుల్దీప్ వరుస బంతుల్లో హసన్ (5), నవాజ్ (0)లను వెనక్కి పంపాడు. మరో ఎండ్‌లో ఓపిగ్గా క్రీజులో నిలిచిన ఫర్హాన్‌ను సైతం కుల్దీప్ దెబ్బతీయడంతో పాక్ 83 రన్స్‌కే 7 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో వంద పరుగులు కూడా కష్టమే అనిపించింది. అయితే షహీన్ షా వచ్చీ రావడంతోనే భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. ఆఖరి ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లతో 16 రన్స్ అందించాడు. దీంతో పాక్ కాస్త పోరాడగలిగే స్కోరందుకుంది. అలాగే జట్టు మొత్తంగా 63 డాట్ బాల్స్‌ను ఆడడం గమనార్హం.

నో షేక్‌హ్యాండ్స్



పాక్‌తో మ్యాచ్ ఆడడంపై దేశంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన విషయం తెలిసిందే. దీన్ని దృష్టిలో ఉంచుకుని భారత ఆటగాళ్లు కూడా వారితో అంటీముట్టనట్టుగా మెలిగారు. వారితో మాట్లాడడం కాదు కదా.. కనీసం షేక్ హ్యాండ్ ఇచ్చేందుకు కూడా ఇష్టపడలేదు. టాస్ సమయంలోనూ పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా, భారత్ కెప్టెన్ సూర్యకుమార్ కరచాలనం చేసుకోలేదు. అలాగే సూర్య సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాక పాక్ ప్లేయర్లను కలవకుండానే దూబేతో కలిసి చకచకా పెవిలియన్‌కు వెళ్లిపోయాడు. అటు పాక్ ఆటగాళ్లు భారత డగౌట్ వైపు వచ్చినా భారత క్రికెటర్లు మాత్రం బయటికి రాలేదు. ఈ విషయమై పాక్ కోచ్ మైక్ హెస్సెన్ మ్యాచ్ అధికారులతో మాట్లాడుతూ అసహనం ప్రదర్శించడం కనిపించింది.

100 మీటర్ల విజేతలు.. మెలిస్సా, సెవిల్లె

ప్రపంచ అథ్లెటిక్స్


మెలిస్సా


సెవిల్లె

టోక్యో: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో అత్యంత ఆసక్తి రేకెత్తించిన 100 మీటర్ల రేసులో కొత్త చాంపియన్లు అవతరించారు. పురుషుల వంద మీటర్ల టైటిల్‌ను జమైకాకు చెందిన 24 ఏళ్ల ఒబ్లిక్ సెవిల్లె ఎగరేసుకుపోయాడు. ఫైనల్ రేసును సెవిల్లె 9.77 సెకన్లలో ముగించాడు. ఈ క్రమంలో ఉసేన్ బోల్ట్ తర్వాత ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పురుషుల 100 మీటర్ల స్వర్ణం నెగ్గిన జమైకా అథ్లెట్‌గా సెవిల్లె చరిత్రకెక్కాడు. జమైకాకే చెందిన ఫేవరెట్ కిషానె థాంప్సన్ 9.82 సెకన్ల టైమింగ్‌తో రెండోస్థానంలో నిలిచి రజతంతో సరిపెట్టుకున్నాడు. ఇక, టైటిల్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న అమెరికా స్టార్ నోవా లైల్స్ (9.89 సెకన్లు) మూడో స్థానంతో కాంస్యానికి పరిమితమయ్యాడు. పారిస్ ఒలింపిక్స్ మహిళల 100 మీటర్లలో కాంస్య పతకం గెలిచిన అమెరికా యువ కెరటం మెలిస్సా జెఫర్సన్ వుడెన్.. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మాత్రం స్వర్ణంతో మెరిసింది. పారిస్ విశ్వక్రీడల చాంప్ జులియన్ అల్‌ఫ్రెడ్, షెకారి రిచర్డ్‌సన్, షెరికా జాక్సన్‌లాంటి స్టార్లను వెనక్కి నెడుతూ 24 ఏళ్ల మెలిస్సా ఫైనల్లో 10.61 సెకన్ల టైమింగ్‌తో తొలిసారి విజేతగా నిలిచింది. జమైకా అథ్లెట్ టినా క్లేటన్ (10.76 సెకన్లు) రజతం దక్కించుకోగా, సెయింట్ లూసియాకు చెందిన జులియన్ అల్‌ఫ్రెడ్ (10.84 సెకన్లు) కాంస్యానికి పరిమితమైంది. తనకు ఇదే చివరి ప్రపంచ చాంపియన్‌షిప్ అని ప్రకటించిన జమైకా దిగ్గజ అథ్లెట్, 38 ఏళ్ల షెల్లీ ఆన్‌ఫ్రేజర్ (11.03 సె) ఆరో స్థానంలో నిలిచింది. షెరికా జాక్సన్ (జమైకా- 10.88 సె), షకారి రిచర్డ్‌సన్ (అమెరికా- 10.94 సె) వరుసగా నాలుగు, ఐదు స్థానాలతో సరిపెట్టుకున్నారు.

భారత్ షెడ్యూల్ నేడు

ఉ. 7 గం.: మహిళల 3 వేల మీటర్ల స్టీపుల్‌చేజ్ హీట్స్ - పారుల్ చౌదరి, అంకితా ధ్యాని; **సా. 4.10 గం:** పురుషుల లాంగ్ జంప్ క్వాలిఫికేషన్స్ - మురళీ శ్రీశంకర్; **సా. 4.53 గం:** పురుషుల 110 మీటర్ల హర్డిల్స్ హీట్స్ - తేజాస్ షిర్సే

హైజంప్ ఫైనల్‌కు సర్వేశ్



ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్ సర్వేశ్ అనిల్ కుశారె హైజంప్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లాడు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో రెండు గ్రూప్‌ల నుంచి ఓవరాల్‌గా సంయుక్తంగా తొమ్మిదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు. తద్వారా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో హైజంప్ ఫైనల్ చేరిన తొలి భారత అథ్లెట్‌గా 30 ఏళ్ల సర్వేశ్ రికార్డు సృష్టించాడు. ఇక, పురుషుల 10వేల మీటర్ల రేస్‌లో పోటీపడ్డ గుల్వీర్ సింగ్ 29 నిమిషాల 13.33 సెకన్ల టైమింగ్‌తో 16వ స్థానంలో నిలిచి నిరాశపరిచాడు.

రన్నరప్‌తో సరి

హాంకాంగ్ ఓపెన్

ఫైనల్లో లక్ష్య, సాత్విక్-చిరాగ్ జోడీ ఓటమి





హాంకాంగ్: హాంకాంగ్ ఓపెన్ సూపర్ 500 టోర్నీలో భారత షట్లర్లు ఆఖరి మెట్టుపై బోల్తా పడ్డారు. ఆదివారం జరిగిన సింగిల్స్ ఫైనల్లో లక్ష్య సేన్, డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ శెట్టి ద్వయం పరాజయం పాలై రన్నరప్‌గా నిలిచారు. రెండేళ్లలో తొలిసారి ఓ మేజర్ టోర్నీ ఫైనల్‌కు చేరిన లక్ష్య వరల్డ్ నెంబర్ 4 లి షి ఫెంగ్‌పై 15-21, 12-21 తేడాతో ఓడాడు. తొలి గేమ్‌లో 4-0తో ఆధిపత్యం చూపినా.. ఆ తర్వాత ఫెంగ్ జోరు ముందు నిలువలేకపోయాడు. రెండో గేమ్‌లోనూ 4-1తో చక్కటి అవకాశం వచ్చినా మరోసారి పట్టు కోల్పోయాడు. ర్యాలీ, క్రాస్ కోర్ట్ స్మాష్‌లతో విరుచుకుపడిన ఫెంగ్ సులువుగానే మ్యాచ్‌ను పూర్తి చేశాడు. మరోవైపు 16 నెలల తర్వాత ఓ టోర్నీ ఫైనల్ ఆడిన సాత్విక్-చిరాగ్ సైతం చక్కటి అవకాశాన్ని చేజార్చుకున్నారు. ఒలింపిక్ రజతం సాధించిన లియాంగ్ వీ కెంగ్-వాంగ్ చాంగ్ (చైనా) ద్వయంతో 61 నిమిషాల పాటు జరిగిన పోరులో 21-19, 14-21, 17-21 తేడాతో భారత్ జోడీ ఓటమి పాలైంది. ఉత్కంఠగా సాగిన తొలి గేమ్‌లో ఆధిపత్యం చూపిన సాత్విక్-చిరాగ్ టైటిల్‌కు చేరువగా వచ్చారు. కానీ కీలక రెండో గేమ్‌లో అదే జోరును చూపడంలో విఫలం కాగా.. నిర్ణాయక చివరి గేమ్‌లోనైతే 2-11తో వెనుకబడ్డారు. ఆ తర్వాత కాస్త పుంజుకున్నా చైనీస్ జోడీ పవర్‌ఫుల్ స్మాష్, సూపర్ నెట్ గేమ్‌తో చాంపియన్‌గా నిలిచింది.

ఆసీస్‌దే తొలి వన్డే

8 వికెట్లతో భారత మహిళల ఓటమి


కెప్టెన్ హర్మన్

ముల్లన్‌పూర్ (న్యూ చండీగఢ్): లిచ్‌ఫీల్డ్ (88), బెత్ మూనీ (77 నాటౌట్), అనాబెల్ సదర్లాండ్ (54 నాటౌట్) హాఫ్ సెంచరీలతో మెరిసిన వేళ భారత మహిళలతో మూడు వన్డేల సిరీస్‌లో ఆస్ట్రేలియా ఘనమైన బోణీ చేసింది. ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో ఎనిమిది వికెట్లతో విజయం సాధించింది.. టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 281/7 స్కోరుకు పరిమితమైంది. ప్రతికా రావల్ (64), మంధాన (58), హర్లీన్ (54) అర్ధ శతకాలు చేశారు. ఛేదనలో ఆస్ట్రేలియా 44.1 ఓవర్లలో 282/2 స్కోరు చేసి నెగ్గింది. రెండో వన్డే బుధవారం ఇక్కడే జరగనుంది.

సంక్షిప్తస్కోర్లు: భారత్ 50 ఓవర్లలో 281/7 (ప్రతికా రావల్ 64, స్మృతి మంధాన 58, హర్లీన్ డియోల్ 54, మేఘన్ షూట్ 2/45, అలానా కింగ్ 1/28, సదర్లాండ్ 1/31, తహిలా మెక్‌గ్రాత్ 1/33); **ఆస్ట్రేలియా 44.1 ఓవర్లలో 282/2** (లిచ్‌ఫీల్డ్ 88, బెత్ మూనీ 77 నాటౌట్, సదర్లాండ్ 54 నాటౌట్, పెర్రీ (33 రిటైర్డ్ హర్ట్) స్నేహ్ రాణా 1/51, క్రాంతి గౌడ్ 1/55)




అయ్యో.. అమ్మాయిలు!

ఆసియా కప్ హాకీ

- ఫైనల్లో చైనా చేతిలో ఓడిన భారత్
- ప్రపంచ కప్ బెర్త్ మిస్

హాంగ్జౌ (చైనా): ఆసియా కప్ రూపంలో ప్రపంచ కప్‌నకు నేరుగా అర్హత సాధించే అద్భుత అవకాశాన్ని భారత హాకీ అమ్మాయిలు చేజార్చుకున్నారు. ఆసియా కప్‌లో ఆరంభం నుంచి అద్భుత ప్రదర్శన కనబరచి టైటిల్‌పై ఆశలు కల్పించిన మనోళ్లు.. తుది మెట్టుపై బోల్తా పడ్డారు. ఆదివారం ఇక్కడ జరిగిన ఫైనల్లో భారత్ 1-4తో ఆతిథ్య చైనా చేతిలో పరాజయంపాలై రన్నరప్‌తో సరిపెట్టుకుంది. భారత క్రీడాకారిణి నవ్‌నీత్ కౌర్ మ్యాచ్ మొదలైన నిమిషానికే పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచింది. చైనా తరఫున జిగ్జియా వూ (21వ నిమిషంలో), హోంగ్ లి (41వ), మీరోంగ్ జూ (51వ), జియాకి జోంగ్ (53వ) తలో గోల్ సాధించి జట్టును చాంపియన్‌గా నిలిపారు. టైటిల్ నెగ్గడంతో చైనా.. వచ్చే ఏడాది బెల్జియం, నెదర్లాండ్స్ వేదికలుగా జరిగే ప్రపంచ కప్‌లో నేరుగా పోటీపడనుంది. చైనాకు ఇది మూడో ఆసియా కప్ టైటిల్. గతంలో 1989, 2009లో చైనా చాంపియన్‌గా నిలిచింది.



బరువు ఎక్కువై.. అనర్హతకు గురై

ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ నుంచి అమన్ అవుట్

జాగ్రెబ్ (క్రొయేషియా): ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో ఆదివారం భారత్‌కు నిరాశే ఎదురైంది. కచ్చితంగా పతకం సాధిస్తాడనుకున్న పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత అమన్ సెహ్రావత్ (57 కిలోలు) అనూహ్యంగా తన పోటీకి ముందే అనర్హతకు గురవడం గమనార్హం. ఆదివారం పోటీకి ముందు రెజ్లర్ల బరువు తూచే క్రమంలో అమన్ నిర్ణీత బరువు కన్నా 1.7 కిలోలు అధికంగా ఉన్నట్టు నిర్వాహకులు గుర్తించారు. దీంతో నిబంధనల ప్రకారం అమన్‌పై టోర్నీలో పాల్గొనకుండా అనర్హత విధించారు. ఫలితంగా ఒక్క బౌట్ కూడా ఆడకుండానే అమన్ నిరాశగా వెనుదిరిగాడు. ఇక.. మిగతా భారత రెజ్లర్లలో దీపక్ పూనియా (92 కిలోలు) తొలి రౌండ్ గెలిచినా, రెండో రౌండ్లో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించగా.. వికాస్ సింగ్ (74 కి), అమిత్ (79 కి) ఆరంభ బౌట్లలోనే పరాజయం పాలయ్యారు. తొలి రౌండ్లో ఓడిన ముకుల్ దహియా (86 కిలోలు).. ప్రత్యర్థి ఫైనల్ చేరడంతో దక్కిన రెపిచేజ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. అతను రెపిచేజ్‌లో గెలిచి కాంస్య పతక పోరుకు అర్హత సాధించాడు.

గెలుపు దిశగా 'సెంట్రల్'

సౌత్‌జోన్‌తో దులీప్ ట్రోఫీ

బెంగళూరు: దులీప్ ట్రోఫీని 11 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత సొంతం చేసుకునేందుకు సెంట్రల్‌జోన్ 65 పరుగుల దూరంలో నిలిచింది. ఆటకు నాలుగో రోజైన ఆదివారం సౌత్‌జోన్ మిడిలార్డర్ బ్యాటర్లు అంకిత్ శర్మ, సిద్ధార్థ్ అద్భుతమైన పోరాటంతో ఏడో వికెట్‌కు 192 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దీంతో దక్షిణాది జట్టు 426 పరుగులకు ఆలౌటైంది. సెంట్రల్‌జోన్ బౌలర్లలో కార్తికేయ 4, సారాంశ్ జైన్ 3 వికెట్లు దక్కాయి. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో సౌత్‌జోన్ 149, సెంట్రల్‌జోన్ 511 పరుగులు చేశాయి.

విమోచన వర్చువల్ మ్యూజియం అద్భుతం

- ప్రజాపోరాటాలను కళ్లకు కట్టారు: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- మజ్లిస్ అంటే బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు భయం: కిషన్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సికింద్రాబాద్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నిజాం పాలనలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, నాడు జరిగిన ప్రజాపోరాటాలను కళ్లకు కట్టినట్టు చూపించేలా ఏర్పాటు చేసిన వర్చువల్ మ్యూజియం అద్భుతమని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. తన సొంత రాష్ట్రమైన త్రిపుర చరిత్రను కూడా ఈ విధంగా ప్రదర్శించాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికి సూచన చేస్తానని తెలిపారు. సెప్టెంబరు 17న నిర్వహించనున్న హైదరాబాద్ విమోచన దినోత్సవంలో భాగంగా పరేడ్ గ్రౌండ్‌లో ఫొటో ఎగ్జిబిషన్, వర్చువల్ మ్యూజియంను ఏర్పాటు చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి ఆదివారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ ప్రదర్శనలను ప్రారంభించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహించేలా చొరవ తీసుకున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అభినందనీయులని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ మజ్లిస్ పార్టీకి భయపడి బీఆర్ఎస్, కాంగ్రెస్ విమోచన దినోత్సవాన్ని నిర్వహించలేదని ఆరోపించారు. తాను కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు విమోచన వేడుకల ఆవశ్యకతను ప్రధానికి వివరించానని తెలిపారు. ఈనెల 17న రాష్ట్రంలోని ప్రజలంతా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి విమోచన వేడుకలను ఘనంగా జరపాలనిపిలుపునిచ్చారు. ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, మల్క కొమరయ్య, అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పాల్గొన్నారు.

సెప్టెంబరు 17ను 'విలీన దినోత్సవం'గా జరపాలి

- సీఎం రేవంత్‌కు కూనంనేని లేఖ

హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు 17ను 'తెలంగాణ విలీన దినోత్సవం'గా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. గతేడాది దీనిని తెలంగాణ ప్రజా పరిపాలన దినోత్సవంగా నిర్వహించారని, కానీ అది చారిత్రక పోరాట స్ఫూర్తిని సరిగా ప్రతిబింబించలేదని కూనంనేని ఆ లేఖలో పేర్కొన్నారు. అంతేకాకుండా, తెలంగాణ స్వాతంత్ర్య, రైతాంగ సాయుధ పోరాటాల చరిత్రను రాష్ట్ర, జాతీయ పాఠ్యాంశాలలో చేర్చాలని ఆయన కోరారు.

భారత సంస్కృతికి ప్రతిరూపం హిందీ: సంజయ్



హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): 'హిందీ ఒక భాష మాత్రమే కాదు. కోట్లాది మంది భారతీయుల భావోద్వేగాలు, సంస్కృతికి ప్రతిరూపం' అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. హిందీ రాజ భాష కావడంతో ప్రభుత్వ విభాగాల్లో సమన్వయం వచ్చిందన్నారు. విదేశాల్లో కూడా కోట్లాది మంది హిందీ మాట్లాడుతున్నారని, ఐక్యరాజ్య సమితి వంటి వేదికలపై ఈ భాషకు వచ్చిన అంగీకారం, భారతదేశ సాంస్కృతిక శక్తికి ప్రతీక అని వ్యాఖ్యానించారు. 'హిందీ దివస్'ను పురస్కరించుకుని ఆదివారం అహ్మదాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో పాటు సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'భాష అనేది కేవలం సంభాషణ సాధనం కాదు. అది మన సంస్కృతి, సంప్రదాయాల సంరక్షకురాలు. ఆత్మనిర్భర భారతావనికి అతి పెద్ద శక్తి దాని స్థానిక, మాతృభాషలే. మాతృ భాష మన హృదయానికి అత్యంత చేరువైనది. విదేశీ భాషలు మన జ్ఞానం, అవకాశాలను విస్తరిస్తాయి. ప్రతి భాషను సంరక్షించడం, గౌరవించడం మన కర్తవ్యం' అని అన్నారు.

కొండపల్లి సీమలో కాకతీయం

(మొదటిపేజీ తరువాయి)

కనుగొన్నారు. విజయవాడ సమీపంలోని కొండపల్లి ప్రాంతంలోని 'కాకర్తి' అనే గ్రామంలోనే 'కాకతీయ గుండన' మూలాలు ఉన్నట్లు నిర్ధారించారు. ఇటీవల తెలంగాణలోని నేలకొండపల్లిలో బయటపడిన రాగిఫలకాల శాసనాలను విశ్లేషించి ఈ నిర్ధారణకు వచ్చారు. అయితే... 'కాకర్తి' పేరుతో ప్రస్తుతం ఈ ప్రాంతంలో గ్రామమేదీ లేదు. కాలక్రమంలో దాని పేరు మారి ఉండొచ్చు. లేదా... ఏదైనా కారణాలవల్ల ఆ గ్రామం కాలగర్భంలో కలిసిపోయి ఉండొచ్చుననే అనుమానాలున్నాయి. ఇప్పుడు చరిత్రకారులు 'కాకర్తి' క్షేత్రస్థాయిలో గుర్తించడంపైనా దృష్టి సారించారు. ఒకప్పుడు 'కొండపల్లి సీమ'లో భాగమైన నందిగామ మండలం మాగల్లు సమీపంలో కాకర్తి (కాకతిపురం, కాకర్త్యపురం) ఉండొచ్చనని పురావస్తు శాస్త్రవేత్త ఈమని శివనాగిరెడ్డి తెలిపారు.

చారిత్రక ఆనవాళ్లు...

క్రీస్తు శకం 900 సంవత్సరానికి ముందు కాకర్తి గ్రామం ఉండేదని తెలుస్తోంది. కాకతీయుల వంశ ఆదిపురుషుడు కాకతీయ గుండన కాకర్తిలో నివసించాడని, కాకతీయుల పూర్వీకులు సకలేశ్వర, బిజ్జేశ్వర, గుండేశ్వర వంటి దేవాలయాలను నిర్మించారని ఫలకాలు చెబుతున్నాయి. కొండపల్లి, సమీపంలోని బొజ్జప్రోలు ప్రాంతాలు కాకతీయ రాజవంశం జన్మభూమిగా రాగిఫలకాలు నిర్ధారిస్తున్నాయి. రాష్ట్రకూటుల హయాంలో సామంతులుగా ఉన్న కాకతీయుల వంశపారంపర్యాన్ని ఈ రాగి ఫలకాలు వెలుగులోకి తెచ్చాయి. ఈ శాసనాల ప్రకారం కాకతీయుల వంశవృక్షం గుండ-1 (కాకతీయ గుండన), గుండ-2, గుండ-3, ఎర్రలతో మొదలైంది. ఆ తర్వాత


కాకతీయుల పూర్వీకుడు గుండన కొండపల్లి ప్రాంత వాసిగా నిర్ధారిస్తూ తామ్ర ఫలకంపై లిఖించిన శాసనం

ఎర్ర కుమారులు బేటియా, గుండయ్య, గోనకలు అధిపతులుగా ఉన్నారు. కొండపల్లి సీమను గుండన, బొజ్జప్రోలును బేటియా పర్యవేక్షించారని శాసనాలు చెబుతున్నాయి. ఇటీవల ఎన్టీఆర్ జిల్లాకు సరిహద్దున ఉన్న నేలకొండపల్లిలో ముస్లిం శ్మశానవాటికలో వేంగి చాళుక్యులకు సంబంధించి తొమ్మిది సెట్ల రాగి ఫలకాలు లభించాయి. ఇవి 9, 10వ శతాబ్దాలకు చెందిన కాకతీయుల చారిత్రక మూలాలను వెలుగులోకి తెచ్చాయి. రాగిఫలకాల సెట్లలో వేంగి చాళుక్యుల రాజవంశావళి వివరాలు, ఆలయ దానధర్మాలు ఉన్నాయి. భారత పురావస్తు సర్వే డైరెక్టర్ కె.మునిరత్నం వీటిని ముందుగా అధ్యయనం చేసి ప్రపంచానికి కాకతీయుల జన్మస్థలాన్ని పరిచయం చేశారు. రెండో సెట్ రాగి ఫలకాల్లో క్రీస్తుశకం 918లో చాళుక్య పాలకుడైన రెండో విక్రమాదిత్య పట్టాభిషేకం నేపథ్యంలో కాకతీయుల తొలి వంశావళి గురించి ప్రస్తావించారు. కాకతీయ గుండన కొండపల్లి సీమ వాసి అని ఈ శాసనాల్లో ఉంది.

కొండపల్లి సీమ.. ఒకప్పటి పాలనా కేంద్రం

శతాబ్దాల కిందట కొండపల్లి సీమలో వేసిన పునాదులపైనే కాకతీయ ప్రాభవం నడిచిందని ఇప్పుడు తెలుస్తోంది. కాకతీయుల వారసత్వం క్రీ.శ 972 తర్వాత ఓరుగల్లుకు పాకింది. కాకతీయులు ఓరుగల్లుకు మారటానికి ముందు కొండపల్లి ప్రాంతంలో కీలకంగా వ్యవహరించారు. కాకతీయులు క్రీస్తు శకం 900 తర్వాత కాలంలో రాష్ట్రకూటులకు సామంతులుగా ఉండేవారు. ఆ తర్వాత కళ్యాణి చాళుక్యులకు సామంతులుగా ఉండి క్రమంగా ప్రబలశక్తిగా మారి కాకతీయ సామ్రాజ్యాన్ని విస్తరించారు. కాకతీయులు ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలను కూడా పాలించారు. ప్రాచీన పల్నాడు ప్రాంతం వారి సామ్రాజ్యంలో ఉండేది. ప్రస్తుత గుంటూరు జిల్లాలో రాణిరుద్రమ కాలం నాటి పలు చారిత్రక శాసనాలు ఎన్నో వెలుగుచూశాయి. యుద్ధాలు, పరిపాలనా విధానాలు, రుద్రమదేవి మరణానికి సంబంధించిన ముఖ్యమైన ఆధారాలు లభించాయి. గుంటూరు జిల్లాలోని ఈపూరు, చందుపట్లలో రుద్రమదేవి మరణానికి సంబంధించిన శాసనాలను కనుగొన్నారు. రాణిరుద్రమ తన భర్త చనిపోయినపుడు ప్రస్తుత ఎన్టీఆర్ జిల్లాలోని గుడిమెట్ల కృష్ణానదీ తీరంలో నిద్ర చేసిందన్న ఆధారాలు ఉన్నాయి.

యోగా గురువుపై వలపు వల

(మొదటిపేజీ తరువాయి)

రెండేళ్లుగా చేవెళ్ల మండలం దామరగిద్ద గ్రామంలో 'సీక్రెట్ ఆఫ్ నేచర్స్' పేరిట యోగా కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. నెలలో 10 రోజుల పాటు ఆహార అలవాట్లు, ఆరోగ్యం, యోగాపై శిక్షణ ఇస్తారు. హైదరాబాద్ నగరానికి చెందిన అమర్ అనే వ్యక్తి.. వెంకటరంగారెడ్డి నుంచి సొమ్ము లాగాలని ప్రణాళిక వేశాడు. మంజుల, రజని అనే ఇద్దరు మహిళలతో యోగా గురువు వద్దకు వెళ్లారు. వారికి అనారోగ్య సమస్యలు ఉన్నాయని,యోగాతో సాంత్వన కల్పించాలని కోరి ఆశ్రమంలో చేర్పించాడు. ఆ ఇద్దరు మహిళలు ప్లాన్ ప్రకారం.. యోగా గురువుకు దగ్గరై, క్రమంగా సన్నిహితంగా ఉండటం ప్రారంభించారు. ఆ సమయంలో ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. వాటిని అమర్‌కు పంపించారు. అమర్ ముఠా.. ఈ ఫొటోలు, వీడియోలను అడ్డం పెట్టుకుని యోగా గురువుపై బ్లాక్‌మెయిల్‌కు దిగారు. అడిగినంత డబ్బు ఇవ్వకుంటే.. వాటిని బయటపెట్టి పరువు తీస్తామని, ఆశ్రమానికి చెడ్డ పేరు వస్తుందని బెదిరించారు. దీనిపై ఆందోళన చెందిన యోగా గురువు.. రూ.50 లక్షలు చెక్కుల రూపంలో ఇచ్చారు. అది సరిపోదని, రూ.2 కోట్లు ఇవ్వాలని అమర్ ముఠా మళ్లీ బ్లాక్ మెయిలింగ్ మొదలుపెట్టింది. దీనితో ఆయన పోలీసులను ఆశ్రయించగా.. వారు డెకాయ్ ఆపరేషన్ చేపట్టారు. డబ్బులు ఇస్తానని, హైదరాబాద్ శివార్లలోని తారామతి బారాదరి వద్దకు రావాలని అమర్ ముఠాకు యోగా గురువుతో ఫోన్ చేయించారు. ముఠా సభ్యులు అమర్, మంజుల, రజని, మౌలాలి, రాజేశ్ తారామతి బారాదరి వద్దకు వచ్చి యోగా గురువును బెదిరిస్తుండగా.. పక్కనే మాటువేసిన గోల్కొండ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.ఈ ముఠా గతంలో ఏవైనా నేరాలకు పాల్పడిందా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.


ఆర్ అండ్ బీ ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

ఆర్ అండ్ బీ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్. శ్రీను

హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. శ్రీను ఎన్నికయ్యారు. జనరల్ సెక్రటరీగా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబాబు, ట్రెజరర్‌గా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇ. మహేందర్ సహా మరో ఆరుగురు ఇతర పోస్టులకు ఎన్నికయ్యారు. హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని ఆర్ అండ్ బీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఎన్నికలు జరిగాయి. కొత్తగా ఎన్నికైన వారికి ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. శాఖ బలోపేతానికి ప్రభుత్వానికి సహకరిస్తామని తెలిపారు.

జీవో 33తో మా పిల్లలకు అన్యాయం

- వారి ఉన్నత చదువుకు అవకాశం కల్పించండి
- ప్రభుత్వానికి విద్యార్థుల తల్లిదండ్రుల విన్నపం

పాల్వంచ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీవో నెంబరు 33తో తమ పిల్లలకు తీవ్ర అన్యాయం జరిగిందని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. 2025-26 నీట్ కౌన్సెలింగ్‌లో తెలంగాణ ఫైనల్ మెరిట్ లిస్టులో తమ పిల్లల పేర్లను చేర్చి.. వారి ఉన్నత చదువులకు అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడారు. తమ పిల్లలు తెలంగాణ వాసులేనని.. పక్క రాష్ట్రం ఏపీలో ఇంటర్మీడియట్ చదువుకున్నంత మాత్రాన జీవో నెంబరు 33 ద్వారా లోకల్ అర్హత కోల్పోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. పలువురు విద్యార్థులు మాట్లాడుతూ ప్రభుత్వం ఈ జీవో జారీ చేయడానికి ముందే తాము ఇంటర్మీడియట్ పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ జీవో తమ భవిష్యత్తుకు అడ్డంకిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

అవ్వకు 110 ఏళ్లు



ఓదెల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన పోచమ్మకు ఆదివారం (సెప్టెంబర్ 14)తో 110 ఏళ్లు నిండాయి. దీంతో కుటుంబసభ్యులు అందరూ కలిసి ఆదివారం ఆమె జన్మదిన వేడుకలను నిర్వహించారు. పోచమ్మ, మైసయ్య దంపతులకు అయిదుగురు కుమార్తెలు, అయిదుగురు కుమారులు సంతానం కాగా ఇప్పుడు ఆ కుటుంబంలో మొత్తం వందమందికి పైగా ఉన్నారు. తెలుగు సంవత్సరాల ప్రకారం పోచమ్మ జన్మించిన ఏడేళ్లకు కీలకనామ సంవత్సరం వచ్చిందట. దీని ప్రకారం 1915లో ఆమె జన్మించినట్లుగా కుటుంబసభ్యులు నిర్ధారించారు. పోచమ్మకు 110 ఏళ్లు నిండినా నేటికీ ఆరోగ్యంగా ఉంది. పోచమ్మ భర్త మైసయ్య, పెద్దకుమారుడు మల్లయ్య మృతి చెందారు.

గురుకులాల్లో వస్తువుల సరఫరాకు కేంద్రీకృత టెండర్లు

హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గురుకులాల విద్యార్థులకు అందించే యూనిఫాంలు, స్కూల్ బ్యాగులు, ట్రంక్ పెట్టెలు, బూట్లు, టై, బెల్టులు, ఐడీ కార్డుల సరఫరా చేసేందుకు కేంద్రీకృత టెండర్ల ప్రక్రియ మొదలైంది. గతంలో ఆయా సొసైటీలే వేర్వేరుగా టెండర్లు నిర్వహించుకునే పద్ధతి కొనసాగగా.. ఈసారి గతానికి భిన్నంగా అన్ని సొసైటీలకు కలిపి ఒకే టెండర్ నిర్వహిస్తున్నారు. యూనిఫాం డ్రెస్సులు, స్కూల్ బ్యాగ్స్‌కు సంబధించిన టెండరు దాఖలుకు ఈ నెల 18 చివరి తేదీ కాగా, భోజన ప్లేట్లు, ట్రంక్ పెట్టెలు, ట్రాలీ బ్యాగ్స్, బూట్ల సరఫరా టెండరు దాఖలుకు 21దాకా గడువు ఉంది. నెలాఖరులోగా కాంట్రాక్టర్ల ఎంపిక పూర్తి చేయనున్నారు.

బిజినెస్

ఐపీఓ మార్కెట్‌లో జోష్

30లోగా మరో 12 ఐపీఓలు

న్యూఢిల్లీ: ఐపీఓ మార్కెట్లో జోష్ కొనసాగుతోంది. ఈ నెలాఖరులోగా లేదా వచ్చే నెల తొలి వారంలోగా మరో 12 కంపెనీలు ప్రైమరీ మార్కెట్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నాయి. ఈ కంపెనీలన్నీ దాదాపు రూ.10,000 కోట్లు సమీకరించేందుకు మార్కెట్‌కు రాబోతున్నాయి . ఇందులో ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ ఇష్యూ కూడా ఉంది. ఈ కంపెనీల ఈ నెల 15 నుంచి తమ షేరు ధర శ్రేణిని ప్రకటించే అవకాశం ఉందని భావిస్తున్నారు. సెబీ ఇప్పటికే ఈ ఐపీఓలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మూలధన అవసరాలు, అప్పుల చెల్లింపు, ఇతర అవసరాల కోసం ఈ కంపెనీలు ఐపీఓ మార్కెట్‌కు వస్తున్నాయి.

ఇప్పటి వరకు రూ.75,000 కోట్లు : ఈ సంవత్సరం ఇప్పటి వరకు 55 కంపెనీలు ఐపీఓల ద్వారా మార్కెట్ నుంచి దాదాపు రూ.75,000 కోట్లు సమీకరించాయి. గత ఏడాది మొత్తం మీద 91 కంపెనీలు ఐపీఓల ద్వారా రూ.1.6 లక్షల కోట్లు సమీకరించాయి. ప్రైమరీ మార్కెట్‌లో ఈ జోష్ ఇలానే కొనసాగితే ఈ సంవత్సరం ఐపీఓల ద్వారా కంపెనీలు సమీకరించే మొత్తం రూ.2 లక్షల కోట్లకు చేరుతుందని మార్కెట్ వర్గాల అంచనా.

మార్కెట్‌కు వచ్చే కొన్ని ప్రధాన ఐపీఓలు :

- జైన్ రిసోర్స్ రిసైక్లింగ్ రూ.2,000 కోట్లు.
- పార్క్ మెడివరల్డ్ రూ.1,260 కోట్లు.
- సాత్విక్ గ్రీన్ ఎనర్జీ రూ.1,150 కోట్లు.
- ట్రూఆల్ట్ బయోఎనర్జీ రూ.1,000 కోట్లు.
- ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ రూ.750 కోట్లు.

కార్ లోన్... ఇప్పుడే వద్దు



జీఎస్‌టీ తగ్గాక తీసుకుంటాం: కస్టమర్లు.. చూసి పోతున్నారంతే అంటున్న డీలర్లు

న్యూఢిల్లీ: జీఎస్‌టీ మండలి నిర్ణయాల ప్రభావం కార్ లోన్లపై పడింది. షోరూమ్‌లకు వచ్చి చూసిపోవడమే తప్ప, కొనుగోలుదారులెవరూ కార్లు కొనడం లేదు. ఫలితంగా బ్యాంకులు ఇచ్చే కార్‌లోన్లకు గిరాకీ తగ్గింది. మంజూరైన కార్‌లోన్లను తీసుకునేందుకు కూడా ఖాతాదారులు ముందుకు రావడం లేదు. బ్యాంకులకు ఫోన్ చేసి, మా కార్ లోన్ అప్రూవల్ కాన్సిల్ చేయండి, తర్వాత చూద్దాం అని చెబుతున్నట్టు బ్యాంక్ అధికారులు చెబుతున్నారు. లోన్ కాన్సిలేషన్ చార్జీలు నామమాత్రంగా ఉండడం సైతం ఇందుకు కలిసొస్తోంది. మాన్సూన్ ఆఫర్ కింద ప్రాసెసింగ్ చార్జీలు రద్దు చేసినా, ఈ నెల 4 నుంచి కార్ లోన్లు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రావడంలేదని బ్యాంకర్లు చెబుతున్నారు. కార్ డీలర్లు ఇన్‌వాయిస్ జారీ చేస్తే పాత జీఎస్‌టీ రేట్ల ప్రకారం 28 శాతం జీఎస్‌టీ పడుతుంది. ఇన్‌వాయిస్ లేకపోతే మాత్రం తగ్గించిన కొత్త జీఎస్‌టీ 18 శాతం పడుతుంది. దీనికి తోడు ఈ నెల 7 నుంచి 21 వరకు పితృ తర్పణాలు విడిచే కాలం. దీన్ని చాలా మంది అశుభ కాలంగా పరిగణిస్తారు. కార్‌లోన్లకు గిరాకీ తగ్గడానికి ఇది కూడా ఒక కారణమని అధికారులు చెబుతున్నారు.


పెద్ద కారే కొందాం...

ఈ నెల 22 నుంచి కార్లు, ఎస్‌యూవీపై ప్రస్తుతం 28 శాతంగా ఉన్న జీఎస్‌టీ 18 శాతానికి తగ్గనుంది. పెట్రోల్ కార్లయితే 1200 సీసీ, డీజిల్ కార్లయితే 1,500 సీసీ ఇంజిన్ సామర్థ్యం వరకు 18 శాతం జీఎస్‌టీ వర్తిస్తుంది. అంతకు మించితే మాత్రం 18 శాతం జీఎస్‌టీతో పాటు ఒకటి నుంచి 22 శాతం వరకు ప్రత్యేక సెస్ వర్తిస్తుంది. దీంతో ఎంట్రీ లెవల్ కార్లు కొనాలనుకున్న వారు కూడా పునరాలోచనలో పడ్డారు. జీఎస్‌టీ భారం తగ్గడంతో ధర కొద్దిగా ఎక్కువైనా ఎంట్రీ స్థాయిని మించి కొద్దిగా హైఎండ్ వెహికల్స్ కొనేందుకు ఆసక్తి చూపిస్తూ కొనుగోలు నిర్ణయాల్ని వాయిదా వేస్తున్నారు. కార్‌లోన్లకు డిమాండ్ తగ్గడానికి ఇది కూడా ఒక ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అయితే ఈ నెల 22 నుంచి మాత్రం కార్‌లోన్లకు డిమాండ్ భారీగా ఉంటుందని బ్యాంకింగ్ వర్గాల అంచనా. ఫెస్టివల్ సీజన్ కూడా కావడంతో మరింత ఆకర్షణీయమైన ఆఫర్లను కస్టమర్లను ఆకర్షించేందుకు బ్యాంకులు సిద్ధమవుతున్నాయి.

నెల్లూరు ప్రాజెక్టు గిట్టుబాటు కాదు : నాల్కో

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో తలపెట్టిన మరో పారిశ్రామిక ప్రాజెక్టు అటకెక్కింది. రూ.4,500 కోట్ల పెట్టుబడితో ఏటా 60,000 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేయతలపెట్టిన ఉత్కర్ష్ అల్యూమినియం ధాతు నిగం ప్రాజెక్టు ఆర్థికంగా గిట్టుబాటు కాదని నేషనల్ అల్యూమినియం కంపెనీ (నాల్కో) తేల్చింది. కంపెనీ తన తాజా వార్షిక నివేదికలో ఈ విషయం పేర్కొంది. కీలక మిశ్రమ లోహాల కోసం మరో ప్రభుత్వ రంగ సంస్థ మిశ్రధాతు నిగమ్‌తో కలిసి నాల్కో ఈ ప్రాజెక్టును తలపెట్టింది. ఇందుకోసం 2019లో చెరి సగం వాటాతో ఉత్కర్ష్ అల్యూమినియం ధాతు నిగం లిమిటెడ్ పేరుతో ప్రత్యేక జాయిం ట్ వెంచర్ కంపెనీ ఏర్పాటు చేశారు. నాల్కో తాజా నివేదికతో నెల్లూరు జిల్లాలో తలపెట్టిన ఈ భారీ ప్రభు త్వ రంగ ప్రాజెక్టు కూడా దుగ్గరాజపట్నం ఓడ రేవులా అటకెక్కింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	540
చిత్తూరు	573	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

25500 పైన బుల్లిష్

(సెప్టెంబరు 15-19 తేదీల మధ్య వారానికి)

గత వారం నిఫ్టీ : 25214 (+373)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం: 24711-25138 పాయింట్ల మధ్యన కదలాడి 373 పాయింట్ల లాభంతో 25214 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25500 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25030, 24893, 24786, 24489 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 25500 బ్రేక్‌డౌన్ స్థాయి: 24750
నిరోధ స్థాయిలు: 25325, 25425, 25525 (25225 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24495, 24825, 24725 (25025 దిగువన బేరిష్)

ఆస్ట్రో ట్రెండ్

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	121	విజయవాడ	140
వరంగల్	121	గుంటూరు	135
కరీంనగర్	121	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	121	చిత్తూరు	127
కర్నూలు	121	నెల్లూరు	132
విశాఖపట్నం	139	అనంతపురం	132
గోదావరి	140		

సానుకూల సంకేతాలు వస్తే..

దేశీయ బెంచ్‌మార్క్ సూచీలు ప్రస్తుతం కీలక దశకు చేరుకున్నాయి. నిఫ్టీ మళ్లీ 25000 పై స్థాయిలో ముగిసింది. గ్లోబల్ మార్కెట్ల నుంచి వస్తున్న సంకేతాలు, కొన్ని రంగాల్లో కొనుగోళ్లు ఇందుకు ఊతంగా మారాయి. ఈ నెలలో అమెరికన్ ఫెడరల్ వడ్డీరేట్లు తగ్గించవచ్చునన్న సంకేతాలు మళ్లీ ఇన్వెస్టర్లలో జోష్ పెంచుతున్నాయి. అదే జరిగితే సూచీలు మరింత పెరగడం ఖాయం. మార్కెట్ బ్రెడ్త్ కొంత మెరుగవ్వడం సానుకూల అంశం. ప్రస్తుతం మైనింగ్, నాన్ ఫెర్రస్ మెటల్స్, ఆటో మొబైల్స్-యాన్సిలరీస్, ఎలక్ట్రికల్స్ సెక్టార్లు బలంగా ఉన్నాయి.

స్టాక్ రికమెండేషన్స్

బీఈఎల్: జీవితకాల గరిష్ఠ స్థాయికి చేరిన అనంతరం ఈ షేర్లు దిద్దుబాటుకు లోనయ్యాయి. ప్రస్తుతం అన్ని ప్రధాన చలన సగటు స్థాయిలను అధిగమించాయి. మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ బాగున్నాయి. గత శుక్రవారం రూ.399 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.425 టార్గెట్ ధరతో రూ.380 పై స్థాయిలో పొజిషన్ తీసుకోవచ్చు. డిప్స్ పద్ధతిలో కొనుగోలు చేస్తూ దీర్ఘకాలం హోల్డ్ చేయాలి. స్టాప్‌లాస్ : రూ.360.

లుపిన్: ఈ షేర్లు ఏడాది కాలంగా ఎలాంటి రాబడి ఇవ్వలేదు. సైడ్‌వేస్ కదలికలతో మంచి బేస్ ఏర్పడింది. స్వల్ప, మధ్యకాలిక మూమెంటమ్ పెరుగుతోంది. డెలివరీ వాల్యూమ్ రావడాన్ని బట్టి బుల్లిష్ ట్రెండ్ ఆరంభమైందని చెప్పొచ్చు. గత శుక్రవారం రూ.2,043 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ. 2,250 టార్గెట్ ధరతో రూ. 2,000 శ్రేణిలో కొనుగోలు చేయాలి. స్టాప్‌లాస్ : రూ.1,960.

ఐసీఐసీఐ బ్యాంకు: కొన్ని నెలలుగా ఈ షేర్లు సైడ్‌వేస్‌లో కదులుతున్నాయి. అయితే రూ.1,400 శ్రేణిలోనే కన్సాలిడేట్ అవుతూ వస్తోంది. గత శుక్రవారం ఈ షేరు రూ. 1,417 వద్ద ముగిసింది. రూ. 1520/1550 టార్గెట్ ధరతో రూ. 1,400 శ్రేణిలో అక్యూములేట్ చేసుకుని దీర్ఘకాలం ఉంచుకోవాలి. స్టాప్‌లాస్ : రూ.1380.

కొచ్చిన్ షిప్‌యార్డు: డౌన్‌ట్రెండ్‌లో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్ తర్వాత ఏర్పడిన భారీ స్వింగ్ అనంతరం ఈ షేర్లు మళ్లీ దిద్దుబాటుకు లోనయ్యాయి. ప్రస్తుతం నౌకా నిర్మాణంపై కేంద్రం దృష్టి పెట్టడంతో టర్న్ అరౌండ్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. గత శుక్రవారం రూ.1,745 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.1,850 టార్గెట్ ధరతో రూ. 1700/1730 శ్రేణిలో పెట్టుబడి పెట్టవచ్చు. స్టాప్‌లాస్ : రూ.1680.

గ్లాండ్ ఫార్మా: ఈ షేర్లు ఇంట్రెస్టింగ్ జోన్‌లో ఉన్నాయి. మరోసారి నమోదైన గరిష్ఠానికి చేరువయ్యాయి. ఈ నిరోధాన్ని దాటితే మరింత పెరిగే అవకాశం ఉంటుంది. పైగా రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ బాగున్నాయి. గత శుక్రవారం రూ.2,021 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ. 2,160 టార్గెట్ ధరతో రూ. 2,000 శ్రేణిలో పొజిషన్ తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ. 1,970.




- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

కీలక నిరోధం 25000 వద్ద పరీక్ష

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం రికవరీని కొనసాగించి వారం మొత్తం మీద 373 పాయింట్ల లాభంతో 25,140 వద్ద ముగిసింది. గత రెండు వారాల్లో నిఫ్టీ 700 పాయింట్ల మేరకు ర్యాలీ సాధించింది. అయినప్పటికీ గత నాలుగు వారాలుగా ప్రధాన స్థాయి 25,000 వద్ద సైడ్‌వేస్ కదలికలు కొనసాగుతూనే ఉన్నాయి. మొత్తం మీద మార్కెట్ గత వారం నిలకడగా క్లోజయినా ప్రస్తుతం గతంలో ఏర్పడిన మేజర్ టాప్ 25,200 సమీపంలో ఉంది. గతంలో రివర్సల్ ఏర్పడిన ఈ స్థాయిలో వరుసగా నాలుగో వారం పరీక్ష ఎదుర్కొంటోంది. తదుపరి దిశ తీసుకునే ముందు ఈ స్థాయిలో కన్సాలిడేట్ కావచ్చు. ప్రస్తుత అప్‌ట్రెండ్ కొనసాగించాలంటే ఈ స్థాయిలో నిలదొక్కుకుని తీరాలి. మిడ్ క్యాప్-100, స్మాల్‌క్యాప్-100 సూచీలు సైతం గత వారం ర్యాలీ సాధించాయి.

బుల్లిష్ స్థాయిలు: అమెరికన్ మార్కెట్లో శుక్రవారం నాటి బలహీనత కారణంగా ఈ వారంలో నిఫ్టీ అప్రమత్త ట్రెండ్‌లో ట్రేడయ్యే ఆస్కారం ఉంది. అప్‌ట్రెండ్ కొనసాగించాలంటే 25,200 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి. ప్రధాన నిరోధ స్థాయిలు 25600, 26000.

బేరిష్ స్థాయిలు: ప్రస్తుత స్థాయిల నుంచి దిగజారినట్టయితే భద్రత కోసం 25,000 వద్ద నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే బలహీనత సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 24,800. ఇక్కడ విఫలమైతే మరింత బలహీనపడుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 24,500.

బ్యాంక్ నిఫ్టీ: రెండు నెలల డౌన్‌ట్రెండ్ అనంతరం ఈ సూచీ టెక్నికల్ రికవరీ సాధించి 54,800 వద్ద ముగిసింది. తదుపరి మానసిక అవధి 55,000. ఆ పైన నిలదొక్కుకున్నప్పుడే మరింత అప్‌ట్రెండ్ ఉంటుంది. బలహీనపడినా ప్రధాన మద్దతు స్థాయి 54,400 వద్ద నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది.

పాటర్న్: రెండు వారాల ర్యాలీ ప్రభావంతో నిఫ్టీ స్వల్ప ఓవర్‌బాట్ స్థితిలో ప్రవేశిస్తోంది. మరింత కన్సాలిడేషన్ ఉండవచ్చుననేందుకు ఇది సంకేతం. వీక్లీ చార్టుల్లో 25,200 వద్ద డబుల్ టాప్ ఏర్పడింది. సానుకూలత కోసం ఇక్కడ బ్రేకౌట్ సాధించాలి. అదే స్థాయిలో "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" పైన కూడా నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25120, 25200
మద్దతు	25000, 24930

బుల్లెట్ బండి ఎక్కిన మంత్రి సీతక్క

» ములుగు ఎస్పీతో కలిసి మేడారంలో పర్యటన



హైదరాబాద్/తాడ్వాయి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో మంత్రి సీతక్క ఆదివారం పర్యటించారు. మహాజాతర సమీపిస్తున్న నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి చేసేందుకు ఎడ్లబండ్ల రహదారులను ఎస్పీ శబరీశ్‌తో కలిసి పరిశీలించారు. మంత్రి కాన్వాయ్ వెళ్లలేని పరిస్థితి ఉండగా బుల్లెట్ బండిపై ఆమె ప్రయాణించారు. ఎస్పీ బుల్లెట్ నడపగా వెనుక మంత్రి కూర్చొని.. కాల్వపల్లి నుంచి కన్నెపల్లి, మేడారం నుంచి కొండపర్తి రహదారులను, జంపన్నవాగులో వరదకు కొట్టుకుపోయిన లోలెవల్ కాజ్‌వేలను పరిశీలించారు. మేడారం అభివృద్ధికి సీఎం సుముఖంగా ఉన్నారని, కొందరు విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పోషకాహార లోపాన్ని నివారించాలి

చిన్నారులు, మహిళల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ఈ నెల 17 నుంచి అక్టోబరు 16 వరకు 'పోషణ మాసం' నిర్వహించడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రతి ఇంటికి పోషకాహారం సందేశాన్ని అంగన్‌వాడీ సిబ్బంది ద్వారా చేరవేర్చడానికి ప్రణాళిక సిద్ధం చేసింది. నెల రోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కమ్యూనిటీ కేంద్రాల్లో అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రధానంగా పోషకాహారం, ఆరోగ్యకరమైన అలవాట్లు, బాలల సంరక్షణ, పరిశుభ్రత, డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తారు. ఆయా కార్యక్రమాల విజయవంతానికి ప్రతి ఐసీడీఎస్ ప్రాజెక్టుకు రూ.30వేలు, ప్రతి జిల్లాకు రూ.50వేల చొప్పున ఇప్పటికే నిధులు మంజూరు చేశారు.

'వివాహ గమ్యస్థానం'గా తెలంగాణ: జూపల్లి

హైదరాబాద్/నార్సింగ్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెళ్లి వేడుకలను జరిపించేందుకు తెలంగాణ ప్రముఖ 'వివాహ గమ్యస్థానం'గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైదరాబాద్‌లోని అక్షయ కన్వెన్షన్ సెంటర్‌లో తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ(టీసీఈఐ) ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన నాలుగో సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో పెళ్లిళ్ల పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రపంచం మొత్తం భారత్‌ను వెడ్డింగ్ డెస్టినేషన్‌గా చూస్తోందని, అలాంటి సమయంలో రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో వివాహ వేడుకల హబ్ నిలపాలన్నదే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు.

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



తిరుమల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):తిరుమల శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని, గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందించారు.

కవిత వల్లే కానుకుర్తి రైతులకు పరిహారం పెంపు

» తెలంగాణ జాగృతి వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.20లక్షల పరిహారం ప్రకటించడం తాము సాధించిన విజయమని తెలంగాణ జాగృతి సంస్థ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రాజెక్టు కోసం రైతుల భూములు గుంజుకొని ఎకరాకు రూ.14లక్షల పరిహారం మాత్రమే ఇవ్వాలని ప్రభుత్వం చూసిందని, దీనిపై రూ.20 లక్షల పరిహారం ఇస్తే తప్ప భూములిచ్చేది లేదని కవిత చేపట్టిన పోరాటానికి దిగొచ్చి.. పరిహారాన్ని పెంపు చేసిందన్నారు.

గ్రూప్-1పై కేటీఆర్ కుట్ర: ఎంపీ చామల

» బీఆర్ఎస్ ప్రచారాన్ని తిప్పికొట్టండి: రియాజ్, చనగాని

హైదరాబాద్/ఢిల్లీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా గ్రూప్-1 ఉద్యోగాలు రాకూడదని కేటీఆర్ కుట్ర పన్నుతున్నారని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగాలు ఎలాగూ ఇవ్వలేదని, గ్రూప్ పరీక్షలూ పెట్టలేదని విమర్శించారు. కాంగ్రెస్ వాళ్లు గ్రూప్-1 పోస్టులను అమ్ముకున్నారని, ఒక్కో అభ్యర్థి దగ్గర రూ.3కోట్లు తీసుకుని ఎంపిక చేశారని కేటీఆర్ ఆరోపణలపై ఆదివారం ఒక ప్రకటనలో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపికైన అభ్యర్థుల్లో ఎవరి తల్లిదండ్రులకైనా రూ. 3 కోట్లు పెట్టే స్తోమత ఉందా అని ప్రశ్నించారు. రాజకీయ దురుద్దేశంతోనే ప్రభుత్వంపై కేటీఆర్ నిందలు వేస్తున్నారన్నారు. గ్రూప్ -1 పరీక్షపై బీఆర్ఎస్ విష ప్రచారాన్ని తిప్పి కొట్టాలని ఎంపికైన అభ్యర్థులు, కాంగ్రెస్ శ్రేణులకు తెలంగాణ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లో మీడియాతో వారు మాట్లాడుతూ.. నిరుద్యోగుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, వారి న్యాయబద్ధమైన పోరాటాలను గౌరవిస్తుందని అన్నారు. ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం కసరత్తు చేస్తోందని వెల్లడించారు.

గద్వాలలో కేటీఆర్ సభ అట్టర్ ఫ్లాప్: సంపత్

హైదరాబాద్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లాలో కేటీఆర్ సభ అట్టర్ ఫ్లాప్ అయిందని, తేరు మైదానాన్ని ఆయన అబద్ధాలకు అడ్డగా మార్చాడని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పేర్కొన్నారు. పెద్ద ధన్వాడ ఇథనాల్ ఫ్యాక్టరీ గురించి మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో కేటీఆర్ చేతుల మీదుగానే ఆ కంపెనీకి 9 రకాల అనుమతులు లభించాయని వెల్లడించారు. గ్రూప్-1 ఉద్యోగాలు అమ్ముకున్నట్లు ఆరోపణలు చేస్తున్న కేటీఆర్.. దానికి సంబంధించి సాక్ష్యం చూపాలని సవాలు విసిరారు. గద్వాల సభకు జనాన్ని సమీకరించడం కోసం డబ్బులు పంచడాన్ని ప్రజలందరూ చూశారన్నారు.

ఫిర్యాదు వస్తే కమిటీలో చర్చిస్తాం

» రాజగోపాల్‌రెడ్డి అంశంపై మల్లు రవి

హైదరాబాద్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అంశంపైన ఫిర్యాదులు వస్తే.. టీపీసీసీ క్రమశిక్షణ చర్యల కమిటీలో చర్చిస్తామని, అంతే కానీ ఎవరికో ఆసక్తి ఉందని చర్చించబోమని కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి అన్నారు. సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డిపైన దళితులు ఫిర్యాదు చేశారని, దానిపైన సమీక్షించిన కమిటీ.. ఆ ఫిర్యాదుకు వివరణ ఇవ్వాలని నర్సారెడ్డికి సూచించిందని తెలిపారు. కాంగ్రెస్ అంతర్గత వివరాలను మీడియా ముందు మాట్లాడితే క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. నర్సారెడ్డి, పార్టీ నేత పూజల హరికృష్ణలపైన వచ్చిన ఫిర్యాదులపైన చర్చించేందుకు ఆదివారం గాంధీభవన్‌లో క్రమశిక్షణ చర్యల కమిటీ భేటీ అయింది.

ఆయుర్వేద రంగం అభివృద్ధికి చర్యలు: మల్లు రవి

బోరబండ: రాష్ట్రంలో ఆయుర్వేద రంగం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి,మంత్రి దామోదర రాజనర్సింహలతో చర్చిస్తానని చెప్పారు. యూసుఫ్‌గూడలోని నిమ్స్ మే ఆడిటోరియంలో మూడు రోజుల పాటు జరిగిన విశ్వ ఆయుర్వేద పరిషత్ జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. చివరి రోజు కార్యక్రమంలో మల్లు రవి మాట్లాడుతూ.. ఆయుర్వేదం మన జీవన విధానమని, సంస్కృతిలో భాగమని చెప్పారు.

అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో జనరిక్ మెడికల్ షాపులు

హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో జనరిక్ మందుల షాపులను ఏర్పాటు చేయాలని సర్కారు సూత్రప్రాయంగా నిర్ణయించింది. వైద్య విద్య సంచాలకుడి (డీఎంఈ) పరిధిలోని బోధనాస్పత్రులు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) కమిషనర్ పరిధిలోని ఆస్పత్రుల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. డీఎంఈ, టీవీవీపీ పరిధిలో మొత్తం 203 ఆస్పత్రులున్నాయి.వీటిలో ప్రస్తుతం 40సర్కారీ దవాఖానాల్లో మాత్రమే జనరిక్ మెడికల్ షాపులున్నాయి. మిగిలిన 163ఆస్పత్రుల్లో ఈ ఏడాది నవంబరు నాటికి జనరిక్ మెడికల్ షాపులను అందుబాటులోకి తీసుకురావాలనే యోచనలో వైద్య ఆరోగ్యశాఖ ఉంది. ఇటీవలే ఆ శాఖ అధికారులు వీటి ఏర్పాటుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వరంగల్, కొమరంభీం ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, జనగాం, పెద్దపల్లి, కామారెడ్డి, భూపాలపల్లి, వికారాబాద్ జిల్లాల్లోని సర్కారీ దవాఖానాల్లో ఒక్క జనరిక్ మెడికల్ షాపు కూడా లేదని గుర్తించారు. తొలి ప్రాధాన్యంగా ఆయా జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వెంటనే జనరిక్ మెడికల్ షాపులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ బాధ్యతను టీజీఎంఎస్ఐడీసీకి అప్పగించారు. కాగా, ప్రస్తుతం ఉన్న 40 జనరిక్ షాపుల పనితీరుపై ఇటీవల రాష్ట్రస్థాయిలో పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. వాటిల్లో నిబంధనల మేరకు జనరిక్ ఔషధాలే విక్రయిస్తున్నారా?లేక ఇతర బ్రాండ్ల మందులు అమ్ముతున్నారా? అనే అంశాలతోపాటు.. రోగులు, ఆస్పత్రి సూపరింటెండెంట్ల అభిప్రాయాలను కమిటీ సేకరించింది. ఆ వివరాలతో ఇటీవలే వైద్యశాఖకు ఒక నివేదిక అందించింది. వీటిలో పనితీరు సరిగాలేని, ఇప్పటికే ఉన్న అగ్రిమెంట్ పూర్తి అయిన సంస్థలను తొలగించాలని వైద్యశాఖ నిర్ణయించింది. ఇక కొత్త దుకాణాల విషయానికి వస్తే.. రోగుల తాకిడి ఎక్కువగా ఉండే ప్రభుత్వ ఆస్పత్రులను గుర్తించేందుకు జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఒక కమిటీ వేస్తారు. మెడికల్ షాపుల ఏర్పాటుపై జిల్లా కలెక్టర్లే నోటిఫికేషన్ జారీ చేస్తారు. విశ్వసనీయత ఉన్న ఎన్‌జీవోలు, జిల్లా సమాఖ్యలు, మండల సమాఖ్యల్లో అర్హతగలిగిన వారికి షాపులను కేటాయిస్తారు.



ఆ షాపులు కొన్ని మూత..

ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధీ పరియోజన(పీఎంబీజేపీ)లో భాగంగా రాష్ట్రంలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో జనరిక్ మెడికల్ షాపులను ఉన్నాయి. అయితే ఆ దుకాణాలకు వచ్చే ఔషధాలు ప్రతినెలా మారుతున్నాయని, ఒక్కసారి వచ్చిన ఔషధాలు మరో నెల్లో రావడం లేదని ఖమ్మం జిల్లాకు చెందిన షేర్ ఎన్‌జీవో వ్యవస్థాపకుడు గోపాల్‌రెడ్డి తెలిపారు. రోగులు ఒక్కసారి వాడిన ఔషధాలనే మళ్లీమళ్లీ అడుగుతుంటారని.. అలా రాకపోవడంతో పీఎంబీజేపీ కింద ఏర్పాటైన జనరిక్ షాపుల్లో కొనుగోళ్లు లేక కొన్ని మూతపడినట్లు వెల్లడించారు.

స్టార్టప్‌లకు బూస్టప్!

ఏడాదికి 200 పైగా అంకుర సంస్థలకు వివిధ రంగాల్లో శిక్షణ, సలహాలు

- ఆర్థిక సాయం కోసం 50కోట్ల పైగా నిధి
- 'రాష్ట్ర ప్రభుత్వం-గూగుల్' నెట్‌వర్క్ సంస్థల నుంచి నిధులు
- టీహబ్‌లో గూగుల్‌కు కార్యాలయం
- డిసెంబరు 9న ప్రారంభించనున్న సీఎం



హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అంకుర (స్టార్టప్) సంస్థలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేయనుంది. రాష్ట్రాన్ని అంకురాల కేంద్రంగా, మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తోంది. టెక్ దిగ్గజం గూగుల్‌తో కలిసి స్టార్టప్‌లకు ప్రత్యేక సాయాలను అందించనుంది. వీటిలో ప్రధానంగా ఆర్థిక సాయం, మార్గదర్శనం (మెంటార్‌షిప్), సాంకేతిక శిక్షణలు ఉంటాయి. ఇందుకోసం హైదరాబాద్‌లోని టీ హబ్ భవనంలో రెండు అంతస్తులను గూగుల్‌కు కేటాయించారు. అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలను కూడా ప్రభుత్వమే కల్పిస్తోంది. అంకురాలకు ఆర్థిక సాయంతో పాటు పలు రకాల సేవలను అందించేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న టెక్ దిగ్గజ కంపెనీలను గూగుల్ ద్వారా హైదరాబాద్‌కు తీసుకురానున్నారు. అలాగే గూగుల్, తెలంగాణ ప్రభుత్వంతో కలిసి ఉన్న నెట్‌వర్క్ సంస్థలు, ఇతర భాగస్వామ్య సంస్థల ద్వారా దాదాపు రూ.50 కోట్ల నిధులను సేకరించనున్నారు. ఆ నిధుల నుంచే స్టార్టప్‌లకు ఆర్థిక సాయం అందించనున్నారు. మరికొన్ని కంపెనీల నుంచి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద కూడా నిధులు సేకరించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. స్టార్టప్‌లకు ఊతమిచ్చేందుకు 'గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్ ఎట్ టీ హబ్' పేరుతో రూపొందించిన ఈ కార్యక్రమాన్ని, టీ హబ్‌లో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని డిసెంబరు 9న సీఎం రేవంత్ ప్రారంభించనున్నారు. ఆ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. టీ హబ్‌లో పనులు పూర్తి కావచ్చాయని చెబుతున్నారు.

సిలికాన్‌వ్యాలీ, జపాన్ నుంచి నిపుణులు..

తెలంగాణలో ప్రస్తుతం సాంకేతికత, విద్య, వైద్యం, వ్యవసాయం, రవాణా రంగాల్లో స్టార్టప్‌లు విస్తృతంగా వస్తున్నాయి. ఇవి ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందడంతో పాటు పెట్టుబడులు వస్తే యువతకు ఉద్యోగ అవకాశాలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. దశాబ్ద కాలంగా ఐటీ హబ్‌గా తెలంగాణ పేరు తెచ్చుకున్నప్పటికీ అంకురాలను అంతర్జాతీయ స్థాయిలో నిలిపేందుకు అవసరమైన ప్రోత్సాహకాలు లేవని నిపుణులు చెబుతున్నారు. స్టార్టప్‌లు బలోపేతమవ్వాలంటే ప్రోత్సాహకాలే కీలకమని అంటున్నారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం గూగుల్‌తో కలిసి ప్రత్యేకంగా స్టార్టప్‌లకు సాయం అందించాలని నిర్ణయించింది. దీని ద్వారా ప్రారంభ దశలో పెట్టుబడి (మూలధనం, వాటాలు) కోసం ఇబ్బందులు పడే అంకురాలకు ఆర్థిక సాయం అందిస్తారు. గూగుల్, దానికి అనుసంధానంగా ఉన్న కొన్ని ప్రముఖ కంపెనీలు, నెట్‌వర్క్ సంస్థల్లో పనిచేసే నిపుణులతో నేరుగా అంకురాల ఉన్నతికి శిక్షణ, సలహాలు, సూచనలు ఇస్తారు. గూగుల్ టెక్నాలజీతో కూడుకొని ఉన్న వేదికలు, టూల్స్‌ను వినియోగించుకుని స్టార్టప్‌ల వ్యాపారాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు, విస్తరించేందుకు అవకాశం కల్పించనున్నారు. అంతేకాకుండా ఏడాదిలో 200కు పైగా స్టార్టప్‌లకు శిక్షణలు, 10కి పైగా అంతర్జాతీయ ప్రతినిధులతో టీ హబ్‌లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అత్యాధునిక టెక్నాలజీ వినియోగంపై ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేస్తారు. అలాగే స్టార్టప్‌లు త్వరితగతిన అభివృద్ధి చెందేందుకు ఏఐ/ఎంఎల్, యూఎక్స్ జీటీఎం డొమైన్లలో క్లాసుల కోసం అవసరమైన ఏర్పాట్లు గూగుల్ చేస్తుంది. సిలికాన్‌వ్యాలీ, జపాన్, ఆగ్నేసియాల నుంచి ప్రముఖ నిపుణులను హైదరాబాద్ తీసుకొచ్చి తరగతులు చెప్పించే ఏర్పాట్లూ చేస్తుంది.

అంకురాలకు సాయంపై ప్రత్యేక క్యాలెండర్

ప్రభుత్వం, గూగుల్ కలిసి స్టార్టప్‌లకు అందించబోయే సాయం, శిక్షణల కోసం ప్రత్యేకంగా ఒక ప్రోగ్రామింగ్ క్యాలెండర్‌ను రూపొందించారు. ఫౌండర్స్ అకాడమీ, గూగ్లర్ క్లినిక్, ఏఐ స్ట్రాటజీ వర్క్‌షాపులు, అంతర్జాతీయ పెట్టుబడిదారుల సమావేశాలు, సాంకేతికతలో మహిళల ప్రభావం, సామాజిక ప్రభావం, విద్యార్థుల హ్యాకథాన్‌లు.. ఇలా పలు కార్యక్రమాలు ఉంటాయి. ఏడాదికి30 కార్యక్రమాలను నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. దీని ప్రకారం ఫౌండర్స్ అకాడమీ 6సెషన్లు, గూగ్లర్‌మాస్టర్ క్లాసులు 5, ఇన్నోవేషన్ డే, హ్యాకథాన్‌లు 10, విద్యార్థులు, మహిళలకు సంబంధించి 8 క్యాంపస్‌ల్లో ఈవెంట్లు, పెట్టుబడిదారులతో 5రౌండ్‌టేబుల్ సమావేశాలు ఉండనున్నాయి.

500 సర్కారీ బడుల్లో ఏఐ కోర్సు

తెలంగాణలోని స్టార్టప్‌లకు ప్రోత్సాహం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, గూగుల్‌తో ఈ ఏడాది ఫిబ్రవరిలోనే కీలక ఒప్పందం చేసుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ఓపెన్ అగ్రికల్చర్ నెట్‌వర్క్ ద్వారా రైతులకు పలు సమస్యలకు పరిష్కారం అందించనుంది. రవాణా రంగంలో ఏఐ ఆధారిత వ్యవస్థతో వాహన సమాచారాన్ని తెలుసుకోవడం, డేటా ఇంటిగ్రేషన్ సదుపాయాలను వంటి చర్యలు చేపట్టనుంది. గూగుల్ ఫర్ ఎడ్యుకేషన్ ద్వారా ఎంపిక చేసిన పాఠశాలల్లో డిజిటల్ లెర్నింగ్‌ను చేపడతారు. గూగుల్ ఓపెన్ డేటా యాక్సెస్‌ను మెరుగుపరుస్తారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం మైక్రోసాఫ్ట్, అమెజాన్ లాంటి సంస్థలతోనూ పలు రంగాల్లో సాంకేతికతను వినియోగించడం కోసం ఒప్పందాలు చేసుకుంది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో 1.20 లక్షల మందికి ఏఐలో శిక్షణను ఇవ్వనున్నట్లు మైక్రోసాఫ్ట్ ఇప్పటికే ప్రకటించింది. 'ఏఐ తెలంగాణ ప్రోగ్రాం' పేరుతో 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ కోర్సును పరిచయం చేయనున్నారు. దీంతో 50 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ఏఐ ఇండస్ట్రీ పేరుతో పరిశ్రమలకు నైపుణ్యాలను, ఏఐ గవర్నెన్స్ పేరుతో దాదాపు 50 వేల మంది ప్రభుత్వ అధికారులకు సైబర్ సెక్యూరిటీ వంటి కీలకమైన అంశాల్లో శిక్షణ ఇవ్వనుంది. స్టార్టప్‌లకు, విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో త్వరలో తెలంగాణ నవకల్పనలు, స్టార్టప్‌లకు కేంద్రంగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు.



అలయ్-బలయ్‌కు రండి

» సీఎం రేవంత్‌కు దత్తాత్రేయ ఆహ్వానం

హైదరాబాద్/రాంనగర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. దసరా పండుగను పురస్కరించుకుని వైష్ణవ్ బండారు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు 3న హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే 'అలయ్-బలయ్' కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ సీఎంకు ఆహ్వానపత్రికను అందజేశారు.

ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలిపిన సీఎం

రాష్ట్రంలోని ఇంజనీర్లు, ఇంజనీరింగ్ విద్యార్థులు, సాంకేతిక నిపుణులు అంతా మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకుని, రాష్ట్ర అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. తమ మేథోశక్తితో మానవ మనుగడకు ఎన్నో ఫలాలను అందించిన ఘనత ఇంజనీర్లదేనని అన్నారు. దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న ఇంజనీర్లందరికీ సోమవారం ఇంజనీర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

జూబ్లీహిల్స్.. మనదే!

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి సాధ్యమన్న నమ్మకాన్ని కల్పించాలన్నారు. ఈ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ సానుభూతినే నమ్ముకుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పదేళ్ల పాలనలో హైదరాబాద్ అభివృద్ధికి ఆ పార్టీ చేసిందేమీ లేదన్నారు. ఇక హైదరాబాద్ అభివృద్ధిలో బీజేపీకి ఎటువంటి పాత్ర లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇన్‌చార్జులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వ్యక్తి కేంద్రీకృతంగా కాకుండా.. పార్టీ కేంద్రీకృతంగానే ప్రచారం నిర్వహించాలని సూచించారు. ప్రచారంలో దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌పై, ఆయన కుటుంబంపై విమర్శలు చేయవద్దని, కేసీఆర్, కేటీఆర్‌లనే లక్ష్యంగా చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఈ ఎన్నికను ప్రభుత్వానికి సంబంధించిన ఎన్నికగా తీసుకోవాలని, పార్టీని గెలిపించాల్సిన గురుతర బాధ్యత ఇన్‌చార్జులపై ఉందన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులపై తాను ఎప్పటికప్పుడు సమాచారం తీసుకుంటానని చెప్పారు. అభ్యర్థి ఎంపిక అధిష్ఠానం పరిధిలో ఉందని సీఎం తెలిపారు. ప్రత్యేక బృందాలు.. అభిప్రాయ సేకరణ చేస్తున్నాయన్నారు.

నారా దేవాన్ష్‌కు ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్ అవార్డు

» వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు అందుకున్న లోకేశ్ తనయుడు

» లండన్‌లో అవార్డు ప్రదానం.. ఏపీ సీఎం చంద్రబాబు హర్షం



అమరావతి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మనవడు, విద్య, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ తనయుడు నారా దేవాన్ష్ అత్యంత క్లిష్టమైన 175 పజిల్స్‌ను వేగంగా పరిష్కరించినందుకుగానూ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు-2025ను అందుకున్నాడు. లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ హాల్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో నిర్వాహకులు దేవాన్ష్‌కు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి లోకేశ్ కూడా హాజరయ్యారు. గతేడాది జరిగిన చెక్‌మేట్ మారథాన్‌లో లాస్లో పోల్గార్ ప్రసిద్ధ చెస్ సంకలనం '5,334 ప్రాబ్లమ్స్ అండ్ గేమ్స్' పుస్తకం నుంచి తీసుకున్న 175 క్లిష్టమైన చెక్‌మేట్ పజిల్స్‌ను వేగవంతంగా పరిష్కరించిన దేవాన్ష్ 'ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్'గా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. దీనికోసం అకుంఠిత దీక్షతో శ్రమించిన దేవాన్ష్‌కు.. తల్లిదండ్రులు బ్రాహ్మణి, లోకేశ్‌తోపాటు కోచ్ కె.రాజశేఖర్ రెడ్డి చక్కని ప్రోత్సాహం అందించారు. దేవాన్ష్ ఈ అవార్డును అందుకోవడం చాలా ప్రత్యేకమైనదని, అతని కృషికి ఇది నిజమైన గుర్తింపు అని లోకేశ్ అన్నారు. అతను సాధించిన ఈ ఘనతపట్ల తామెంతో గర్విస్తున్నామని చెప్పారు. మనవడు దేవాన్ష్ సాధించిన విజయం పట్ల సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. మెంటార్ల మార్గదర్శకత్వంలో కొన్ని నెలలపాటు నిరంతరాయంగా చేసిన కృషికి ఇది దక్కిన గుర్తింపు అని అన్నారు.

రేవంత్ కమీషన్ల కోసమే రూ.2.50 లక్షల కోట్ల టెండర్లు..

» ఫీజు రీయింబర్స్ బకాయిలపై సర్కారు మొద్దు నిద్ర: హరీశ్

హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కమీషన్లు దండుకోవడం కోసం వివిధ పనులకు రూ.2.50 లక్షల కోట్లకు టెండర్లు పిలుస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. విద్యార్థుల చదువుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ, విద్యా సంస్థలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పట్టించుకోవడం లేదని మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు దుయ్యబట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై పోరుబాట పేరిట పీబీఎస్‌యూ రూపొందించిన బిగ్ డిబేట్ పోస్టర్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రెండేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయలేదని విద్యా సంస్థల యాజమాన్యాలు మొత్తుకుంటున్నా రేవంత్ సర్కారు మొద్దు నిద్ర నటిస్తుండటం సిగ్గుచేటు. కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం వల్ల అన్ని కాలేజీలు మూతపడే పరిస్థితి వచ్చింది. దాదాపు 13 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న రేవంత్ ఏం చేస్తున్నారో.. అర్థం కావడం లేదు' అని విమర్శలు గుప్పించారు. సోమవారం నుంచి నిరసనలు, నిరాహార దీక్షలు, నిరవధిక బంద్‌లు చేయనున్నట్లు ప్రకటించినప్పటికీ ఎందుకు నోరు మెదపడంలేదని నిలదీసిన హరీశ్.. అల్లరి చేయొద్దని ఆర్థికమంత్రి సుద్దులు చెప్పినంత మాత్రాన యాజమాన్యాలు, విద్యార్థుల గోడు తీరదని వ్యాఖ్యానించారు. చేతగాని విధానాల వల్ల విద్యా వ్యవస్థ కుప్పకూలుతుంటే రేవంత్ మాత్రం అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ పాఠశాలల్లో 2 లక్షల మంది విద్యార్థులు పెరిగారని పచ్చి అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. ఇప్పటికైనా రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని.. లేదంటే విద్యారంగ సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ మరో పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

ఎస్ఎల్‌బీసీ ఘటనపై ఎందుకు స్పందించడం లేదు

» 200 రోజులు గడిచినా దర్యాప్తు ఏది

» బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిన ఘటనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు స్పందించడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఈ ఘటన జరిగి 200 రోజులు గడిచినా ఆరుగురు కార్మికుల మృతదేహాలను ఇప్పటికీ వెలికితీయలేదని, బాధిత కుటుంబాలకు నష్టపరిహారం కూడా అందించలేదని ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో చిన్నపాటి సమస్య తలెత్తగానే జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందాన్ని పంపిన కేంద్ర ప్రభుత్వం, ఎస్ఎల్‌బీసీ ఘటనపై ఎందుకు స్పందించడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య అపవిత్ర బంధం ఉందని, అందుకే ఈ ఘటనపై దర్యాప్తు చేయడానికి కేంద్రం ఒక్క బృందాన్ని కూడా పంపలేదని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలోని చోటే భాయ్‌ని (రేవంత్), ఢిల్లీలోని బడేభాయ్ (మోదీ) ఎప్పటికప్పుడు కాపాడుతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, ఈ ఘటనకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కేటీఆర్ హెచ్చరించారు.

సర్వే నెంబర్ ఒకచోట.. సాగు మరోచోట

» కేటాయించిన భూమిలో కాకుండా మరో భూమిలో సాగు చేస్తున్న రైతులు

» తాటిపర్తి గ్రామంలో సమస్య వెలుగులోకి

» పరిష్కారం దిశగా అధికారుల కసరత్తు

యాచారం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతులు ఏళ్ల తరబడి ఒక సర్వే నెంబర్‌కు బదులు మరో సర్వే నెంబర్‌లోని భూమిని సాగు చేసుకుంటున్న విషయం రంగారెడ్డి జిల్లా యాచారం మండలం తాటిపర్తిలో వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన 70 కుటుంబాలు సర్వే నెంబర్ 104లోని 145 ఎకరాల భూమిని ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నాయి. దీనిని ఫార్మాసిటీకి గతంలో ప్రభుత్వం కేటాయించింది. ఈ భూమిని రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులు సర్వే చేయడానికి రాగా, రైతులు అడ్డుకున్నారు. ఏళ్ల తరబడి ఇవే భూముల్లో సాగు చేసుకుంటున్నామని, తమ పట్టా భూముల జోలికి రావొద్దని అధికారులను కోరారు. ఈ భూముల రికార్డులను రెవెన్యూ అధికారులు పరిశీలించగా అసలు విషయం బయటపడింది. సర్వే నెంబర్ 109కి బదులు సర్వే నెంబర్ 104లోని భూమిలో రైతులు సాగు చేసుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ విషయం తెలిసి సదరు రైతులు అవాక్కయ్యారు. చాలా ఏళ్ల క్రితం వీరు గ్రామానికి చెందిన ఇతర రైతుల వద్ద ఈ భూములు కొనుగోలు చేశారు. భూవిక్రయదారులకు సర్వే నెంబర్ 104తో పాటు 109పై కూడా హక్కులుండడంతో అప్పట్లోవారు చూపిన భూములనే సాగు చేసుకుంటున్నారు. ఇప్పుడు అధికారుల సర్వేలో అసలు విషయం బయటపడింది. సర్వే నెంబర్ 109లో ఉన్న 145 ఎకరాలను రైతులకు కేటాయించడానికి రెవెన్యూ అధికారులు రెండు నెలలుగా కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం సర్వే నెంబర్ 104లో ఏయే రైతు ఎన్ని ఎకరాలు సాగు చేస్తున్నారో.. అంతే భూమిని సర్వే నెంబర్ 109లో కేటాయించి సమస్యను పరిష్కరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

చట్టసభల సభ్యులకూ 'నో వర్క్.. నో పే'!

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు అయ్యన్న వినతి

ఉద్యోగులు విధులకు రాకుంటే ఇదే చేస్తున్నాం

అసెంబ్లీ పనిదినాలు పెరగాలి

ఏడాదిలో 60 రోజులైనా సభ జరగాలి

సదస్సులో ఏపీ శాసనసభాపతి సూచన

తిరుపతి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశంలోని చట్టసభల సభ్యులకు కూడా 'నో వర్క్ - నో పే' విధానం వర్తింపజేయాలని ఏపీ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. తిరుపతిలో ఆదివారం ప్రారంభమైన పార్లమెంటరీ, అసెంబ్లీల మహిళా సాధికార కమిటీల జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగులు విధులకు గైర్హాజరైతే నో వర్క్-నో పే అంటున్నామని, లేనిపక్షంలో అలాంటి ఉద్యోగులను సస్పెండ్ చేస్తున్నామని.. అలాంటప్పుడు ఈ విధానం చట్టసభల సభ్యులకు ఎందుకు వర్తించదని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో కొందరు సభ్యులు అసెంబ్లీకి హాజరు కావడం లేదంటూ పరోక్షంగా వైసీపీ సభ్యులనుద్దేశించి అన్నారు. 'ప్రజలు తమ సమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవడానికి గెలిపిస్తే సభ్యులు సభకే రాకుండా దూరంగా ఉండి మాట్లాడడం ఏమిటి? ఆ మాట్లాడేదేదో సభలోనే మాట్లాడవచ్చు కదా! ఏపీలోనే కాకుండా ఇలాంటి వారిపై మిగతా రాష్ట్రాల్లో కూడా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. ప్రజా ప్రతినిధులు బాధ్యత లేకుండా వ్యవహరించడం సరైంది కాదు. అలాంటి సభ్యులకు నో వర్క్-నో పే విధానం అమలు చేసే దిశగా ఆలోచించాలి' అని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను అయ్యన్న కోరారు. దేశవ్యాప్తంగా అన్ని శాసనసభలూ ఏడాదికి కనీసం 60 రోజులు పనిచేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు చట్టసభల పనిదినాలు పెరగాలని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఏడాదికి 30-45 రోజులు మాత్రమే అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయని, దానివల్ల అన్ని అంశాలనూ చర్చించడానికి సమయం సరిపోవడం లేదన్నారు. ఏడాదిలో 60 రోజులైనా చట్టసభలు పనిచేసేలా దేశంలోని అన్ని అసెంబ్లీలకూ సూచనలు జారీ చేయాలని ఓం బిర్లాను అభ్యర్థించారు. శాసనసభ కమిటీలు బలోపేతం కావలసిన అవసరముందని, ఆయా అంశాలకు సంబంధించి బలమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన ఆవశ్యకత కూడా ఉందని తెలిపారు. అసెంబ్లీ కమిటీల్లోని సభ్యులు, చైర్‌పర్సన్లు మహిళా సాధికారతతో పాటు రాష్ట్ర భవిష్యత్‌కు సంబంధించిన నిర్ణయాలు కూడా తీసుకుని అసెంబ్లీలకు సిఫారసు చేయాలని సూచించారు. అసెంబ్లీలో అన్ని రకాల సమస్యలపై చర్చించడం, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం కష్టమని, అసెంబ్లీ కమిటీలు ఆ బాధ్యత తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. ఏపీలో ముగ్గురు మహిళా మంత్రులున్నారని, మిగిలిన రాష్ట్రాలు కూడా మంత్రివర్గాల్లోకి మహిళలను తగినంత మందిని చేర్చుకోవాలని ఆయన కోరారు. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ.. పార్లమెంటు మహిళా సాధికార కమిటీలో కనీసం ఇద్దరు మగవారిని సభ్యులుగా నియమించాలని లోక్‌సభ స్పీకర్‌ను కోరారు. మహిళా సాధికారతకు పురుషులు కూడా కృషి చేసే అవకాశం కల్పించాలని సూచించారు.



ఆర్థోప్లాస్టీ, ఆర్థోస్కోపీ సమ్మిట్ వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి, డాక్టర్ మిథిన్ ఆచి తదితరులు

శస్త్రచికిత్స అవసరం లేకుండానే

కీళ్ల సమస్యలకు పరిష్కారం

- **శస్త్రచికిత్సల్లో కచ్చితత్వం, ఆధునికతపై దృష్టి పెట్టాం**
- **మీడియాతో సీనియర్ ఆర్థో సర్జన్ సోమశేఖర్‌రెడ్డి**
- **అపోలో ఆస్పత్రిలో ఆర్థోప్లాస్టీ ఆర్థోస్కోపీ సమ్మిట్**

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మోకాలు, హిప్ రీప్లేస్‌మెంట్ వంటి శస్త్రచికిత్సల అవసరం లేకుండానే జాయింట్స్ సమస్యలకు పరిష్కారం చూపే వినూత్న విధానాలపై దృష్టి సారించామని అపోలో ఆస్పత్రి సీనియర్ ఆర్థో, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ ఎన్. సోమశేఖర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఆర్థోస్కోపీ సొసైటీ (హైదరాబాద్), ట్విన్ సిటీస్ ఆర్థోపెడిక్ సొసైటీ (టీసీవోఎస్), తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్, అపోలో ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని అపోలో ఇన్‌స్టిట్యూట్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్‌లో 9వ ఆర్థోప్లాస్టీ, ఆర్థోస్కోపీ సమ్మిట్ ఆదివారం నిర్వహించారు. ఈ సదస్సుకు ఆర్గనైజింగ్ చైర్మన్‌గా డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి, కోర్సు డైరెక్టర్‌గా డాక్టర్ మిథిన్ ఆచి వ్యవహరించారు. సదస్సులో చర్చించిన అంశాలను సోమశేఖర్ రెడ్డి మీడియాకు వివరించారు. జాయింట్స్ మధ్య కార్టిలేజ్‌ను పునరుత్పత్తి చేసే నూతన సాంకేతికతపై సదస్సులో విస్తృతంగా చర్చించామని తెలిపారు. ఆర్థోపెడిక్ చికిత్సల్లో కొత్త విధానాలను విస్తరింపజేయడంతో పాటు ప్రతి రోగి వేగంగా కోలుకోవాలని లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. శస్త్రచికిత్సల్లో మరింత కచ్చితత్వం, ఆధునికత దిశగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. యువ ఆర్థోపెడిక్ సర్జన్ల నైపుణ్యాలు మెరుగుపరిచేందుకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించామని చెప్పారు. సీనియర్ ఆర్థో, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, ఆర్థోప్లాస్టీ ఆర్థోస్కోపీ సమ్మిట్ కోర్సు డైరెక్టర్‌గా డాక్టర్ మిథిన్ ఆచి మాట్లాడుతూ ఆర్థోపెడిక్ చికిత్సల్లో అత్యాధునిక పురోగతులను ప్రత్యేకంగా చర్చించామన్నారు. జాయింట్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సల్లో రోబోటిక్స్ పాత్రపై అవగాహన కల్పించడంతోపాటు మోకాలి కార్టిలేజ్ గాయాలకు చికిత్స చేసే విధానంపైనా చర్చించినట్లు తెలిపారు. రోబోటిక్ శస్త్రచికిత్స దీర్ఘకాలిక ప్రభావంపై ఇంకా పరిశోధనలు జరుగుతున్నప్పటికీ.. హిప్ రీప్లేస్‌మెంట్‌లో కప్‌ను కచ్చితంగా అమర్చడం ద్వారా దాని ప్రయోజనాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని వివరించారు. దేశీయంగా అభివృద్ధి చేసిన రోబోటిక్ పరిష్కారాలు ఖర్చులను గణనీయంగా తగ్గించగల సామర్థ్యం కలిగి ఉండటమే కాక, కచ్చితమైన చికిత్సను అందించగలవని అభిప్రాయపడ్డారు.

జీవో 317 అమలులో అవకతవకలు!

- **ఈ నెల 25న తిగారియా బస్సు యాత్ర**

హైదరాబాద్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎస్సీ గురుకుల సొసైటీలో 317 జీవో అమలులో అవకతవకలను నిరసిస్తూ ఈ నెల 25న హైదరాబాద్‌లో బస్సు యాత్ర నిర్వహించాలని తెలంగాణ గవర్నమెంట్ ఆల్ రెసిడెన్షియల్ ఇనిస్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (తిగారియా) నిర్ణయించింది. తిగారియా సంఘ భవన్‌లో జరిగిన సమావేశంలో సెంట్రల్ యూనియన్ జనరల్ సెక్రటరీ మధు సూదన్‌తో పాటు నేతలు గణేశ్, జనార్దన్, భిక్షం యాదవ్ మాట్లాడారు. స్థానికత కోల్పోయే విధంగా జోన్లకు సంబంధం లేకుండా బదిలీలు జరిపారని, స్పష్టమైన ఆదేశాలను పక్కనపెట్టి ఇష్టానుసారంగా పోస్టుల కేటాయింపులు చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు.

వెయ్యికి పైగా కాలేజీలు బంద్

(మొదటిపేజీ తరువాయి)

ఇస్తామంటూ బడ్జెట్‌లో కేటాయించిన రూ.1200 కోట్లు తక్షణం చెల్లించాలని, నిరుటి బకాయిలు డిసెంబరు-31 నాటికి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కానీ దీనిపై వారికి కచ్చితమైన హామీ లభించలేదు. బంద్‌పై ఆదివారం హైదరాబాద్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూలో అత్యవసరసర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, లా, మేనేజ్మెంట్ సహా అన్ని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల ప్రతినిధులూ కలిపి మొత్తం 760 మంది పాల్గొన్నారు. నోటీసు ఇచ్చినా ప్రభుత్వం నుంచి ఖచ్చితమైన హామీ లభించకపోవడంతో ముందుగా ప్రకటించిన విధంగా సోమవారం నుంచి నిరవధిక బంద్ చేయాలని సమావేశంలో తీర్మానించారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా సోమవారం (సెప్టెంబరు 15) 'ఇంజినీర్స్ డే'ను బ్లాక్ డేగా నిర్వహించనున్నట్టు ఇంజినీరింగ్ కాలేజీలు ప్రకటించాయి. ఈనెల 21, 22న 10 లక్షల మంది విద్యార్థులతో నగరంలో భారీ ధర్నా నిర్వహిస్తామని సమాఖ్య ప్రతినిధులు ప్రకటించారు. ఇప్పటికే కాలేజీలకు టోకెన్లు అందించిన రూ.1200 కోట్లు విడుదల చేయాలని, కిందటి సంవత్సరం బకాయిలను ఈ ఏడాదిలోపు విడుదల చేస్తామని హామీ ఇస్తే సమ్మె విరమిస్తామని ప్రకటించారు.



అత్యవసర సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న యాజమాన్యాలు

పాపమంతా గత ప్రభుత్వానిదే: సమాఖ్య చైర్మన్

"నాలుగేళ్లుగా ఫీజు బకాయిలు విడుదల చేయలేదు. కాలేజీల నిర్వహణ భారంగా మారింది. సిబ్బందికి జీతాలు చెల్లించలేని దుస్థితిలో కాలేజీల యాజమాన్యాలు ఉన్నాయ"ని తెలంగాణ ఉన్నత విద్యాసంస్థల సంఘాల సమాఖ్య చైర్మన్ నిమ్మటూరి రమేశ్ బాబు అన్నారు. ఫీజులకు సంబంధించి ఇప్పటివరకూ ఉన్న మొత్తం రూ.7500 కోట్ల బకాయిల్లో.. రూ.5500 కోట్లు కేసీఆర్ ప్రభుత్వ హయాం నాటివేనని.. గత ప్రభుత్వం చెల్లించకపోవడంతో సమస్య మరింత ఇబ్బందికరంగా మారిందని ఆయన పేర్కొన్నారు. "కాంగ్రెస్ ప్రభుత్వంపై సానుభూతి ఉంది. విద్యాశాఖ మంత్రిత్వ బాధ్యతలు కూడా చూస్తున్న సీఎం రేవంత్ రెడ్డిపై గౌరవం ఉంది. అందుకే కొత్త ప్రభుత్వం ఏర్పడి 20నెలలు గడుస్తున్నా ఎన్నడూ ఒత్తిడి చేయలేదు. ఇప్పుడు పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది' అని రమేశ్‌బాబు ఆవేదన వెలిబుచ్చారు. సమస్యను పరిష్కరించేందుకు వెళ్తే కొందరు ఐఏఎస్‌లు హేళనగా మాట్లాడారని మండిపడ్డారు. "కనీసం ఒక్క నెలైనా జీతం లేకుండా పని చేసేందుకు ఐఏఎస్‌లు సిద్ధంగా ఉన్నారా? దసరా సంబరాలు ఐఏఎస్‌లు, ప్రభుత్వ అధికారులే చేసుకోవాలా? ప్రైవేటు కాలేజీల సిబ్బంది చేసుకోకూడదా?"అని ప్రశ్నించారు. తమ బంద్ నిర్ణయంతో ఇబ్బందులు పడనున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బందికి ఆయన క్షమాపణలు చెప్పారు. సోమవారం నుంచి కాలేజీలు ఉండవని, విద్యార్థులు కళాశాలలకు రావద్దని కోరారు.

కాంట్రాక్టర్లు బెదిరించి వసూలు చేసుకున్నరు..

ఉన్నత విద్యను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని.. ఈ ప్రభుత్వం సైతం అదే దారి అవలంబిస్తోందని సమాఖ్య సెక్రటరీ జనరల్ కేఎస్ రవికుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కే.సునీల్ కుమార్, గ్రామీణ ఇంజినీరింగ్ కాలేజీల యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు అలీజాపూర్ శ్రీనివాస్, డిగ్రీ, పీజీ కాలేజీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ సూర్యనారాయణ రెడ్డి విమర్శించారు. ఫీజు బకాయిలు నాలుగేళ్లగా రాకపోయినా తాము మౌనంగా ఓపిక పట్టామని వారు పేర్కొన్నారు. కాంట్రాక్టర్లు మాత్రం గత ప్రభుత్వంలో, ఈ ప్రభుత్వంలోనూ ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి తమకు రావాల్సిన బకాయిలను బెదిరించి వసూలు చేసుకున్నారని ఆరోపించారు. ఉన్నత విద్యా రంగాన్ని మాత్రం ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

పరీక్షలన్నీ వాయిదా.. !

ప్రస్తుతం ఫార్మసీ ద్వితీయ, తృతీయ సంవత్సరం పరీక్షలతోపాటు బీఈడీ పరీక్షలూ జరుగుతున్నాయి. ఇంజనీరింగ్ ఇంటర్నల్ పరీక్షలూ కొనసాగుతున్నాయి. బంద్ నేపథ్యంలో అన్ని కాలేజీలకు తాళాలు వేస్తామని.. పరీక్షలను వాయిదా వేసుకోవాలని అన్ని విశ్వవిద్యాలయాలు ఉపకులపతులు, రిజిస్ట్రార్‌లకు ఫాతీ లేఖలు రాసింది.

వెయ్యికి పైగా కాలేజీలు బంద్

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు వెయ్యికి పైగా ప్రైవేటు కాలేజీలు సోమవారం నుంచి జరగనున్న బంద్‌తో మూతపడనున్నాయి. వాటిలో 170 ఇంజనీరింగ్ యూజీ, పీజీ కాలేజీల్లో దాదాపు 5 లక్షల విద్యార్థులు ఉండగా, డిగ్రీ, పీజీ, ఇతర కాలేజీలన్నీ కలిపి 850వరకు ఉన్నాయి. వాటిలో దాదాపు 9 లక్షల మంది విద్యార్థులున్నారు. ఈ 14 లక్షల మంది విద్యార్థులపై బంద్ ప్రభావం పడనుంది. ఆయా కాలేజీల్లో పనిచేసే దాదాపు 25వేల మంది బోధన, బోధనేతర సిబ్బంది ఇంటికే పరిమితం కానున్నారు.

సూడాన్ దేశస్థుడి బహిష్కరణ

- **12 ఏళ్లుగా భారత్‌లో తిష్టవేసి డ్రగ్స్ దందా**

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): స్టూడెంట్ వీసాపై వచ్చి.. గడువు ముగిసి 12 ఏళ్లు అవుతున్నా భారత్‌లోనే ఉంటూ మాదక ద్రవ్యాల దందాకు పాల్పడుతున్న సూడాన్ దేశస్థుడిని హెచ్ న్యూ పోలీసులు దేశ బహిష్కరణ చేశారు. హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ డీసీపీ వై.వి.సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం సూడాన్ దేశానికి చెందిన జబల్ అలియాస్ కుర్రా(34), 2012లో నగరానికి వచ్చి అద్దెంటిలో దిగాడు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో చదువును మధ్యలోనే ఆపేశాడు. టాంజానియా దేశస్థునితో కలిసి మాదక ద్రవ్యాలకు అలవాటుపడ్డాడు. 12 ఏళ్లలో మూడుసార్లు డ్రగ్స్ అమ్ముతూ పోలీసులకు పట్టుబడి, జైలు పాలయ్యాడు. ఇలాంటి అక్రమార్కులను దేశం నుంచి బహిష్కరించాలన్న సీపీ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు అతనిపై ఉన్న కేసుల విచారణ పూర్తిచేసి, న్యాయ పరమైన చిక్కులను అధిగమించడానికి పోలీసులు ఏడాది కాలంగా కృషి చేయాల్సి వచ్చింది. ఎట్టకేలకు ఢిల్లీలో సూడాన్ ఎంబసీ నుంచి ప్రయాణ పత్రాన్ని పొందిన పోలీసులు.. శుక్రవారం ముంబై విమానాశ్రయం నుంచి పంపించారు.

ఐఏఎస్ వర్సెస్ టీడీపీ మహిళా ఎంపీ

కార్తికేయ మిశ్రా, శబరి మధ్య తీవ్ర వాగ్వాదం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్, సీఎంవో ఉన్నతాధికారి కార్తికేయ మిశ్రా.. నంద్యాల టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. గత శుక్రవారం ఢిల్లీలో నూతన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారంలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు వచ్చినప్పుడు ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. జన్‌పథ్‌లోని తన నివాసం నుంచి చంద్రబాబు రాష్ట్రపతి భవన్‌కు వెళ్తుండగా.. శబరి ఆయనతో మాట్లాడేందుకు తలుపు దగ్గర నిలుచున్నారు. అక్కడ మీరెందుకని మిశ్రా ఆమెను దురుసుగా ప్రశ్నించినట్లు తెలిసింది. మిశ్రా తీరుపై మనస్తాపానికి గురైన ఆమె.. మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ ఘటన ప్రస్తుతం ఢిల్లీలో హాట్ టాపిక్‌గా మారింది.

వైద్య ఆరోగ్య శాఖకు 'ఆర్థిక' సుస్తీ!

- **అరకొర నిధులిస్తున్న ప్రభుత్వం**
- **ఔషధ సరఫరాపై చేతులెత్తేసిన ఏజెన్సీలు**
- **ఆరోగ్యశ్రీ బిల్లులే రూ.1080 కోట్లు పెండింగ్!**
- **టీజీఎంఎస్ఐడీసీ ఔషధ బకాయిలు రూ.1019 కోట్లు**



హైదరాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖను 'ఆర్థిక' సుస్తీ చేసింది. అత్యవసర శాఖకు ప్రభుత్వం అరకొర నిధులు విడుదల చేస్తోంది. ఈ శాఖలోని ఏ విభాగానికీ సకాలంలో బిల్లులు చెల్లించడం లేదు. ఓ వైపు ప్రైవేటు ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తామని హెచ్చరించగా.. మరోవైపు ఆస్పత్రుల్లో కనీస ఔషధాలు ఉండట్లేదు. మందులు సరఫరా చేసే ఏజెన్సీలు సైతం బిల్లులు రాక చేతు లెత్తేస్తున్నాయి. దీంతో పేదలకు వైద్యసేవలందించే ఈ విభాగం కుప్పకూలే పరిస్థితి నెలకొంది. వైద్య ఆరోగ్యశాఖలో అన్ని విభాగాలకు కలిపి సుమారు రూ.3 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. వైద్యఆరోగ్యశాఖలో ప్రతి నెలా సగటున కనీసం రూ.535 కోట్లు అవసరం అవుతున్నాయి. వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులు, బోధనాస్పత్రుల్లో రోగులకిచ్చే డైట్ చార్జీలకు నెలకు రూ.8.5 కోట్లు కావాలి. రాష్ట్రంలోని అన్ని ఆస్పత్రుల్లో ఔషధాలకు రూ.50 కోట్లు, పారిశుధ్య, భద్రత, రోగుల సంరక్షణ సిబ్బందికి రూ.31 కోట్లు, అద్దెలకు రూ.2 కోట్లు, విద్యుత్తు బిల్లులకు రూ.10.08 కోట్లు, ఇతర ఖర్చు లకు రూ.0.65 కోట్లు కావాలి. వీటితో పాటు అత్యవసర సేవలందించే విభా గాల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న వైద్యులు, స్టాఫ్‌నర్సులకు రూ.185.58కోట్లు కావాలి. జూనియర్ డాక్టర్లు, ఇతరుల స్టయిపెండ్ కోసం ప్రతి నెలా రూ.47.34 కోట్లు అవసరం అవుతున్నాయి. ఇక ఆస్పత్రుల్లో సివిల్ పనులు, కొత్త నిర్మాణాలకు రూ.100 కోట్లు కావాల్సి వస్తోంది. ఆరోగ్యశ్రీ బిల్లుల చెల్లింపు కోసం కనీసం రూ.100 కోట్లు కావాలి. మొత్తం మీద ప్రతినెలా రూ.535 కోట్లు కావాలి. కానీ, ఆర్థిక శాఖ నుంచి ఇందులో పావు వంతు నిధులు కూడా విడుదల కావడం లేదని వైద్య వర్గాలు చెబుతున్నాయి. ఆరోగ్యశ్రీకి నెలకు రూ.50 కోట్లు, తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ)కు మరో రూ.50 కోట్లు, జూడాల స్టయిపెండ్ మాత్రమే విడుదల చేస్తున్నారు. మిగతా అవసరాలకు ఒక్క రూపాయి కూడా చెల్లించడం లేదని అంటున్నారు. ఔషధ కార్పొరేషన్‌కు చెల్లించే 50 కోట్లు కూడా ఒక నెల మందుల బిల్లుల కోసం ఇస్తే.. మరో నెల ఆస్పత్రుల నిర్మాణాల కోసం విడుదల చేస్తున్నారు.

పెండింగ్ బకాయిలు రూ.3 వేల కోట్ల పైనే..

వైద్య ఆరోగ్యశాఖలో పెండింగ్ బిల్లులు సుమారు రూ.3000 కోట్ల పైచిలుకు ఉన్నాయని వైద్య వర్గాలు చెబుతున్నాయి. ఆరోగ్యశ్రీ కింద ఆస్పత్రులకు రూ.1080 కోట్లు బకాయిలున్నాయి. అలాగే టీజీఎంఎస్ఐడీసీకి రూ.1019 కోట్లు, కాంట్రాక్టు వైద్యులు, ఇతర మానవ వనరుల వేతనాలకు రూ.226 కోట్లు, విద్యుత్తు బకాయిలు రూ.195 కోట్లు, ఐహెచ్ఎఫ్ఎంఎస్ సిబ్బంది వేతనాలు రూ.89 కోట్లు, డైట్ బిల్లులు రూ.7.23 కోట్లు, అద్దెలు రూ.11 కోట్లు, స్టయిపెండ్ రూ.8.11 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఇవిగాక జాతీయ ఆరోగ్య మిషన్ కింద కేంద్రం ఇచ్చే నిధులకు రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం మ్యాచింగ్ గ్రాంట్ కలపాలి. అందులోనూ రూ.158 కోట్లు పెండింగ్ పెట్టారు. వీటితో పాటు ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు కూడా పెద్దమొత్తంలో ఉన్నాయని వైద్యవర్గాలు పేర్కొన్నాయి.

నర్సింగ్ కాలేజీలకు రూ.100 కోట్లు..

ఇక ప్రైవేటు నర్సింగ్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు స్టయిపెండ్ రెండు మూడేళ్లుగా చెల్లించడం లేదు. ఇవి కూడా రూ.100 కోట్ల వరకు పెండింగ్ ఉన్నట్లు యాజమాన్యాలు చెబుతున్నాయి. వాస్తవానికి ఇందులో కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు ఇస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం మరో 40 శాతం ఇస్తే.. ఆ మొత్తం విడుదలవుతుంది. రాష్ట్ర సర్కారు 40 శాతం విడుదల చేయకపోవడంతో రెండు మూడేళ్లుగా ప్రైవేటు కాలేజీల్లో చదివే నర్సింగ్ విద్యార్థులకు స్టయిపెండ్ నిలిచిపోయింది. అక్కడ చదివే వారిలో మెజారిటీ విద్యార్థులు ఎస్సీ, ఎస్టీలేనని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి.

తిరుమల కొండలు, ఎర్రమట్టి దిబ్బలకు అంతర్జాతీయ గుర్తింపు

- **సహజ వారసత్వ సంపదగా గుర్తించిన యునెస్కో**

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14: కలియుగ వైకుంఠంగా ప్రసిద్ధి చెందిన తిరుమల కొండలతోపాటు విశాఖలోని ప్రఖ్యాత ఎర్రమట్టి దిబ్బలకు అంతర్జాతీయ గుర్తింపు దక్కింది. సహజ వారసత్వ సంపదలైన తిరుమల కొండలు, విశాఖ ఎర్రమట్టి దిబ్బలు సహా భారత్‌లోని ఏడు ప్రదేశాలు ప్రపంచ వారసత్వ గుర్తింపు కోసం యునెస్కో రూపొందించిన తాత్కాలిక జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ఈ జాబితాలో మహారాష్ట్రలోని పాంచ్‌గని, మహాబలేశ్వర్ ప్రాంతాల్లో ఉన్న డెక్కన్ ట్రాప్స్, కర్ణాటకలోని ఉడిపిలో ఉన్న సెయింట్ మేరీస్ ఐలాండ్ క్లస్టర్ జియోలాజికల్ హెరిటేజ్, మేఘాలయాలోని మేఘాలయన్ ఏజ్ గుహలు (ఈస్ట్ ఖాశీ హిల్స్), నాగాలాండ్‌లోని నాగా హిల్ ఓఫియోలైట్, కేరళలోని వర్కాల ఉన్నట్టు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఈ విషయాన్ని యునెస్కోలో భారత ప్రతినిధి బృందం 'ఎక్స్'లో ట్వీట్ చేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.